ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కడప   fb.com/vaartha

'కుంభ్'లో పడవ నడిపి రూ. 30 కోట్లు సంపాదన 5లో

అమెరికా సీక్రెట్ సర్వీసు ఏజెంట్‌గా 13 యేళ్ల బాలుడు

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-3-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 33 పేజీలు: 10+4 వెల: 6.50

# ఎపికి అండగా ఉంటాం



బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి అమిత్‌షాకు జ్ఞాపికను అందిస్తున్న సిఎం చంద్రబాబు

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు హామీ ఇచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

### కేంద్ర మంత్రులు గడ్కరీ, నిర్మలా సీతారామన్‌ను కూడా కలిసి పెండింగ్ నిధులపై చర్చించిన ముఖ్యమంత్రి

### పోలవరం, అమరావతి వేగంగా నిర్మాణానికి సహకరించాలని వినతి

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వానికి విభజన హామీలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కోరారు. బుధవారం మధ్యాహ్నాం నుంచి సిఎం చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఢిల్లీ ఎయిర్ పోర్టులో ఆయనకు టిడిపి కేంద్రమంత్రులు, ఎంపీలు స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. ఎపికి చెందిన పలు అంశాలపై అమిత్‌షాతో చర్చించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలు, అమరావతి, పోలవరం తదితర అంశాలపై కేంద్రమంత్రులతో మాట్లాడారు. పోలవరం, అమరావతి తమ రాష్ట్రానికి అత్యంత కీలక వనరులు కానున్నాయని ఈ దిశలో కేంద్రం సహకరించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో ఎన్డీఏ పనితీరుపై అమిత్‌షా చంద్రబాబును అభినందించారు. ఎంఎల్‌సీల ఎన్నికల్లో కూటమి పక్షాలు సమిష్టిగా సాధించిన విజయాన్ని అభినందించారు. సమిష్టిగా మనం సాధించాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి, ఆంధ్రాకు >>2



పోలీసులతో మాట్లాడుతున్న అధికారులు

# వెటర్నరీ వర్సిటీలో ఉద్రిక్తత

## హాస్టల్స్ మూసివేతపై భగ్గుమన్న జూడాలు

### వర్సిటీని చుట్టుముట్టి గేటుపైనుంచి దూకి వచ్చిన పోలీసులు

**తిరుపతి విద్య, మార్చి 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న వైద్య విద్యార్థులతో సమానంగా తమకు న్యాయం చేసి గౌరవ వేతనం అందించాలంటూ గత 31రోజులుగా సమ్మె చేస్తున్న విద్యార్థులపై వర్సిటీ అధికారులు బెదిరింపులకు దిగుతూ హాస్టల్స్‌ను మూసివేశారు. దీంతో ఆగ్రహించిన పశువైద్య విద్యార్థులు ఎస్వీ వెటర్నరీ వర్సిటీని అష్టదిగ్బంధం చేశారు. వర్సిటీలోకి అధికారులను, ఉద్యోగులను ప్రవేశించకుండా గేట్లకు తాళాలు వేసి నినాదాలతో హోరెత్తించారు. అధికారులు తీరుకు నిరసనగా విద్యార్థులు తమలగేజీలను వర్సిటీ ప్రధాన గేట్ల వద్దఉంచి మేము ఎక్కడికి వేళ్లాలంటూ నిలదీశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న వర్సిటీ అధికారులు విద్యార్థులను బెదిరిస్తూ సమ్మె విరమిస్తేగాని హాస్టల్స్‌ను తెరవమంటూ హెచ్చరించారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో బుధవారం ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం >>2

## జగన్‌ను క్షమించి వదిలేస్తున్నా



### ఆయన పార్టీకి ప్రతిపక్ష హోదా సాధ్యంకాదు..

### న్యాయప్రక్రియ కొలిక్కి వచ్చేదాకా వేచి చూడ్దామనుకుంటున్నా: స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టసభల నిబంధనలను అనుసరించే మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ప్రతిపక్షహోదా కల్పించడం సాధ్యం కాదు అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ప్రతిపక్ష హోదాపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హైకోర్టుకు కూడా వెళ్లారన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా తనను ప్రకటించేలా ఆదేశించాలని కోర్టులో ఆయన పిటిషన్ వేశారని చెప్పారు. ఇందులో సభాపతిని, శాసన వ్యవహారాల మంత్రిని ప్రతివాదులుగా చేర్చారని పేర్కొన్నారు. న్యాయ ప్రక్రియ కొలిక్కి వచ్చేవరకు తాను వేచి చూద్దామని అనుకున్నట్లు వివరించారు. కానీ ఇటీవల కాలంలో జగన్, వైఎస్సార్సీపీ నేతల వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా జగన్‌కు ప్రతిపక్ష హోదాపై సభలో స్పీకర్ ప్రకటన చేశారు. స్పీకర్‌కు హైకోర్టు సమన్లు జారీ చేసిందని కూడా వార్తలు వస్తున్నాయని అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. జగన్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందో లేదో ఇంకా నిర్ధారణ జరగలేదన్నారు. కానీ ఆయన నిరాధార ఆరోపణలతోనే తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. జగన్ చేస్తున్న ఆరోపణలు గందరగోళానికి దారితీస్తున్నాయని చెప్పారు. అందుకే తప్పుడు ప్రచారానికి తెరదించేందుకు నిర్ణయించినట్లు వివరించారు.

లోక్‌సభలో టిడిపి నేత ఉపేంద్రకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చారనేది అవాస్తవం. అప్పట్లో లోక్ సభలో టిడిపి గ్రూపునేత నాయకుడిగానే గుర్తించారు. ఏమీ తెలకముందే ప్రతిపక్ష హోదాపై జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఎంతటి వారిపైనైనా అసత్యాలు ప్రచారం చేసే ధోరణితో జగన్ వెళ్తున్నారు. తప్పుడు ప్రచారానికి తెరదించేందుకు రూలింగ్ ఇవ్వాలని నిర్ణయించా >>2

# ఆ భూములు వెనక్కి!

## గత ప్రభుత్వ హాయాంలో అడ్డగోలు జీవోలతో బలవంతంగా లాక్కొన్న భూములు వెనక్కి తీసుకుంటాం

### నూతన ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని అమలు చేస్తాం

### ఢిల్లీలో మీడియాతో సిఎం చంద్రబాబు

**విజయవాడ, మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గత ప్రభుత్వ హాయంలో అడ్డగోలు జీవోలతో బలవంతంగా లాక్కొన్న భూములను వెనక్కు తీసుకుంటామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఇందుకోసం నూతన ల్యాండ్ గ్రాబింగ్ బిల్లును అమలులోకి తీసుకుని వస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర సహకారం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తే తమకూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఎపి రాజకీయ పరిణామాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోను, రాష్ట్రానికి ఆర్థిక సహకారంపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తోను, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీతో వరుసగా చంద్రబాబు భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అవి ఆయన మాటల్లోనే.. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలను కైవసం చేసుకున్నాం. ప్రజలు మావైపే ఉన్నారనేందుకు ఈ ఫలితాలే నిదర్శనం. అభివృద్ధి సంక్షేమమే మా ప్రధాన ధ్యేయం. ఇవాళ ఢిల్లీ రెండు కీలక సమావేశాలు జరిగాయి. ఎపి రాజకీయ పరిణామాలపై అమిత్ షాతో చర్చించాం. ఎన్డీఏ ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చించాం. ఎపి ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు అంశంపై చర్చ జరిగింది. భూములకు సంబంధించి కంప్యూటరీకరణలో కొన్ని సమస్యలు.. గతంలో ప్రైవేట్ భూములను 22నిలో చేర్చారు. గతంలో అటవీ భూములు కూడా ఆక్రమించార్శు. గుజరాత్‌లో ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు విజయవంతంగా అమలైంది. ఎపిలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం.

ల్యాండ్ గ్రాబింగ్ బిల్లులో పట్టణ, గ్రామీణ భూములు ఉన్నాయి. ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు వచ్చాక నేరాలపై పిడి కేసులు పెట్టనున్నాం. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు మరో బిల్లు తీసుకొస్తాం. ఆంధ్రప్రదేశ్ ఐటిజిసిసి పాలసీ (2024-2029) ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణ. సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా భారతదేశ ఐటి రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని భావిస్తున్నది. డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, వర్క్ ఫ్రమ్ హోమ్, కోవర్కింగ్ స్పేసెస్, డేటా ఆధారిత గవర్నెన్స్‌కి ఈ విధానం ప్రాధాన్యత ఇస్తుంది. ఇలాంటి వ్యూహాత్మక చొరవలు, అచంచలమైన నిబద్ధత ద్వారా, ఆంధ్రప్రదేశ్ ఉపాధి, అధునాతన నైపుణ్యానికి కేంద్రంగా రూపాంతరం చెందుతున్నది. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆంధ్రప్రదేశ్ యువతకు ఉపాధి కల్పించడానికి, ఉపాధి భత్యం ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

**నీటి భద్రత**

ప్రతి ఇంటికి తాగునీరు అందించడం, సమాన పంపిణీ, వ్యవసాయ స్థితిస్థాపకత కోసం నదుల అనుసంధానం, సంరక్షణ చర్యల ద్వారా అన్ని రంగాల్లో నీటి వినియోగాన్ని గరిష్టతరం చేయడాన్ని కట్టుదిట్టం చేస్తూ నీటి సురక్షిత భవిష్యత్తుకు ఆంధ్రప్రదేశ్ కట్టుబడి ఉంది. సాగునీటి ప్రాజెక్టులు మరియు మౌలిక సదుపాయాలను పూర్తిగా ఉపేక్షించడంతో రాయలసీమ. ఉత్తరాంధ్ర ప్రాంతాలలోని ప్రాజెక్టులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మా ప్రభుత్వం తిరిగి దృష్టిసారించి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పోలవరానికి అనుసంధానం చేస్తున్నాం. మన జీవనాడి అయిన పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు 73 శాతం పురోగతి సాధించి, వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే కాకుండా 28.50 లక్షల మందికి లబ్ధిని చేకూరుస్తూ, 540 గ్రామాలకు మంచినీటిని కూడా అందిస్తుంది. పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చ >>2

## జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు



**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరును ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఖరారు చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం ప్రకటన జారీ చేసింది. సాధారణ ఎన్నికల్లో ఆయన అనకాపల్లి నుంచి జనసేన తరపున ఎంపీగా పోటీ చేయాలని భావించారు. అయితే పొత్తులో భాగంగా ఆస్థానం బిజెపికిఇచ్చారు. పొత్తు కోసం సీటును త్యాగం చేశారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం పని చేశారు. ఆ తర్వాత రాజ్యసభ సీటు వస్తుందనే ప్రచారం జరిగింది. అందులో సీట్లు తక్కువగా ఉండటంతో ఎమ్మెల్సీగా అవకాశం ఇద్దామని సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. శాసనమండలిలో ఐదుస్థానాలు ఖాళీ అయ్యాయి. అందులో ఒక స్థానం జనసేనకు దక్కనుంది. >>2

# రాష్ట్రంలో ప్రతి మహిళకు సిఎం రూ. 36 వేలు బాకీ



### నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు కూడా అమలు చేయలేరా?

### పవన్ కార్పొరేటర్‌కు ఎక్కువ, ఎమ్మెల్యేకు తక్కువ..

### -మాజీ సిఎం జగన్ నిశిత విమర్శ

**విజయవాడ మార్చి5 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను భ్రమల్లో ఉంచుతున్నారని మాజీ సిఎం, వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తామని చెప్పారని ఈ ఏడాది కూడా నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదని ప్రతి మహిళకు సిఎం చంద్రబాబు నాయుడు రూ.36 వేల బాకీ ఉన్నారన్నారు. మహిళలు ఉచిత బస్సు చాలా చిన్న హామీ అని అది కూడా ఇంతవరకు అమలు చేయలేదని రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచిత బస్సు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. తల్లికి వందనంఅన్నారు. రూపాయి కూడా ఇంత వరకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ పిల్లవాడికి కూడా చంద్రబాబు బాకీ పడ్డారని జగన్ పేర్కొన్నారు. 18 నుండి 60 ఏళ్ల లోపు ప్రతీ మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి 18వేలు ఇస్తామన్నారు. 2 కోట్లు 7 వేల మంది మహిళలు ఓటర్ లిస్టు ప్రకారం ఉన్నారు. దాదాపు 60 ఏళ్ల లోపు మహిళలు కోటి ఎనభై లక్షలు ఉన్నారు. వాళ్లకు ఏడాదికి 32 వేల కోట్లు చెల్లించాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక >>2

# రైల్వే పరీక్ష ప్రశ్నపత్రం లీక్

### ఇద్దరు అధికారులు, 17 మంది లోకో పైలట్లు సహా 26 మంది అరెస్టు

### ఆరు నుంచి 9 లక్షలకు ప్రశ్న పత్రం



అరెస్టు అయిననిందితులను వైద్య పరీక్షల అనంతరం కోర్టుకు తీసుకెళ్తున్న సిబిఐ

**గుంతకల్లు రైల్వే,మార్చి 5,ప్రభాతవార్త:** తూర్పు మధ్య రైల్వే మొగల్ సరాయ్ డివిజన్‌లో సిఎల్ఐ పదోన్నతులకు సంబంధించిన కుంభకోణాన్ని సిబిఐ ఛేధించింది. ఈస్కాంలో ఇప్పటివరకు ఇద్దరు అధికారులతో పాటు 17మంది లోకోపైలట్లు, మరో 8మందిని సిబిఐ అరెస్టు చేసి 8ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి రూ.1.17కోట్ల నగదును స్వాధీనం చేసుకుంది.

రైల్వేలో సంచలనం సృష్టించిన ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి : తూర్పు మధ్య రైల్వే మొగల్ సరాయ్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్(సిఎల్ఐ) పోస్టులను డిపార్ట్‌మెంటల్ కోటాలో భర్తీ చేసేందుకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4న రైల్వే ఇంటర్ కళాశాలలో వ్రాత పరీక్ష జరగాల్సి ఉంది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నా పత్రాన్ని రూపొందించే (సెట్) చేసే బాధ్యతను సీనియర్ డిఇఇ (ఆపరేషన్స్)కు అప్పగించినట్లు ఇప్పటి వరకు నిర్వహించిన దర్యాప్తులో వెల్లడైంది. సదరు అధికారి తన స్వంత చేతి వ్రాతతో ప్రశ్నలను ఆంగ్ల భాషలో వ్రాయగా, ఆప్రశ్న పత్రాన్ని హిందీ భాషలో అనువదించేందుకు ఒక లోకో పైలట్‌కు ఇచ్చినట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయి. సదరు లోకో పైలట్ ఆంగ్లంలో ఉన్న ప్రశ్న పత్రాన్ని హిందీ భాషలోకి తర్జుమా చేసి దానిని ట్రైనింగ్ విభాగం ఆఫీస్ సూపరింటెండెంట్‌కు అందచేశాడు. అతను ఈ ప్రశ్న పత్రాలను ఇతర రైల్వే ఉద్యోగుల ద్వారా ముందుగా డబ్బులు వసూలు చేసిన అభ్యర్థులకు అందించారన్న ఆరోపణలున్నాయి. ఈ కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ డిఇఇ (ఆపరేషన్స్) సుశాంత్ పరాశర్, సీనియర్ డిపిఓ సుర్జీత్ సింగ్‌లతో పాటు పలువురు రైల్వే ఉద్యోగులు అక్రమ పద్ధతుల్లో పరీక్ష వ్రాయాలనుకొని ప్రశ్నపత్రం కోసం ఒక్కొక్క అభ్యర్థి ఆరు నుంచి తొమ్మిది లక్షల రూపాయలను అక్రమంగా డబ్బులు చెల్లించి ఈ నెల 3,4వ తేదీల్లో రాత్రి ప్రశ్న పత్రాల కాపీలతో 17మంది లోకో పైలట్లు మొగల్ సరాయిలోని కాళీమహాల్ లాన్‌లో,సిద్దార్థ పూర్ కాలనీలోని రైల్వే సిబ్బంది ఇంట్లో వసతి ఏర్పాటు చేశారు. ఈ సమయంలోనే ముందస్తు పక్కా సమాచారంతో సోదాలు నిర్వహించేందుకు సిబిఐ బృందం బైక్‌ల మీద వచ్చి అభ్యర్థులను, వారి నుంచి ప్రశ్న పత్రాలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని సిబిఐ అరెస్టు చేసింది. అనంతరం చందౌలీలో రాత్రి మూడు ప్రదేశాలలో సిబిఐ సోదాలు నిర్వహించగా తనిఖీల్లో మొత్తం 17మంది అభ్యర్థుల వద్ద చేతితో వ్రాసిన ప్రశ్నపత్రాల ఫోటో కాపీలను, పరాశర్,సుర్జీత్ సింగ్‌లో ల్యాప్ టాప్‌లతో సహా కార్యాలయాలలో ఉంచిన ముఖ్యమైన పత్రాలను పత్రాలను కూడా సిబిఐ బృందం స్వాధీనం చేసుకుంది. అలాగే మరో 8ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా రూ.1.17కోట్ల నగదు సైతం లభించింది. ఈ సోదాలలో సీనియర్ డిఇఇ సుశాంత్ పరాశర్ నివాసం నుంచి రూ.3.5లక్షలు, సీనియర్ డిపిఓ సుర్జీత్ సింగ్ నివాసం నుంచి రూ.17లక్షలు, వెల్ఫేర్ ఇన్ స్పెక్టర్ సంజయ్ మిశ్రా నుంచి రూ.40లక్షలు, మరో రైల్వే ఉద్యోగి నీరజ్ బర్మా నుంచి రూ.20లక్షలతో పాటు మిగిలిన మొత్తాన్ని ఎజి నివాసం నుంచి సిబిఐ స్వాధీనం చేసుకుంది. అదే సమయంలో అభ్యర్థుల నుంచి లభించిన చేతితో వ్రాసిన ప్రశ్న పత్రాలను అసలు(ఒరిజినల్) ప్రశ్నపత్రంతో రెండింటినీ పోల్చి చూడగా రెండు కూడా ఒకటిగానే సరిపోయినట్లు సిబిఐ వర్గాలు గుర్తించారు. అరెస్టు అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయస్థానంలో హాజరు పరిచారు.

# హైకోర్టును ఆశ్రయించిన పోసాని

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి చలనచిత్ర, బుల్లితెర, నాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పోసాని కృష్ణమురళి హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసులను క్వాష్ చేయాలని పోసాని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. తనపై నమోదైన కేసుల్లో ముందస్తు చర్యలు తీసుకోకుండా.. ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో పోసాని పేర్కొన్నారు. ఏపీలో ఇప్పటివరకు పోసానిపై 17 కేసులు నమోదు ఆదోనీలో నమోదైన కేసులో పీటీ వారెంట్‌పై తరలింపు పోసానిని విచారణకు అనుమతివ్వాలని.. పీటీ వారెంట్ దాఖలు చేసిన విజయవాడ, గుంటూరు పోలీసులు తనపై నమోదైన కేసులపై హైకోర్టును ఆశ్రయించిన పోసాని అన్ని కేసులను క్వాష్ చేయాలని పోసాని పిటిషన్ ముందస్తు చర్యలు తీసుకోకుండా >>2

# దక్షిణాఫ్రికాపై కివీస్ విజయం

### 9న భారత్‌తో ఫైనల్ మ్యాచ్‌కు సిద్ధం 2లో



బుధవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్‌ను కలిసి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల

## పోలవరం -బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణమే లక్ష్యం: సిఎం

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం -బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం ప్రభుత్వ లక్ష్యంగా అడుగులు వేస్తోందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వృధాగా పోతున్న నదుల నీటి ఒడిసి పట్టుకుని కరువు ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని, పోలవరం బనకచర్ల అనుసంధానంపై రాద్దాంతం చేయాలని కొందరు రాజకీయ నేతలు దుష్ప్రచారం చేస్తూ, అభ్యంతరాలను పెడుతున్నారని ఆరోపించారు. బనకచర్ల తదితర ప్రాజెక్టుల అంశంలో మన ప్రభుత్వం ఖచ్చితత్వంతో ఉందన్నారు. మన ఏపీ ప్రాజెక్టు పెట్టినా తెలంగాణ నేతలు రాజకీయ ప్రయోజనాలతో ఆరోపణలు చేయడం, అడ్డంకులను సృష్టించాలని కోవడం సరికాదన్నారు. గోదావరిపై ప్రాజెక్టులు కట్టి మీరు కూడా నీరు తీసుకోండని గోదావరి ఒక్కటే తెలుగు ప్రజలకు శ్రీరామరక్ష అని సీఎం అన్నారు. గోదావరిపై ప్రాజెక్టులు కట్టి తెలంగాణ కూడా కరువు ప్రాంతాలకు నీటిని తరలించుకోవచ్చని సిఎం చంద్రబాబు అన్నారు. ఏపీకి తరలించే నీటి విషయంలో తెలంగాణ బాధపడవద్దని చివరి ప్రాంతాలకు మిగులు జలాలు తీసుకునే అధికారం ఉందని వెల్లడించారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనకు ముందు పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలిచి చరిత్ర సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పరంగా తీసుకునే కొన్ని నిర్ణయాలు గౌరవించాలని వారిని తిరిగి గౌరవించే బాధ్యత పార్టీ తీసుకుంటుందని తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికల్లోనూ ప్రాధాన్య క్రమంలో బలపరిచిన అభ్యర్థులే గెలిచారని గుర్తుచేశారు. మొదటి ప్రాధాన్యంటతోనే ఇద్దరు పట్టభద్రుల అభ్యర్థులు గెలవటం ఓ చరిత్ర అని వెల్లడించారు. త్వరలోనే తల్లికి వందనం అమలు చేస్తామని సిఎం చంద్రబాబు వెల్లడించారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు డబ్బులు, మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు రూ.25 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రం, రాష్ట్రం కలిసి సమష్టిగా పని చేస్తున్నాయని 2047 నాటికి దేశంలో అగ్రస్థానంలో ఏపీ నిలిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని సీఎం అన్నారు. సమాజంలో పేదరికం లేకుండా చేయడం ఒక్క ప్రభుత్వానికే సాధ్యం కాదని కాని ఆర్థిక అసమానతలు, పేదరికం లేకుండా ఆదాయం పెంచే మార్గం ఆలోచిస్తామని సీఎం వివరించారు.

## పక్కా ప్రణాళికతోనే రాజధాని నిర్మాణం
### -మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 5, ప్రభాతవార్త:** ప్రపంచస్థాయి రాజధాని అమరావతి నిర్మాణానికి పెడుతున్న ఖర్చులో ఒక్క పైసాకూడా రాష్ట్ర ప్రజలపై భారం వేయడం లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. బుధవారం నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్‌తో కలిసి మంత్రి నారాయణ అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్లు, కాలువలు, పెండిరగ్‌లో వున్న బీసీ, అంబేద్కర్ భవన్‌ల నిర్మాణాలు, ప్రధాన కూడళ్లు, అండర్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్‌ల వద్ద పెయింటింగ్‌లు, పారిశుద్ధం, మెప్మా కార్యక్రమాలు మొద్కలెన అంశాలపై ఆయాశాఖల అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఆయాశాఖలకు కేటాయించిన పనులను వేగంగా పూర్తిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రినారాయణ మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ప్రపంచస్థాయి రాజధాని అమరావతి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ప్రజలు చెల్లిస్తున్న పన్నుల డబ్బును వినియోగించే ప్రసక్తే లేదని, రాజధాని నిర్మాణానికి సీఎం చంద్రబాబు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి చెప్పారు.

రాజధాని నిర్మాణానికి సేకరించిన 5వేల ఎకరాల్లో సుమారు 1200 ఎకరాలను అంతర్జాతీయ, జాతీయస్థాయి విద్యాసంస్థలు, పాఠశాలలు, పరిశ్రమలు నెలకొల్పేందుకు కేటాయించినట్లు చెప్పారు. రాజధానిలో మిగిలిన భూమిని అన్ని వసతులు కల్పించి మంచి ధరకు విక్రమించి ఆ డబ్బునే రాజధాని నిర్మాణానికి వినియోగించేలా, రాజధానికి చేసిన అప్పులు తీర్చేలా సీఎం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. రాజధాని నిర్మాణానికి 64వేల కోట్లకు పరిపాలన ఆమోదం లభించగా, 50వేల కోట్లకు అధికారులు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు అపార అనుభవంతో అద్భుతంగా రాజధానిని డ్కిజెన్ చేశారని, హడ్కో, ఎడిబి బ్యాంకు, ప్రపంచబ్యాంకు నిధులను సమీకరిస్తూ రాజధాని నిర్మాణానికి ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. బడ్జెట్‌లో రాజధానికి 6వేల కోట్ల కేటాయించామని, ఇంకా అవసరమైతే నిధులు ఇస్తామని సీఎం చెప్పారని చెప్పారు.

# ఎపికి అండగా ఉంటాం

>> కేంద్రం అండగా ఉంటుందని అమిత్‌షా స్పష్టం చేశారు. అమిత్‌షాను కలిసే సందర్భంలో చంద్రబాబు వెంట కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు సిఎం రమేశ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమిత్‌షాను సిఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు.ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున జ్ఞాపికను అందజేసారు.

**కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో చంద్రబాబు భేటీ**

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతికి అనుసంధానంగా నిర్మిస్తున్న జాతీయరహదారులకు నిధుల కేటాయింపు,సత్వర నిర్మాణ పూర్తిని చేయాలని కోరారు.జాతీయ రహదారులతో రాష్ట్ర హైవేలతో అనుసంధానికి పలు నిధుల కేటాయించడంతో పాటు పనులు వేగవంతం చేసినందుకు కేంద్రమంత్రి గడ్కరీకి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. సిఎం చంద్రబాబుతో పాటుగా కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు సిఎం రమేశ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలుసుకున్నారు.

**త్వరగా నిధులివ్వండి: నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి**

**విజయవాడ, మార్చి5, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధికి కేంద్రపరంగా నిధులు ఎప్పటి కప్పుడు అందించాలని సిఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు.కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులను భారీగా కేటాయించినందుకు ధన్య వాదాలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు,అమరావతి నగర నిర్మాణానికి నిధులను పనులు వేగవంతంగా జరగడానికి వీలుగా విడుదల చేయాలని కోరారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఢిల్లీలో సిఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఎపికి ఆర్థికంగా మరిన్ని వెసులుబాట్లు కల్పించే అంశంపై నిర్మలా సీతారామన్‌తో సిఎం, ఆర్థిక మంత్రి చర్చలు జరిపారు. ఐటీవలే ఎపిలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ వివరాలను ఆమెకు వివరించారు. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ నిధుల కోసం ప్రత్యేకంగా విజిఎఫ్ స్కీం ప్రవేశపెట్టడంపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో తొలిసారిగా ఈ తరహా విధానం ఉందన్న చర్చల్లో భాగంగా నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ఇజిఎఫ్ స్కీంలో భాగంగా కార్పస్ ఫండ్ నిమిత్తం రూ. 2 వేల కోట్లు కేటాయించామని సిఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల వివరించారు. వివిధ మార్గాల్లో ఇప్పటి వరకు అందించిన సాయంపై నిర్మలా సీతారామన్‌కు సిఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇక పైనా ఇదే తరహా సహకారం అందించాలని.. వికసిత్ భారత్ వంటి కేంద్ర పథకాలను రాష్ట్రంలో వేగంగా అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమకు నిధులు కూడా అదే స్థాయిలో వచ్చేలా చూడాలని కేంద్ర ఆర్థిక మంత్రిని సిఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కోరారు.

ప్రధాని నరేంద్రమోడీ వికసిత్ భారత్ స్ఫూర్తితో ఎపి స్వర్ణాంధ్ర విజన్ 2047తో ముందుకు వెళ్తుతుందని తెలిపారు. ఎపికి నిర్దేశిత నిధులను అందించే దిశలోనే చర్యలు తీసుకుంటున్నామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున సిఎం చంద్రబాబు,ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సముచిత రీతిన సత్కరించారు.

## సిఎం, డి.సిఎం లను అవమానిస్తే చూస్తూ ఊరుకునేది లేదు
### -మంత్రి నారా లోకేష్

**సచివాలయం,మార్చి 5,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై అవమానకర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పై విధంగా వైకాపా నాయకులకు హెచ్చరికలు జారీ చేశారు. జగన్మోహనరెడ్డి బాగా ఫ్రస్టేషన్‌లో ఉన్నారని,అధికారంలో ఉన్నప్పుడు అవినీతిలో తేలియాడి,ఇప్పుడు ప్రతిపక్షంలోనికి వచ్చిన తర్వాత నీతులు విడిచి పెట్టడం భారతదేశానికే ఆశ్చర్యకరమని విమర్శించారు. జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి అయి ఉండి, ఇతరులను కించపరిచేవిధంగా ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ని అవమానపరిచే విధంగా మాట్లాడటం దురదృష్టకరమని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రి పదవి కోసం సొంత తండ్రి శవాలుపక్కన పెట్టుకొని సంతకాలు స్వీకరించిన వ్యక్తి అని గుర్తు చేస్తూ,ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌నుకూడా విమర్శించడం హాస్యాస్పదమని పేరొ ్కన్నారు. ఎన్నికల్లో 175లో కేవలం 11స్థానాలు మాత్రమే ఇచ్చి,ప్రజలే ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకూడదని నిర్ణయించారని, అయినా ప్రతిపక్ష హోదా కోసం అడగడం అర్థరహితమని పేర్కొన్నారు.

## నాగబాబు

>> ఇప్పుడు ఆ సీటుకు నాగబాబు పేరుని ప్రకటించారు. నాగబాబుకు కార్పొరేషన్ పదవి ఇస్తారనే ప్రచారం జరిగినా తాజా పరిణామాలతో వాటికి అడ్డుకట్ట పడింది. మంత్రివర్గంలోనూ నాగబాబుకు చోటు కల్పిస్తామని చంద్రబాబు గతంలో ప్రకటించారు. ఆ విషయంలో కొంత స్పష్టత రావాల్సి ఉంది. జనసేన జారీ చేసిన ప్రకటనలో ఎమ్మెల్సీగా నాగబాబు పేరుని ఖరారు చేశారని నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. మంత్రి పదవి విషయం ముఖ్యమంత్రికే వదిలి వేసినట్లు జనసేన వర్గాలు స్పష్టం చేసాయి.

## పోసాని

>> ఆదేశాలు ఇవ్వాలని.. పిటిషన్‌లో పోసాని కృష్ణమురళి పేర్కొన్నారు.ఏపీ సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసారన్నది ఆయనపై కీలక అభియోగం.ఇప్పటికే ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి.ఈ కేసుల్లో ఒక దానిలో రిమాండ్ ఖైదీగా ఉన్న పోసానిని ఇటీవల రాజంపేట కోర్టును నరసరావు పేట పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకుని వచ్చారు.అక్కడి పోలీసులు పెట్టిన కేసులో నరసరావుపేట కోర్టు పోసానికి ఈ నెల 18వరకు రిమాండ్‌ను విధించింది.

### వారం - వర్జ్యం

తేది : 06-03-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల సప్తమి ఉ.10.51
రోహిణి రా.12.05
వర్జ్యం సా.4.26-5.57
దు.ఉ.10.29-11.16, 2)మ.3.13-4.00
శుభసమయం : ఉ.8.00-9.00, సా.6.15-7.00
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది. రంగాలు తీరి ఊరట చెందుతారు.

**వృషభం :** బంధువులను కలుసుకొని కష్టసుఖాలను పంచుకొంటారు. ఆకస్మిక ధన లాభం.

**మిథునం:** పూర్వపు మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. ఆధ్యాత్మిక చింతన.

**కర్కాటకం :** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. విలువైన వస్తువులు.

**సింహం:** ఉద్యోగాల స్థాన మార్పులు వుంటాయి. అనుకోని సంఘటనలు జరుగుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. మిత్రుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది

**తుల :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. కొత్త విద్యలపై ఆసక్తి చూపుతారు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన నిదానంగా ముందుకు సాగుతారు. క్రయ విక్రయాలు.

**మకరం:** ముఖ్యుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మీనం :** మిత్రుల ద్వారా విలువైన సమాచారం అందుతుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# జగన్‌ను క్షమించి వదిలేస్తున్నా

>> నని అయ్యన్నపాత్రుడు అన్నారు స్పీకర్‌పై అభియోగాలు, బెదిరింపులతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాకు గతేడాది జూన్ 24న లేఖ రాశారు. ప్రతిపక్ష హోదా గురించి ఆయనకు అన్నీ తెలుసని మాట్లాడుతున్నారు. అన్నీ తెలిసే వివాదం చేస్తున్నారు. ఈ ధోరణి ఇలానే కొనసాగితే ఏం చర్య తీసుకోవాలనేది నిర్ణయిస్తా. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే సరైన సంఖ్యాబలం ఉండాలని చట్టం చెబుతోంది. 175 మంది సభ్యులున్న శాసనసభలో కనీసం 18 మంది సభ్యుల బలం ఉంటే తప్ప ఇది రాదు. కనీసం 10 శాతం సభ్యులుంటేనే ప్రతిపక్ష హోదా వస్తుందనే నిబంధనను జగనే గతంలో సభలో ప్రస్తావించారు. ఇవన్నీ తెలిసి కూడా జగన్ చేసిన సంధి ప్రేలాపలనలను సభాపతి హోదాలో క్షమించి వదిలేస్తున్నానని అయ్యన్న వ్యాఖ్యానించారు సభకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యేలు ప్రజలు తమను ఎందుకు గెలిపించారో ఆలోచించాలని అయ్యన్న సూచించారు. అసెంబ్లీకి రాకుంటే తమ నియోజకవర్గ ప్రజల సమస్యలు ఎవరు లేవనెత్తుతారని ప్రశ్నించారు. ఇవన్నీ గ్రహించి శాసనసభకు రావాలని వైఎస్సార్సీ సభ్యులను కోరుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై సభా సంఘానికి నివేదించాలని స్పీకర్‌ను లోకేశ్, నాదెండ్ల మనోహర్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోరారు. దీనిపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని అయ్యన్న పేర్కొన్నారు ఎపి వేతనాలు ఫించన్ చెల్లింపు అనర్హత చట్టం 1953లో ప్రతిపక్ష నాయకుడి హోదా ప్రస్తావన ఉందన్నారు. ఆ చట్టంలోని సెక్షన్ 12బి ప్రకారం ప్రతిపక్ష నాయకుడు చట్ట సభలో సభ్యుడు అయి ఉండాలని తెలిపారు. వారు ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ నాయకుడిగా సభలో ఉండాలని.. ప్రతపక్షంలో ఉన్న పార్టీకి అత్యధిక సంఖ్యా బలం ఉండాలని చెప్పారు. ఆ వ్యక్తిని సభాపతి ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించాలన్నారు. అత్యధిక సంఖ్యా బలం ప్రతిపక్షాలు ఒకటి కన్నా ఎక్కువగా ఉంటే పార్టీ హోదాను దృష్టిలో ఉంచుకుని వారిలో ఏదో ఒక నాయకుడిని సభాపతి నిర్ణయించవచ్చని.. ఈ విషయంలో సభాపతి నిర్ణయమే ఫైనల్ అవుతుందని తెలిపారు. సభలో మొత్తం సభ్యులలో పదింట 1 వంతు సభ్యులు ఉండాలని.. దీన్ని పార్లమెంట్‌తో పాటు అన్ని శాసనసభలలో పాటిస్తున్నారని చెప్పారు. ఇలాంటి డైరెక్షన్‌ను గతంలో నెంబర్ 56 జారీ చేశారని గుర్తుచేశారు. దీనికి మూలాలు రాజ్యాంగం 100(3), 189(3) అధికరణలలో ఉన్నాయన్నారు. చట్ట సభల నిర్వహణలో 10 ఇంట 1 వంతు కోరమ్‌గా నిర్ణయించారని తెలిపారు స్పీకర్‌కు ఈ విషయంలో మార్గం చూసేది ఈ డైరెక్షనే అని చెప్పుకొచ్చారు. ఏ ఒక్క ప్రతిపక్ష పార్టీకి 1972 - 77 మధ్య, 1994-99 మధ్య కాలంలో 10 శాతం సీట్లు రాలేదని.. దీంతో ఎవ్వరికి ప్రతిపక్షం హోదా రాలేదని వెల్లడించారు. 5,7,8,16,17 లోక్‌సభలోనూ ఎవ్వరికీ 10 శాతం సీట్లు రాకపోవడంతో ప్రతిపక్షహోదా ఎవ్వరికి రాలేదని గుర్తుచేశారు. ఇటీవల ప్రతిపక్షంలో ఉన్న తెలుగు రాష్ట్రంలో 2001- 2019న ప్రతిపక్షంలో ఉన్న అతిపెద్ద పార్టీకి సభాపతి గుర్తింపు ఇచ్చారని తెలిపారు. అయితే 90-6- 2019న సభలో సంఖ్యా బలం 10 శాతం కన్నా తగ్గిందని నిర్ధారణకు రాగానే సభాపతి ప్రతిపక్ష నాయకుడి హోదాను తొలగించారని స్పీకర్ తెలిపారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు.... అలాంటి ప్రజలు ఎన్నుకున్న దేవాలయం ఈ సభ అని తెలిపారు. ఈ దేవాలయానికి నేను పూజారిని మాత్రమే. స్పీకర్‌గా దేవుడు తిరస్కరించిన వరాన్ని పూజారిగా ఆశించడం కరెక్టేనా. దేవుడు 11 మందిని మాత్రమే ఇచ్చారు. ఈ సందర్భంగా సభకు దూరంగా ఉంటున్న సభ్యులకు నా విజ్ఞప్తి మీ నియోజకవర్గాల ప్రజలు ఇచ్చిన బాధ్యతను గుర్తించి ప్రజల గొంతు వినిపించడానికి సభకు రావాలని రాజ్యాంగ భాద్యతను సమర్థవంతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నా అంటూ ఈ వివరాలను వెల్లడిస్తూ స్పీకర్ అయ్యన్న పాత్రుడు రూలింగ్ ఇచ్చారు.

# ఆ భూములు వెనక్కి!

>> దానికి 960 మెగావాట్ల జలవిద్యుత్ ను ఉత్పత్తి చేస్తుంది. భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ సలహాలను బేఖాతరు చేస్తూ, నిర్మాణం కీలక దశలో ఉన్నప్పుడు అమలు చేసే ఏజెన్సీని ఆకస్మికంగా మార్చడం వల్ల డయాఫ్రమ్ వాల్ కూలిపోవడానికి దారితీసి, ప్రాజెక్టు జాప్యం కావడానికి కారణమయింది. ఒకప్పుడు పట్టాలు తప్పి, ఆలస్యమైన పోలవరం ప్రాజెక్టు ఇప్పుడు మళ్లీ పట్టాలెక్కి 2027 నాటికి దాని వాస్తవ స్థాయికి పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్నారు.కరవు రహిత రాష్ట్ర లక్ష్యాన్ని సాధించే దిశగా, మా ప్రభుత్వం పోలవరం నుండి బనకచెర్ల నదీ అనుసంధాన ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. ఇది లింక్ కాలువ ద్వారా గోదావరి నది నుండి బనకచెర్ల హెడ్ రెగ్యులేటర్ కు నీటిని బదిలీ చేస్తుంది. ఈ పరివర్తనాత్మక ప్రాజెక్టు కేవలం సాగు నీటిపారుదలకు సంబంధించినది మాత్రమే కాదు, ఇది జీవితాలను మార్చడం, కరువును అభివృద్ధిగా, కొరతను సమృద్ధిగా మరియు నిరాశను నమ్మకంగా మారుస్తున్నది. ఒకప్పుడు సుదూర స్వప్నంగా ఉన్న నీరు ఇప్పుడు సాకారమై, రాయలసీమను నీటి సురక్షిత ప్రాంతంగా మార్చనుంది. అమృత్ జల్ జీవన్ మిషన్ (జెజెఎం) అమలు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయింది. మనం ఈ అవకాశాన్ని కోల్పోయినపుడు, ఇతర రాష్ట్రాలు వాటిని పెద్ద ఎత్తున అమలు చేశాయి. జెజెఎం విషయంలో ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడం వల్ల కేవలం రూ.2,255 కోట్లు మాత్రమే వినియోగించుకుంటూ, ఆంధ్రప్రదేశ్ అట్టడుగున నిలిచింది. దీనిని ఇప్పుడు తమ ప్రభుత్వం పునరుద్ధరించింది.

కేంద్ర ప్రభుత్వ మద్దతుతో, ప్రతీ కుటుంబానికి కుళాయి నీరు అందేటట్లు చేయడానికి గానూ, నిధులను వినియోగించుకోవాలనీ మరియు 95.44 లక్షల గ్రామీణ కుటుంబాల న్నింటికీ వర్తింప చేయాలని మేము పూర్తిగా నిశ్చయించుకున్నామన్నారు. రాయలసీమకు కీలకమైన హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) వంటి ఇతర కీలక ప్రాజెక్టులు 1వ దశలో 94 శాతం, 2వ దశలో 82 శాతానికి చేరుకున్నాయి, ఇవి సుమారు 6.025 లక్షల ఎకరాలకు సాగునీరు, 437 గ్రామాల్లోని సుమారు 33 లక్షల మందికి మంచినీరు అందిస్తాయి. వీటితోపాటు వెలిగొండ ప్రాజెక్టు 75 శాతం పూర్తయింది. రాష్ట్రంలో కేంద్ర సహకారంతో మంచి అభివృద్ధి సాధిస్తామన్నారు. మీడియా సమావేశంలో కేంద్రమంత్రులు కింజరపు రామ్మోహననాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం అమృతసర్‌లో సిఎం భగవంతమాన్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపిన కిసాన్ మజ్దూర్ సభ్యులు


# సిఎం రూ. 36 వేలు బాకీ

>> ప్రతీ మహిళకు రూ.36 వేలు బాకీ ఉన్నారు. మహిళలకు ఉచిత బస్సు చాలా చిన్నహామీ, ఏడాదికి రూ.3500 కోట్లు అవుతాయి. ఫస్ట్ ఇయర్ ఎగ్గొట్టారు. ఈ ఏడాది కూడా ఎగనామం, రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచిత బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పెద్ద మనిషి ఇంత చిన్న హామీ అమలు చేయటానికి తన నైజాన్ని చూపిస్తున్నారు అని అన్నారు. ప్రతీ పిల్లవాడి డేటా యుడిఐఎస్‌లో పొందుపరిచి ఉంటుంది. ఆ రిపోర్ట్ ప్రకారం 8741885 మంది పిల్లలు 12 వ తరగతి లోపు చదువుతున్నారు. వాళ్లకు రూ.13 వేల 105 కోట్లు కావాలి. దాంట్లో ఆయన కేటాయించిది రూ.8200 కోట్లు అని ఒకచోట, మరో చోట రూ.9407 గా ఉంది. ప్రతీ పిల్లవాడికి కూడా చంద్రబాబు బాకీ పడ్డారు. పిఎం కిసాన్ కాకుండా అన్నదాత సుఖీభవ కింద 20 వేలు ఇస్తానన్నారు. గతంలో రైతు భరోసా అందుకున్న వారు 5358266 మంది ఉన్నారు. ఆ లెక్కల్లో మొత్తం 10717 కోట్లు కావాలి. బడ్జెట్లో కేవలం రూ.6300 మాత్రమే కేటాయించారు. ఈ లెక్కలో రైతులకు కూడా చంద్రబాబు బాకీ పడ్డారు. ప్రతీసారి అలాగే మోసం చేస్తున్న చంద్రబాబు గతంలో ఇలాగే మోసం చేసి ఎలా ఓడిపోయాడో అందరూ చూశారు అని జగన్ పేర్కొన్నారు.

**పవన్ కల్యాణ్ కార్పొరేటర్‌కు ఎక్కువ.. ఎమ్మెల్యేకు తక్కువ**

మేము అసెంబ్లీ ప్రతిపక్ష హోదా ఇమ్మని చట్టబద్ధంగానే అడుగుతున్నామని మీడియా సమావేశంలో జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ జీవిత కాలంలో ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు. అంటూ జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఢిల్లీలో బీజేపీకి మూడు స్థానాలు మాత్రమే ఉంటే ఆమ్ ఆద్మీ ప్రభుత్వం బీజేపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చిందని జగన్ గుర్తు చేశారు. మేము అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు ప్రతిపక్ష పార్టీగా హోదా లాగేస్తానంటే నేను వద్దన్న. చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష పార్టీ నాయకుడుగా ఉన్న సమయంలో ఎంత సమయం మాట్లాడతావో అంతసేపు మాట్లాడమని చెప్పాను. ప్రభుత్వం చేసిన తప్పులను చెప్పేందుకు మాత్రమే ప్రతిపక్ష హోదా అడుగుతున్నా అంటూ జగన్ అన్నారు.

## ఆహా.. ఏమి ఇది! కనరా మై మరచి..!



**విజయనగరం, మార్చి 5 ప్రభాతవార్త ప్రతినిధి :** ఉత్తరాంధ్రా రాజకీయ ముఖచిత్రంపై సరికొత్త సన్నివేశం, సంఘటన ఆవిష్కృతమైంది.. ఎవరు ఎవర్ని ఓడించారో... ఎవరు ఎవర్ని గెలిపించారో గానీ.. గెలిచిన శ్రీనివాసుడు మాత్రం చంద్రుడి అక్కున చేరాడు. 'మౌనంగానే ఎదగమనీ' అనే చందంగా ఆయన బాబు మదిన ఒదిగిపోయాడు.. చాలా మంది మనసు దోచిన ఈ చిత్రం 'ఇంతన్నాడు అంతన్నాడోయ్' టైపులో కూడిన కూటమి ఓడిందన్న కొందర్ని, కూటమి ఓటమి ఉత్తరాంధ్రా నుంచే మొదలైందని ఉత్తర కుమారుడి పలుకులు వల్లె వేసిన మరి కొందర్ని విస్మయపర్చింది... అంతే కాదు... గెలిచిన శ్రీనివాసుడు తన గెలుపునకు బాబు సూచన మేరకు కూటమి పార్టీలన్నీ సహకరించాయని చిలక పలుకులు వల్లించారు... చంద్రుడి ఆశీర్వాదంతో కొండంత ధైర్యం వచ్చిందని ప్రవచించారు...శ్రీనివాసుడి మాటలతో పాటు బాబు వద్ద ఆయన ఒదిగిపోయిన తీరు ఉత్తరాంధ్రా నేతలతో పాటు ప్రజలను కూడా సంభ్రమాశ్చర్యాల్లో ముంచేసింది... అసలు సిసలైన రాజకీయం అంటే ఇదేనేమోనని కొందరు మురిసిపోతుంటే.. మరి కొందరు మైండ్ బ్లాక్ అయ్యి మైమరచిపోతున్నారు!.

## ఆ ఖర్చంతా విజయసాయి కుమార్తె కంపెనీ నుంచి రాబట్టాలి: హైకోర్టు ఆదేశం

**విజయవాడ మార్చి 5 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నంలోని భీమిలిబీచ్ వద్ద అక్రమ నిర్మాణాలపై ఆంధ్రప్రదేశ్‌హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా గోడ నిర్మాణం చేపట్టడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయసాయి కుమార్తె నేహా రెడ్డి వ్యాపార భాగస్వామిగా ఉన్న కంపెనీపైనా న్యాయస్థానం మండిపడింది. కంపెనీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించిన న్యాయమూర్తి అలాచేస్తేనే క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని పేర్కొన్నారు బీచ్‌లోగోడ తొలగించి ఆరుఅడుగుల పునాదిని అలాగే వదిలేయడం సరికాదు. గోడ వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ అధికారులో కమిటీ ఏర్పాటు చేయాలి. గోడ కూల్చివేత ఖర్చు, పర్యావరణ నష్టం నేహా రెడ్డి కంపెనీ నుంచి రాబట్టాలి అని న్యాయమూర్తి ఆదేశించారు. భీమిలి వద్ద 4 రెస్టో బార్ల అక్రమ నిర్వహణపై దాఖలైన పిల్‌పైనాహైకోర్టులో విచారణజరిగింది. రెస్టోబార్లపై సర్వేచేసిన నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించింది. తదుపరి విచారణను న్యాయస్థానం మూడు వారాలకు వాయిదా వేసింది.

# వెటర్నరీ వర్సిటీలో ఉద్రిక్తత

>> ఏర్పడింది. వర్సిటీ వీసీ,అధికారులు హాస్టల్స్‌ను మూసివేయడంతో వివాదాలు చెలరేగాయి. గౌరవ వేతనం పెంచాలంటూ సమ్మె చేస్తున్న వెటర్నరీ జూడాలను భయభ్రాంతులను చేసేందుకు వర్సిటీ అధికారలు పోలీసులను రంగంలోని దింపారు. వర్సిటీ ప్రధాన గేటు పైనుంచి సమ్మె చేస్తున్న విద్యార్థుల వద్దకు పోలీసులు చేరుకోవడంతో వర్సిటీలో ఏం జరుగుతుందో అర్థంకాక మహిళా విద్యార్థులు వణికిపోయారు. విద్యా ర్థులను నెట్టుకుంటూ వర్సిటీలోకి పోలీసులుప్రవేశించారు. దీంతో విద్యార్థులు పోలీసుల వ్యవహారశైలిపై మండిపడ్డారు. వర్సిటీ వీసీ చేతగానితనం బట్టబయలైందని విద్యార్థులు నినదిస్తూ గేటు వద్దబైటాయించారు.

# దక్షిణాఫ్రికాపై కివీస్ విజయం
## 50 పరుగుల తేడాతో న్యూజిలాండ్ గెలుపు
### 9న భారత్‌తో ఫైనల్ మ్యాచ్‌కు సిద్ధం

**లాహోర్, మార్చి 5:** ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీ ఫైనల్‌లోకి న్యూజిలాండ్ జట్టుప్రవేశించింది. ఈనెల 9న భారత్‌తో దుబాయిలోజరిగే మ్యాచ్‌లో తలపడేందుకు రెడీ అయింది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ 50 పరుగులతేడాతో విజయం సాధించింది. కివీస్ నిర్దేశించిన 36పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లనష్టానికి 312 పరుగులేచేసింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో డేవిడ్ మిల్లర్‌మాత్రమేసెంచరీచేసి ఆకర్షించాడు. రెండో సెమిఫైనల్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ బ్యాటింగ్‌ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో ఆరువికెట్లనష్టానికి 362 పరుగులుచేసింది. రచిన్ రవీంద్ర 108, కేన్ విలియమ్సన్ 102 పరుగులతోరాణించారు. అలాగే డారిల్ మిచేల్ 49, గ్లెన్‌ఫిలిప్స్ 49 ధాటిగాబ్యాటింగ్‌చేయడంతో కివీస్ భారీ లక్ష్యం నిర్దేశించింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగ్డికి మూడు, కగిసో రబాడా రెండు, వియాన్ ముల్డర్ ఒక వికెట్‌చొప2న పడేసారు. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా మొదట ఇన్నింగ్స్‌ను స్లోగా ప్రారంభించింది. తర్వాత రియాన్ రికిల్టన్ కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 12 బంతుల్లో నాలుగుఫోర్లసాయంతో 17 పరుగులుచేసి పెవిలియన్‌కు చేరారు. ఆ తర్వాత రాస్సీ వన్‌డెర్ డెస్సెన్‌తోకలిసి కెప్టెన్ టెంబా బువమా ఇన్నింగ్స్ కొంతమేర మెరుగుపరిచాడు. బవుమా 71 బంతుల్లో నాలుగుఫోర్లు ఒక సిక్సర్ సాయంతో 56 పరుగులుచేసి ఔట్ అయ్యాడు. రెండో వికెట్‌కు ఇద్దరు 105 పరుగులుజోడించారు. మరోవైపు డస్సెన్ 66 బంతుల్లో నాలుగుఫోర్లు రెండుసిక్సర్లతో 69 పరుగులుచేసి పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత మార్క్‌రమ్ 36 పర్వాలేదనిపించినా క్లాసెన్ మాత్రం మూడు పరుగులకే ఔట్ అయ్యాడు. కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్‌చేస్తూ దక్షిణాఫ్రికా బ్యాటర్లకు హిట్టింగ్ ఛాన్స్ ఇవ్వలేదు. వికెట్లు వరుసగా పడిపోవడంతోఓటమి దిశగా జట్టు కదిలింది.ముల్డర్ 8, కేశవ్‌మహారాజ్ ఒకటి, రబాడా 16 పరుగులకే వెనుదిరిగారు. చివరిలో డేవిడ్‌మిల్లర్ సెంచరీతోచివరివరకూ ఒంటరిపోరాటంచేసాడు.

## డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురు కులాల్లో ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డా. బి. ఆర్. అంబేద్కర్ గురుకులాల్లో 2025 – 26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి,ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం) లో ప్రవేశానికి దరఖాస్తులు సమర్పించవలెనని సొసైటీ కార్యదర్శి ఎపిఎస్ఆర్ఇయ్యూఆర్ఈఐఎస్ వి. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరణకు గడువును ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హత గల అభ్యర్థులు ది. 13022025 తేదీ లోపల దరఖాస్తులను ఆన్ లైన్ లో సమర్పించాలన్నారు.

దరఖాస్తులు పొందుటకు, ఇతర వివరములు నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్ సైట్ లో పొందవచ్చునని సొసైటీ కార్యదర్శి శ్రీ వి. ప్రసన్న వెంకటేష్ ఆ ప్రకటనలో కోరారు.



## సీఎం చంద్రబాబును కలిసిన ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీనివాసులు

**విజయవాడ,మార్చి 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఉండవల్లి నివాసంలో సీఎంను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన విజయానికి అన్ని విధాలా సహకరించినందుకు సీఎంకు, కూటమికి శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును సీఎం అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారిని అన్ని వేళలా గౌరవిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాలసీలు రూపకల్పన విషయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే నిర్ణయాలు తీసుకుం టున్నామని సీఎం అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన బోధనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పీఆర్టీయు రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ బాలాజీ, ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు ఏజీఎస్ గణపతి రావు, ఎస్టీయు విశాఖ జిల్లాకార్యదర్శి ఇ.పైడి రాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.సహాదేవరావు, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, గుంటూరు జిల్లా పీఆర్టీయు అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ, రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాశీ విశ్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్ళారు.ఆయన బుధవారం మధ్యాహ్నం విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్ళారు. ఢిల్లీలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి సీఎం చంద్రబాబు బయలుదేరి విజయవాడ నగరం, పోరంకిలోని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నివాసానికి వెళ్లనున్నారు. అక్కడి నుంచి గన్నవరం ఎయిర్ పోర్టుకు వెళ్తారు. గన్నవరం నుంచి బయలుదేరి 1.30 గంటలకు ఢిల్లీకి చేరుకుంటారు. ఢిల్లీలో ఓ శుభకార్యానికి సీఎం చంద్రబాబు హాజరవుతారు. తిరిగి రాత్రి 9.30 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖపట్నానికి సీఎం చంద్రబాబు రానున్నారు. 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు గీతం యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగే దగ్గుబాటి వెంకటేశ్వరరావు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతారు.

# తిరుమల సమాచారం

## ప్రజలందరూ దైవభక్తితో సుఖసంతోషాలతో ఉండాలి

### - సుజయనిధితీర్థశ్రీపాదుల స్వామి



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో భగవంతుని నామస్మరణ, భక్తితత్త్వంతోనే మోక్షం కలుగుతుందని, ప్రజలు దైవనామాన్ని ఉచ్చరించడంతో సుఖసంతోషాలు లభిస్తాయని ముళబాగలు శ్రీపాద రాజమఠం పీఠాధిపతి సుజయనిధితీర్థశ్రీపాదుల స్వామి తెలిపారు. గత 18 సంవత్సరాలుగా తిరుమలకు కాలినడకన శిష్యబృందంతో కలిసి భజనలు, ప్రవచనాలతో రావడం జరుగుతుందన్నారు. అన్నదానం కార్యక్రమం జరుపుకుంటూ పేదల ఆకలితీర్చడమే భగవంతుని సేవగా భావిస్తామన్నారు. బుధవారం ఉదయం స్వామివారు శిష్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. ఆలయ అధికారులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పారిశ్రామిక వర్గాల్లో ప్రభుత్వం ఒక విశ్వాసాన్ని కలిగించింది: అసెంబ్లీలో మంత్రి టి.జి భరత్



**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరు నెలల క్రితం పారిశ్రామిక వేత్తలు తమను కలిసినప్పుడు 1947లో స్వాతంత్ర్య చూసామో లేదో కానీ, ఈ ప్రభుత్వం వచ్చాకే నిజమైన స్వాతంత్ర్య చూసామని చెప్పారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే మాట్లాడే దానికి కానీ లేదా ఏదైనా విషయం అడగడానికి కానీ వీలు కలిగిందని పారిశ్రామికవేత్తలు చెప్పారని మంత్రి తెలిపారు. మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ పారిస్ లో చాంబర్ ఆఫ్ కామర్స్ లో ఇండియాలో ఎక్కడైనా పరిశ్రమలు పెట్టండి కానీ ఆంధ్రప్రదేశ్లో మాత్రం పరిశ్రమలు పెట్టకండని మాట్లాడే దుస్థితికి గత పాలకులు తెచ్చారన్నారు. గత ఎనిమిది నెలల్లో పారిశ్రామిక వర్గాల్లో తమ ప్రభుత్వం ఒక విశ్వాసాన్ని కలిగించిందన్నారు. సుమారు 6.50 లక్షల కోట్ల రూపాయలు నిజమైన పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారన్నారు. లక్షల ఉద్యోగ అవకాశాలు కూడా ఏర్పడతాయన్నారు. చాలా మంది సభ్యులు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని, పరిశ్రమలు తెప్పించాలని కోరుతున్నారన్నారు. సభ్యులు విజయ్ కుమార్ రాజు, యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణ చైతన్య, ఈశ్వరరావు చెప్పిన అంశాలను తాను, తమ ప్రిన్సిపల్ సెక్రెటరీ నోట్ చేసుకున్నామని.. దాన్ని పారిశ్రామికవేత్తలతోనూ, మా సమీక్షలలో కచ్చితంగా చర్చించి ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటామని మంత్రి టి.జి భరత్ చెప్పారు.అంతకుముందు శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్సీ వంకా రవీంద్ర నాథ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మౌలిక సదుపాయాల అభివృద్ధి గ్రాంటు క్రింద రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ను విడుదల చేయకపోవడం వల్ల పెండింగ్ లో ఉన్న కొనసాగుతున్న పనుల వివరాలు ఏంటని ఎమ్మెల్సీ వంకా రవీంద్ర నాథ్ అడిగారు. అలాంటివి ఏమీలేవని మంత్రి తెలిపారు. దీంతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు (టెట్లీ) ఇండస్ట్రియల్ ఎస్టేట్ పనులు మధ్యలో నిలిచిపోయాయా అని అడగ్గా..

మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.10.10 కోట్ల (కేంద్ర ప్రభుత్వం వాటా 8 కోట్లు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం / ఎ.పి.ఐ.ఐ.సి వాటా రూ.2.10 కోట్లు) ఎంఎస్ఇసిడిపి కేంద్ర ప్రభుత్వ పథకం క్రింద ఎపిఐఐసి ద్వారా పశ్చిమ గోదావరిలో టేట్లే, తణుకు వద్ద ఇండస్ట్రీయల్ ఎస్టేట్ పనిని చేపట్టడమయిందని మంత్రి తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో తిరిగే పలు రైళ్లు నెలాఖరు వరకు రద్దు

**గుంతకల్లు రైల్వే,మార్చి 5,ప్రభాతవార్త** మహా కుంభమేళా–2025పేరిట తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి రద్దు చేసిన పలు పాసింజర్ రైలు సర్వీసుల రద్దును పొడి గించినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. తిరుపతి– కదిరిదేవరపల్లి– తిరుపతిల మధ్య తిరిగే నెంబర్ 57405/06పాసింజర్, తిరు పతి– గుంతకల్లు– తిరుపతి నెంబర్ 57 404/03పాసింజర్ రైలు సర్వీసులను ఈ నెల 30/31వరకు, తిరుపతి–హుబ్లీ–తిరుపతి నెంబ ర్ 57401/02ఇంటర్ సిటీ ఎక్స్ప్రెస్‌లను ఈ నెల 15/16వరకు రద్దు చేశారు. అలాగే రాజమండ్రి–విశాఖపట్నం–రాజమండ్రి, తిరుపతి– కాట్పాడి–తిరుపతి, కాచిగూడ– మహబూబ్ నగర్–కాచిగూడ, కాచిగూడ– మిర్యాల గూడ– కాచిగూడ, కాచిగూడ– నడి కూడి– కాచిగూడ, కాచిగూడ–డోర్నకల్– కాచి గూడ, డోర్నకల్–విజయవాడ–డోర్నకల్, విజ యవాడ–గుంటూరు–విజయవాడ మధ్య తిరిగే రైలు సర్వీసులను కూడా ఈ నెల 15/16వరకు రద్దు చేసినట్లు పేర్కొంది.

## తిరుమల లోయలో గుర్తుతెలియని వ్యక్తంటూ పుకార్లు

### - విజిలెన్స్, పోలీసు రెస్క్యూటీమ్ ఆపరేషన్



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి అలిపిరి నుండి కాలినడక మెట్లమార్గానికి అనుసంధానంగా ఉన్న మొదటిఘాట్‌లో అక్కగార్ల గుడి వద్ద ఓ వ్యక్తి లోయలో దిగేశాడని సమాచారం హడలెత్తించింది. బుధవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగిందని కొందరు భక్తులు చూసి టిటిడి విజిలెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో తిరుమల ఏవిఎస్ఒ, తిరుమల 2టౌన్ సిఐ రాముడు,విజిలెన్స్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది సుమారుగా పదిమందికి పైగా త్రాళ్ళతో అక్కగార్లగుడి ప్రాంతంలో గోడదూకి లోయలోకి చేరుకున్నారు. దాదాపు గంటకుపైగా లోయలో గాలించారు. అయితే ఎలాంటి ఆనవాళ్ళుగానీ, వ్యక్తుల జాఢలేదని తేల్చారు. ఎవరో తప్పుడు సమాచారం అందించారని నిర్ధారించారు. చివరకు పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది వెనుదిరిగారు.

## స్వామివారి అనుగ్రహంతో శుభాలు కలగాలి

### - తెలంగాణ మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఉదయం ఆమె కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించు కున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జులై 4నుండి ఉత్తర అమెరికాలో తెలుగు సంబరాలు



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రవాసభారతీయులు స్థిరపడిన ఉత్తర అమెరికాలో తెలుగుసంఘం ఆధ్వర్యంలో 8వ అమెరికా తెలుగు సంబరాలు జరుపుకుంటున్నట్లు సదస్సు కన్వీనర్ శ్రీనివాస్ గుత్తికొండ, ఛైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని తెలిపారు. బుధవారం ఉదయం ఈ సంఘం నాయకులు తిరుమలకు చేరుకున్నారు. దేవదేవుడిని దర్శనం చేసుకున్నారు. నాటా తెలుగు సంబరాలు కరపత్రాన్ని ఆవిష్కరించారు. స్వామివారి దయతో ఈ సంబరాలు మూడురోజులు జులైలో నిర్వహిస్తున్నామని, విజయవంతం కావాలని వేడుకున్నట్లు తెలిపారు. అక్కడ తాంపా కన్వెన్షన్ సెంటర్‌లో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ప్రవాస భారతీయులు అందరూ విచ్చేయాలని కోరారు.



అసెంబ్లీ ప్రాంగణంలో తక్షశిల ఐఏఎస్ అకాడమీ, తక్షశిల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ విద్యార్థులు

## శాసనసభ సమావేశాలను వీక్షించిన తక్షశిల ఐఎఎస్ అకాడమీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ విద్యార్థులు

**విజయవాడ,మార్చి 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ , డిప్యూటీ స్పీకర్ కార్యాలయ పర్యవేక్షణలో తక్షశిల ఐఏఎస్ అకాడమీ, తక్షశిల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ విద్యార్థులకు శాసనసభ కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు బుధవారం శాసనసభ సమావేశాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రశ్నోత్తర సమయం,జీరో అవర్ వంటి కీలక అంశాలను గమనించారు. ప్రజాప్రాతినిధ్య వ్యవస్థలో జరుగుతున్న చర్చలు, మంత్రుల సమాధానాలు, సభ్యుల వాదోపవాదాలు ప్రత్యక్షంగా వీక్షించేందుకు విద్యార్థులకు ఈ అవకాశం లభించింది. ఈ సందర్భంగా విద్యార్థిని అనన్య తన అనుభూతిని వ్యక్తం చేస్తూ, ‘ నారా లోకేష్ సమాధానాలను ప్రత్యక్షంగా విన్నాను. శాసనసభ సమావేశాన్ని వీక్షించడం చాలా ప్రత్యేకమైన అనుభూతి“ అని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి కృతజ్ఞతలు తెలిపారు. మరో విద్యార్థి హార్షిత్ మాట్లాడుతూ, “ఇది నా జీవితాన్ని మార్చిన అనుభవం. భవిష్యత్తులో మా కెరీర్ ఎదుగుదలకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది“ అని అన్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు విద్యార్థులకు పార్లమెంటరీ వ్యవస్థ, శాసన పరిపాలన, పాలసీ మేకింగ్ పై అవగాహన పెంచేలా ఇలాంటి అవకాశం కల్పించారు. భవిష్యత్తు నాయకులుగా ఎదగబోయే యువతకు ప్రజాస్వామిక వ్యవస్థపై చైతన్యం కల్పించేలా విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి శాసనసభ ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటుందన్నారు.

## ఆ ఇద్దరి వాంగ్మూలాలే కీలకం!

### - కల్తీనెయ్యి కేసులో లోతుగా ఆధారాలు సేకరణ



**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో కీలకంగా ఇద్దరి నిందితుల వాంగ్మూలాలే కీలకం కానుంది. ఇప్పటికే ఆ ఇద్దరినీ నిందితులు ఫొమిల్‌జైన్, అపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను మూడురోజులుపాటు సిబిఐ సిట్ కస్టడీకి తీసుకుని ప్రత్యేక కార్యాలయంలో విచారణ చేస్తున్నారు. విచారణలో గతంలో లక్షలాది రూపాయలు లావాదేవీలపై ప్రత్యేకంగా ఆరా తీసినట్లు, దీనికి వారినుండి తగిన సమాధానాలు రాలేదని సమాచారం. అయితే లడ్డూల తయారీకి టెండర్లు దక్కించుకుని సరఫరా చేసిన నెయ్యిలో కల్తీజరిగింది వాస్తవమేనని ఇద్దరు ప్రధాన నిందితులు వాంగ్మూలం ఇవ్వడం నెక్స్ సిట్ ఏ కోణంలో ,ఎవరినీ అదుపులోకి తీసుకోనుందనేది పెద్ద హాట్‌టాపిక్‌గా మారింది. ఈ కేసులో గతంలోనే సిబిఐ సిట్ అధికారులు అరెస్టుచేసిన నలుగురు నిందితుల్లో ఫొమిన్‌జైన్, చావ్డాలు సిట్ కస్టడీలో ఉన్నారు. నేటితో వారి విచారణ కూడా ముగియనుంది. ఆ తరువాత గురువారం సాయంత్రం తిరిగి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిస్తే మళ్ళీ రిమాండ్ ఆదేశిస్తారా లేక వారికి బెయిల్ మంజూరవుతుందా అనేది సంచలనంగా ఉంది. ఈ కేసులో ఇప్పటికే సిబిఐ సిట్ అధికారులు సిబిఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్‌ప్రభు, డిఐజి మురలీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు అనేక కీలక ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. దాని ఆధారంగా కల్తీనెయ్యి సరఫరాలో ప్రధాన సూత్రధారులు ఎవరనేది తేల్చే పనిలో ఉన్నారు. టిటిడికి తిరుమలలో లడ్డూల తయారీకి స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేస్తామని టెండర్లు విధానంలో మూడేళ్ళ క్రిందట ఒప్పందం కుదుర్చుకున్నారు. టెండర్లు దక్కించుకున్న డైరీలు,కాంట్రాక్టర్‌లు కమీషన్లకు కక్కుర్తిపడి కల్తీనెయ్యి పంపారు. కల్తీనెయ్యి సరఫరాకు సంబంధించి పక్కా ఆధారాలు,రికార్డులు సేకరించిన సిబిఐ సిట్ అధికారులు వేగంగా కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ సమయంలో టిటిడికి సరఫరా చేసిన నెయ్యిలో పలు రసాయనాలు కలిపింది వాస్తవమేనని కీలక పాత్రధారి అయిన అపూర్వవినయ్‌కాంత్‌ఛావ్డా సిట్ విచారణలో వెల్లడించటం తెలిసిందే. అసలు సూత్రధారుల పేర్లు వెల్లడైతేగానీ కల్తీనెయ్యి బాగోతం దొంగలు ఎవరనేది తేల్చాల్సి ఉంది.

## 9నుండి ఐదురోజులు మలయప్పకు ఉత్సవాలు - ఆర్జితసేవలు రద్దు



**తిరుమల, మార్చి 5ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలకు తెప్ప సర్వాంగసుందరంగా రూపొందించారు. ఆలయానికి పక్కనే ఉన్న పవిత్రమైన స్వామివారి పుష్కరిణిలో ఐదురోజులు జరిగే ఈ తెప్పోత్సవాలకు టిటిడి యంత్రాంగం సిద్ధమైంది. రానున్న 9నుండి 13వతేదీ వరకు ఐదురోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు మార్చి 9వతేదీ ఆదివారం సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిస్తారు.

రెండవరోజు మార్చి 10వతేదీ సోమవారం సాయంత్రం రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామి తెప్పపై మూడు ప్రదక్షణలు విహరిస్తారు. మూడవరోజు 11వతేదీ నుండి 13వరకు స్వామివారు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి పుష్కరిణిలో భక్తులకు అనుగ్రహిస్తారు. చివరిరోజు 13వతేదీ ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈనెల 9,10తేదీల్లో రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, 11,12,13తేదీల్లో ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి. భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

## దుర్గమ్మ ఆలయంలో వైభవంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమ్మాణ్య కళ్యాణం



**ఇంద్రకీలాద్రి, మార్చి 5, ప్రభాత‘వార్త’ :** అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో బుధవారం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివార్ల కళ్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. ముందుగా శ్రీ స్వామి అమ్మవార్లను ప్రత్యేక పల్లకీలో కళ్యాణ వేదికపైకి తీసుకొచ్చి అక్కడ శ్రీ స్వామి అమ్మవార్లకు భక్తుల జయజయ నాదాల నడుమ కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

## ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనపై సభా హక్కుల కమిటీకి ఫిర్యాదు చేయాలి: మంత్రి నాదెండ్ల మనోహార్

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** సభా సంప్రదాయాలను ఏ మాత్రం గౌరవించలేని అజ్ఞానంతో విపక్షం ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ అన్నారు.శాసన సభా హుందాతనాన్ని కాపాడే బాధ్యత సభ్యులందరిపైనా ఉంది. ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనపై సభా హక్కుల కమిటీకి ఫిర్యాదు చేయాలని శాసనసభలో మంత్రి నాదెండ్ల మనోహార్ స్పీకరును అభ్యర్థించారు.బుధవారం శాసనసభలో మంత్రి మాట్లాడుతూ... ప్రతిపక్ష సభ్యులు సభ హుందాతనాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు.సభా హక్కులను విస్మరించి, ప్రజలను తప్పుదారి పట్టించేలా దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తూ, సభా హక్కుల కమిటీకి ఈ అంశాన్ని రిఫర్ చేయాలని ఆయన సభాపతిని కోరారు.

## గండికోట నుంచి కుప్పానికి మంచినీరు.. శాశ్వత పైపులైను

### - కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



**కుప్పం, మార్చి 5 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలో ప్రజలకు మంచినీరు అందించేందుకు కడపజిల్లా గండికోట జలాశయం నుంచి శాశ్వత పైపులైను ఏర్పాటుకు మరో నెలరోజుల్లో టెండర్లు పిలవడం జరుగుతుందని కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కడ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిన్నరకాలంలోగా కుప్పంలో ఇంటింటికీ కొళాయిల ద్వారా మంచినీటి సరఫరా చేపడ్తామన్నారు. హంద్రీ–నీవా సుజల స్రవంతి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల్లో భాగంగా ప్రస్తుతం కాలువల్లో లైనింగ్ పనులు జరుగుతున్నాయని మరో ఆరేడు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయన్నారు. సిఎం ఆదేశాలతో కుప్పం సిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కుప్పాన్ని మోడల్ సిటీగా చేసేందుకు ఈఏడాది జూలై నుంచి పనులు మొదలుపెడతామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సహా పట్టణ సుందరీకరణ పనులు చేపట్టడంతో పాటు వందచోట్ల సిసి టివిలు ఏర్పాటుచేస్తామన్నారు.

కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని రెండేళ్లలో ఎయిర్‌పోర్టు నిర్మాణపనులు పూర్తవుతాయన్నారు. కుప్పంలో 2027ఆగస్టు కల్లా ప్రపంచస్థాయి బస్‌స్టేషన్ ఏర్పాటుచేయడంతో పాటు ఏడాదిలోగా ఆర్టీసీలో ఇ – బస్సులు ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. సిఎం ఆదేశాలతో టాటా హెల్త్ సంస్థ ద్వారా డిజిటల్‌నెర్వ్ సెంటర్ సైతం కుప్పంలో ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కుప్పం మీదుగా పలమనేరు – కృష్ణగిరి జాతీయ రహదారిని నాలుగులైన్ల రహదారిగా మార్చేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 53కోట్లతో ఆర్అండ్‌బి రహదారుల నిర్మాణంకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు.

## నడకమార్గాల్లో పాములు

**తిరుమల,మార్చి 5ప్రభాతవార్తప్రతి నిధి:** శేషాచలంకొండల్లో అరుదైన వన్యప్రాణులు, సరీసృపాలు,విష సర్పాల్లో తరచూ జనవాసాల్లోకి, నడకమార్గాల్లో దర్శనమిస్తున్నాం యి. అలిపిరి నడకమార్గంలో గాలిగోపురం వద్ద 7అడుగుల నాగుపాము బుధవారం మధ్యాహ్నం భక్తులకు కనిపించి భయపెట్టింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం. 01 SE/2024-25, తేది: 26.12.2024
పనిపేరు : పింఛా ప్రాజెక్ట్ యొక్క కుడి మెయిన్ కెనాల్ స్లూయిస్ యొక్క ఎమర్జెన్సీ గేట్ మరియు సర్వీస్ గేట్‌ల యొక్క అన్ని దృఢ స్థిర భాగాలతో సహా కలిపి సరఫరా, ఫ్యాబ్రికేషన్, స్థాపన, టెస్టింగ్ మరియు కమీషనింగ్. అంచనా విలువ : రూ.55.86 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ లభించు తేది: 24.02.2025 నుండి 10.03.2025, సా.5.00గం.ల వరకు. తదుపరి వివరాలను www.apeprocurement.gov.in నందు చూడగలరు. ఫోన్: 9440814800.
సం/-. పర్యవేక్షక ఇంజనీరు, నీటిపారుదల వలయము, కడప.
DIPR.NO. 15410/CL/ADVT/1/1/2022-23 తేది: 05.03.2025

వార్త

సమస్యలు చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపై వాటి పరిష్కారాలు ఆధారపడి ఉంటాయి.

-వివేకానంద

# ధర్మాసుపత్రుల కాయకల్ప చికిత్స

పైద్యోనారాయణోహరి' అని ఎంతో గొప్పగా చెప్పుకునే నేల మనది. ఈ భూమ్మీద లభిస్తున్న వైద్యమంతా సాక్షాత్తూ ఆ ధన్వంతరి అంశ నుంచే ఉద్భవించిందని వేరే చెప్పనక్కర్లేదు. అందుకే దేశ విదేశాల నుంచి ఎన్నో అరుదైన రోగాలకు చికిత్స చేయించుకునే క్రమంలో ఎందరో రోగులు హైదరాబాద్‌నో, బెంగళూరునో, బొంబాయినో ఆశ్రయిస్తుంటారు. మేలైన వైద్యంతో సుఖసంతోషాలతో తిరిగి వారు తమ స్వస్థలాలకు చేరుకున్నట్లు వారి కృతజ్ఞతాపూర్వక చిరునవ్వులోనే అర్థమౌతుంది.అంత గొప్ప చికిత్సలున్నా అవన్నీ ప్రయివేటు వైద్యశాలలకే పరిమితమా?అనే సందేహం రాకమానదు. ప్రయివేటు వైద్యం సంపన్నులకే మరి మా మాటేమిటి అని సామాన్యులు అనుకుని వగచిన సందర్భాలు ఎన్నోఉన్నాయి. నాలుగైదు దశాబ్దాలుగా 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అని ఓ రోగగ్రస్తతల్లి తన కూతురితో సర్కారు వైద్యమెలా ఉంటుందో చెప్పే పాట ఇది. అప్పట్లో మారుమోగిపోయేది. దాంతో ప్రభుత్వాలు కాస్త కన్ను తెరచి వైద్యంపట్ల దృష్టి సారించాయి. నిధుల కేటాయింపు, ప్రైవేటుకు పోటీగా ఆధునిక పరికరాలు, నైపుణ్య డాక్టర్ల నియామకం, వంటి సౌకర్యాలు మెరుగుపరిచాయి. అయితే మందుల విషయంలో ఇంకా ప్రభుత్వ వైద్యశాలలు ఇంకా వెనుకబడే ఉన్నాయన్న విషయాలు ఒక్కసారిగా ప్రపంచానికి తెలిసే రోజులొచ్చాయి. ఎంత దీర్ఘకాలిక వ్యాధినైనా నయం చేసే ఔషధాలు కనిపెడుతున్నారు. కేన్సర్ వ్యాధి నిరోధకత వ్యాక్సిన్‌లు వచ్చాయి. కరోనా ప్రపంచాన్ని పీడిస్తున్న రోజుల్లో వాటి నిరోధానికి కూడా శక్తివంతమైన వ్యాక్సిన్‌లు కనుగొనడంలో మనమే ముందున్నాం. తెలుగు నేల మీద ఎన్నో వైద్యప్రయోగాలు చేయగలుగుతున్నాము. దేశం యావత్తూ ఔషధరంగంలో భారతదేశ ఘనతను చెప్పుకొని కీర్తిస్తున్నాయి. కానీ ఈ దేశంలో మాత్రమే ఔషధాల తయారీ విషయంలో పెడధోరణులు తలెత్తడం విస్మయపరుస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులను ఎంతగా ఆధునికం చేసినా అక్కడ గోళీలు కానీ అరుకుకానీ దొరకదు. నాణ్యమైన ఔషధాలు దొరకవు. ప్రజారోగ్యం విషయంలో ప్రభుత్వాలు తాము ఎంతగానో పాటుపడుతున్నామని చెప్పుకుంటున్నా ఆస్పత్రులకెళ్తే సామాన్యునికి 'డోలో' వంటి జ్వరాలకిచ్చే మాత్రలు కూడా అందుబాటులోకి రావు. ఇవన్నీ రోగికి,రోగానికే శాపమే. ఆస్పత్రులలో మందుల కొరత, కార్పొరేట్ ఆస్పత్రులలో నిలువుదోపిడీ, నకిలీ వైద్యచికిత్సలు కూడా తక్కువేమీ కాదు. కిడ్నీలు అమ్ముకోవడం, నకిలీ డాక్టర్లే అసలు సిసలు డాక్టర్లుగా వైద్యసంస్థలనే నిర్వహిస్తూ సొమ్ము చేసుకోవడం తెలిసిందే. 'రోగుల దోపిడీ'ని అరకట్టాలన్న ఓ కేసు సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం దేశంలోని వైద్య వ్యవస్థలో ఔషధ దందావంటి అంశాలపై చురకలు వేసింది. వైద్య వ్యవహారాలు పట్టనివారికైనా తమ రోగాల చికిత్సలకు తగిన వైద్యుల్ని, తగిన ఆస్పత్రులను ఎన్నుకోవడంలో మెళకువతనంతో వ్యవహరిస్తారు. ఇక ధర్మాసుపత్రుల సంగతి చూస్తే ఎన్ని కాయకల్ప చికిత్స లు చేసినా మారలేదని జనం లబోదిబోమంటున్నారు. దీనికంతకూ కారణం జనం చెబుతున్నట్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే కారణమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఔషధ ధరలు అందుబాటులో ఉండాల్సిన ఔషధ కొరత, ఔషధాల నాణ్యత విషయంలో ప్రభుత్వాల సరైన అజమాయిషీ చేయలేకపోతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రైవేటు వైద్యానికి వెళ్లిన వారికి అక్కడి వైద్యులే తమ ఫార్మసీలోనే ఔషధాలు కొనాలని నిర్దేశించడం ఒక ఎత్తయితే ప్రభుత్వ వైద్యశాలల్లో కూడా రోగులకు అతి తక్కువ ఖరీదులో వచ్చేజనరిక్ మందులు కాకుండా అక్కడ లేనివి వేర్వేరు కాంబినేషన్ల కుదరని మందులు రాసి జనాన్ని ప్రయివేటు ఫార్మసీలకు పంపడంపట్ల ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యవస్థలో రోగులు దోపిడీకి గురవుతున్నారు. పైగా ఆయా డాక్టర్లు రాసిన కాంబినేషన్ మందులు మరోచోట రిబేటుధరతో తక్కువ ఖరీదుకు దొరికినా వారికి అక్కడ కొనుకొనే వెసులుబాటులేని పరిస్థితులుంటాయని కోర్టు తప్పుపట్టింది. పేదరోగులకు అందు బాటులో ఔషధ ధరలుండేటట్లు తగిన మార్గదర్శకాలను సూచించాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. విశేషమేమిటంటే గతంలో ఇదే అంశమై అన్ని రాష్ట్రప్రభుత్వాలకూ నోటీసు లిచ్చినా అరుణాచలప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బీహార్, తమిళనాడు, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు మాత్రమే స్పందించాయి. తెలుగు రాష్ట్రాలు ఆ విషయంలో పట్టనట్లే ఉన్నాయి. కేంద్రం సూచించిన ధరల నియంత్రణ ఆదేశాల మేరకు నడుచుకునే ఏ ప్రయత్నమూ చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే ప్రైవేటు ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా మారింది. పేద వర్గాలకు ప్రాణాధార ఔషధాలు అందుబాటులో ఉంచలేకపోవడం కూడా ప్రభుత్వ వైఫల్యమేనని పేర్కొంది. ఇన్ని చురకలు వేసినా ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు ఉన్నాయని వేరే చెప్పనక్కర్లేదు. చాలా ఆస్పత్రులలో అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేసినా వాటిని ఆపరేట్ చేసే టెక్నాలజిస్టులు లేక పనికిరానివిగా మూలనపడి ఉన్న సందర్భాలు చూస్తుంటాము. కేవలం ఔషధ ధరల దోపిడీని మాత్రమే ధర్మాసనం ముందు పిటీషనర్ నివేదించి సానుకూల ఆదేశాలను ఇవ్వాలని కోరారు. ఇలాంటి వెన్నున్నా పేద రోగులకు పెద్దగా ఖరీదులేని నాణ్యమైన ఔషధాలను సరసమైన ధరకు అందించడం, ప్రభుత్వాలు తమ విద్యుక్తధర్మంగా భావించాలి.

# అత్యుత్తమ పోలీసింగ్‌తోనే ఆదర్శ సమాజ నిర్మాణం!

**చట్టాలు అందరినీ సమానంగానే చూస్తాయనే నమ్మకాన్ని కలిగించాలి. అదేవిధంగా ఉన్నతాధికారుల ఒత్తిళ్ల నుండి క్రింది స్థాయి పోలీసు సిబ్బందికి అవసరమైన రక్షణను కలిగించడానికి శాఖాపరమైన ఓ శాశ్వత నియంత్రణా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిందే. పోలీసు శాఖలో గంజాయి మొక్కల లాంటి పోలీసులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, వారిని ఎదగకుండా చేయడంతో పాటు ఏరివేసినప్పుడే సమాజ రక్షకులుగా పోలీసుల ప్రతిష్ట పెరగడంతోపాటు వారి నిఖార్సయిన సేవలతో ఆదర్శ సమాజ నిర్మాణం సాధ్యమౌతుందనే బుద్ధిజీవుల ఆశలు నెరవేరతాయో లేదా అడియాసలుగానే మిగిలిపోతాయో రాబోయే కాలమే తేల్చిచెప్పాల్సి వుంది.**



డాక్టర్
నీలం సంపత్

తమ ఉద్యోగ ధర్మంలో భాగంగా మనదేశాన్ని విదేశీ శత్రువుల దాడుల నుండి కంటికి రెప్పలా కాపాడే గురుతర బాధ్యతను అంగీకరిస్తూ, ప్రాణ త్యాగాలకు సైతం సిద్ధపడే త్రివిధ దళాలకు చెందిన ఇండియన్ ఆర్మీతో పాటు, బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్, సెంట్రల్ రిజర్వ్ ప్రొటెక్షన్ ఫోర్స్‌తో పాటు, రా,సి.బి.ఐ,ఐ.బి. లాంటి ఇతర వివిధ దేశరక్షణ ఏజన్సీల తర్వాత అదేస్థాయిలో దేశంలోని వివిధ రాష్ట్రాలూ, ప్రాంతాలలో దేశంలో అంతర్గత శత్రువులు, సంఘ విద్రోహ శక్తులబారినుండి ప్రజలను కాపాడే బాధ్యతను తమ ఉద్యోగ ధర్మంలో భాగంగా త్రికరణ శుద్ధిగా నిర్వర్తించే పోలీసుశాఖ ప్రజల నుండి అదే స్థాయిగౌరవం, ఆదరాభిమానాలను పొంద గలుగుతుందనడంలో ఎలాంటి సందేహం అక్కర లేదు. మిలటరీ పారా మిలిటరీ తర్వాత ఓ యూనిఫాం డిపార్ట్‌మెంట్‌గా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి మెజారిటీ సగటు యువతలో వున్న క్రేజ్‌కి మరే ప్రభుత్వోద్యోగమూ పోటీకి రాలేదు. పత్రికలూ, ప్రసార సాధనాలతోసహా అధికార, విపక్షమనే తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వ శాఖల్లో అతి ముఖ్యమైన శాఖగా పోలీస్ వ్యవస్థకు ఓ ప్రత్యేకమైన గుర్తింపునూ, గౌరవాన్ని ఇస్తుండడం బహిరంగ రహస్యమే. మన తెలంగాణ రాష్ట్రంతో సహా అన్ని రాష్ట్రాలలో ప్రజలకు శాంతియుత జీవనాన్ని కానుకగా అందించే ఉత్కృష్టమైన బాధ్యతను నిర్వర్తించాల్సిన పోలీసుశాఖకు సంబంధించిన ఉద్యోగుల ఎంపిక శిక్షణ అత్యంత ప్రతిష్టాత్మకమైన ముస్సోరీ, సర్దార్ పటేల్ పోలీస్ అకాడమీల లాంటి శిక్షణా సంస్థల్లో కఠినమైన పద్ధతుల్లో పూర్తి చేయబడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే తమ ఉద్యోగ ధర్మంలో భాగంగా పోలీసులు ప్రజల జీవన రక్షకులుగా వ్యవహరించే క్రమంలో వ్యక్తిగత జీవితాలను వంద శాతం స్వతంత్రంగా ఆనందంగా అనుభవించే అవకాశాలు రావడంకష్టమే. దేశ అంతర్గత భద్రత ప్రాథమ్యంగా ప్రభుత్వాలు ఈ శాఖకు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ప్రశ్నించడానికి వీల్లేని అధికారాలను సైతం ధారాదత్తం చేయక తప్పదు.తమ ఉద్యోగ ధర్మంలో భాగంగా కరడు గట్టిన నేరస్తులను సైతం ఎదుర్కోవాల్సి వుంటుంది. ఉద్యోగ మార్గదర్శకాల ప్రకారం ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చి చూసినప్పుడు అత్యంత ఉత్కృష్టమైన క్రమశిక్షణతో మెలగాల్సి వున్న క్రమంలో ఉన్నతాధికారుల బాసిజపుమోతాదు పెరిగి వారిపై తీవ్రమైన ఒత్తిళ్లుంటాయనేది నిర్వివాదాంశమే. తమ ఉద్యోగ ధర్మంలో భాగంగా అనునిత్యం వివిధ రకాల నేరస్తుల బారి నుండి ప్రజలను కాపాడే క్రమంలో పోలీస్‌లు తమ శాఖాపరమైన మార్గదర్శకాలలో భాగంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణతోపాటు అధికార పార్టీ ప్రతినిధుల ఇన్ఫార్మల్ ఆదేశాలకు లోబడి విధినిర్వహణను కొనసాగించాల్సి వస్తుండడం ఆనవాయితీగా కొనసాగుతుందనే నిష్ఠుర సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. నేర విచారణ, నేరస్తులను శిక్షించడానికి సంబంధించి చట్టాలలో ఎంత స్పష్టతవున్నా, నిష్పక్షపాతంగా ఆచరణలో వాటిని అమలు పరచాల్సివున్నా రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో అది సాధ్యం కావడం లేదనే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. మరోవైపు రాజకీయాల్లో నేరచరిత్ర కలిగినవారు ప్రవేశించడమే కాకుండ తదనంతరం తమ నేర కార్యక్రమాలను కొనసాగిస్తూ విపరీతమైన సంపదను పోగు చేసుకుంటూ భోగలాలసతతో కూడిన జీవనాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో వారికి అత్యంత సన్నిహితులుగా కదలాడుతున్న పోలీసుశాఖ లోని కొంతమంది అధికారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం,అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఆశ్రయం కోసం,తద్వార అధిక రాబడులను పొందడానికి వీలున్న పోస్టింగ్‌ల కోసం నేరాలకు పాల్పడుతున్న అధికార పార్టీకి చెందిన రాజకీయ నేతలకు వంత




పాడుతూ విపక్షాలకు చెందిన పార్టీలనేతలపై అక్రమ కేసులను బనాయిస్తూ పాలనలో సమన్యాయానికి తిలోదకాలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గత ప్రభుత్వంలో జరిగినట్లుగా వార్తలకెక్కిన టెలిఫోన్ ట్యాపింగ్ ఆరోపణలే వీటికి సజీవ ఉదాహరణగా చెప్పక తప్పదు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఈ ఆరోపణలు తెరమీదకు రావడం శోచనీయం. రోజువారీ జీవనంలో కొన్నిసందర్భాల్లో పురుషుల ఆకృత్యాలకు గురై రక్షణకోసం తమను ఆశ్రయిస్తున్న పీడిత మహిళలను లైంగికంగా తమ వశం చేసుకుంటున్న కొంతమంది పోలీసుల మూలాన మహోన్నతమైన పోలీసు శాఖ ప్రతిష్ట మసకబారుతోన్న వైనం బాధాకరం. మరోవైపు అశ్లీల వీడియోలతో సమకాలీన సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న ఇంటర్‌నెట్ కొంతమంది మానసికంగా బలహీనులైన పోలీసులపై సైతం తమ చెడు ప్రభావాన్ని చూపెడుతుందేమోనిపిస్తుంది. ఈ నేపథ్యంలో కొంత మంది పోలీసులు తమ కుటుంబాలలో, దాంపత్య జీవనంలో నెలకొని ఉన్న విభేదాలూ, అపార్థాల కారణంగా వివాహేతర సంబంధాలకు తెరదీస్తూ సమకాలీన సినిమాలలో పోలీస్ విలన్లను తలదన్నే స్థాయిలో ప్రభుత్వం దుష్ట శిక్షణ కోసం, శిష్ట రక్షణ కోసం తమకు ఇచ్చిన రివాల్వర్‌లతో బెదిరిస్తూ మహిళలపై లైంగిక దాడులు చేస్తూ,కొన్ని సందర్భాల్లో వారి మరణాలకు కారణమౌతూ,సివిల్ తగాదాల్లో తలదూరుస్తూ, సెటిల్ మెంట్లు చేస్తూ కంచెయే చేను మేస్తున్న చందాన్ని గుర్తుచేస్తుంటే పౌర సమాజం భయభ్రాంతులకుగురౌతోంది. సమకాలీన సమాజంలో ప్రజలకు శాంతియుత జీవనాన్ని కానుకగా అందించాల్సిన బాధ్యత గల పోలీసులు తమ దైనందిన వృత్తి జీవనంలో పైఅధికారుల నుండి, వివిధ రాజకీయ పార్టీల నేతల నుండి నేర నియంత్రణకు సంబంధించిన వివిధ చట్టాలను అమలు పరిచే క్రమంలో తీవ్రమైన ఒత్తిళ్లకు గురౌతున్నారనే పుకార్లు శికార్లు చేస్తున్నవైనం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు నేర ప్రపంచం సైతం వివిధ మార్గాల ద్వారాతమ మనుగడ కోసం పోలీసుశాఖను అనుచితంగా ప్రభావితం చేస్తున్నారేమోననే భావనపై సైతం చర్చ జరుగుతోంది. మరోవైపు కనీసం వీకెండ్ సెలవులు కూడా లేక తమ కుటుంబాలతో వారానికోసారైనా సేద దీరే అవకాశాలు లేని ఉద్యోగ జీవనం సైతం వారిపై ఒత్తిళ్లను పెంచుతోంది. నిజానికి ఉద్యోగాలకు ఎంపికైన తర్వాత ఉద్యోగంలో చేరడానికి ముందు వివిధరకాల శారీరక, మానసిక ఒత్తిళ్లనుండి సురక్షితంగా బయటపడడానికి ప్రతిష్టాత్మక శిక్షణా కేంద్రాలలో మనోవిజ్ఞానవేత్తలచే,యోగా నిపుణులచే సుదీర్ఘమైన శిక్షణను ఇచ్చినప్పటికీ మంచి పోస్టింగ్‌ల కోసం అధికార పార్టీనాయకులతో లాబీయింగ్ చేసినా ఆశించిన పోస్టింగ్‌లు లభించక కొంతమంది లూప్‌లైన్‌లో పనిచేస్తూ పైరవీకోసం చేసిన అప్పులు తీర్చలేక అవినీతికిపాల్పడుతూ, ఆర్థిక నేరాల ఊబిలో చిక్కుకున్న భయంతో కొంత మంది, మరోవైపు పదవికోసం అధికారపార్టీ నేతలతో చెట్టా పట్టా లేసుకొని తిరిగిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల నేతలు రాస్తున్న పింక్ బుక్కులూ, ఎల్లో బుక్కులూ,ఎర్ర బుక్కులూ, కాషాయ బుక్కుల పేరుతో చేస్తున్న బెదిరింపులూ, ఒత్తిళ్లతో కొంత మంది ఈ దురదృష్టకర నిర్ణయాలను తీసుకుంటున్నారేమోననే భావనకూడా లేకపోలేదు. ఈ మధ్యకాలంలో వివాహేతర సంబంధాలు కూడా ఆత్మహత్యలకు కారణాలుగా మారుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. ప్రజాస్వామ్య పాలనలో ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యతను నిర్వర్తించాల్సిన పోలీసుశాఖ అధికారంలో వున్న ప్రజాప్రతినిధుల అడుగులకు మడుగులొత్తే శాఖగా కాకుండా పోలీస్ మ్యాన్వల్ ప్రకారం పూర్తి స్వతంత్ర ప్రతిపత్తిగలిగిన ప్రజా రక్షణ శాఖగా తన విద్యుక్త ధర్మాన్ని తీర్చే చట్టపరమైన వెసులుబాటుని ప్రభుత్వమే కలిగించాలి. మానవ హక్కులూ, మహిళల హక్కుల రక్షణకు సంబంధించి పోలీస్ శాఖ నిర్వర్తించాల్సిన విధులకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలనూ,నిర్దేశాలనూ పోలీసులకు ఎప్పటి కప్పుడు తెలియజేయడంతో పాటు ఏడాదికోసారైనా వారికి అవసరమైన శిక్షణతోపాటు పునశ్చరణ తరగతులను నిర్వహించాలి. చట్టాలు అందరినీ సమానంగానే చూస్తాయనే నమ్మకాన్ని కలిగించాలి. అదేవిధంగా ఉన్నతాధికారుల ఒత్తిళ్ల నుండి క్రింది స్థాయి పోలీసు సిబ్బందికి అవసరమైన రక్షణను కలిగించడానికి శాఖాపరమైన ఓ శాశ్వత నియంత్రణా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిందే. పోలీసు శాఖలో గంజాయి మొక్కల లాంటి పోలీసులను ఎప్పటి కప్పుడు గుర్తిస్తూ,వారిని ఎదగకుండా చేయడంతో పాటు ఏరివేసినప్పుడే సమాజ రక్షకులుగా పోలీసుల ప్రతిష్ట పెరగడంతోపాటు వారి నిఖార్సయిన సేవలతో ఆదర్శ సమాజ నిర్మాణం సాధ్యమౌతుందనే బుద్ధిజీవుల ఆశలు నెరవేరతాయో లేదా అడియాసలు గానే మిగిలిపోతాయో రాబోయే కాలమే తేల్చి చెప్పాల్సివుంది. ●

బంగారం నాణ్యత అగ్నిలో తెలుస్తుంది. మనిషి మంచితనం కష్టంలో తెలుస్తుంది.



జార్జి ఎలియట్

మన ప్రవర్తనలో ముందుగా మార్పు వస్తే, సహజంగానే ప్రపంచంలోనూ మార్పు వస్తుంది.



షేక్‌స్పియర్

# 'జయహో.. జనయిత్రీ' స్త్రీ శక్తికి సాటేది!

సిద్ధగౌని సుదర్శన్

మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు. 'ఏ పక్షిఅయినా ఒక రెక్కతో ఎగరలేదు' అన్న స్వామి వివేకానంద మాటలు మరోసారి స్మరిస్తూ.. 'అన్నీ మారుతున్నాయి. మహిళల పట్ల మన ఆలోచనా ధోరణి తప్ప'. అవును 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత' అని ఆర్యోక్తి. దీనికి అర్థం ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని. కాని దేవతగా కొలవాల్సిన స్త్రీమూర్తిపై అత్యాచార సంస్కృతి నేటి పరిస్థితుల్లో ఆందోళన కలిగిస్తోంది. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలం. ఇదే నినాదంతో ఐక్యరాజ్య సమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను ఏటా నిర్వహిస్తోంది. మహిళా దినోత్సవాన్ని సాధించుకోవడానికి పలు దేశాల్లోని మహిళలు దశాబ్దాలుగా పోరాటాలు చేయాల్సివచ్చింది. మహిళలు అంతరిక్షం నుంచి కుటుంబం దాకా సాధించిన ప్రగతి ఒక్క రోజులో సాధ్యంకాలేదు. ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న విజయమిది. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత శిఖరాల్లో నిలిచిన మహిళకు ఇంకా లింగవివక్ష, హింస, దురాగతాలు తప్పడం లేదు. ఆకాశంలో సగం అన్నింటా సగం అనే మహిళలకు అన్ని చోట్ల ఇబ్బందులే ఎదురవుతున్నాయి. పురుషాధిక్యత నుంచి స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి చట్టాలు తీసుకొచ్చినా ఇంకా పోరాటాలు చేయక తప్పడం లేదు. నాడు చికాగోలో ప్రారంభమైన మహిళా దినోత్సవం ఇప్పుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా మారిపోయింది. దేశాల్లోని ప్రభుత్వాలు ఈ రోజును ప్రత్యేకంగా గుర్తిస్తున్నాయి. సమాజంలో మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకోగలిగే నిరంతర జీవనాధార అవకాశాలు తామే స్వయంగా నిర్మించుకోగలిగే ఉన్నత స్థితికి చేరుకుని స్త్రీ శక్తి ఏంటో ప్రపంచానికి తెలియజెప్పుతూనే ఉన్నారు.



విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో మహిళలు రాణిస్తూ మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. మానవ వనరుల సంపూర్ణ వినియోగంలో వీరిపాత్ర కూడా కీలకం.రంగం ఏదైనా ఉన్నత శిఖరాలను చేరుకుని పురుషశక్తికీ తామేమీ తీసిపోమని చాటిచెపుతోంది స్త్రీశక్తి. తాము ఇంటికే పరిమితం కాదంటూ పురుషులకు ధీటుగా విజయాలు సాధిస్తున్నారు. 'కార్యేషు దాసీ..కరణేషు మంత్రీ..భోజ్యేషు మాతా.. శయనేషు రంభా' అని కవి చెప్పినట్టుగా ప్రతిమగాడి విజయంలో స్త్రీపాత్ర లేనిదే అత డికి మనుగడే లేదు. ఏ సమాజం, ఏ సంస్కృతి ఏజాతి స్త్రీకి సమున్నత స్థానంకల్పిస్తుందో ఆ సమాజం,ఆ సంస్కృ తి ఆజాతి అభివృద్ధిపథంలో ముందుంటుంది. ఏ సమాజం, ఏ సంస్కృతి ఏ జాతి అయితే ఈ విషయంలో వెనుకడుగు వేస్తుందో ఆ జాతి అభివృద్ధిని సాధించలేక ప్రగతిపథంలో వెనుకబడే ఉంటుంది. పాశ్చాత్యదేశాలు నేడు ఒళ్లు గగుర్పొడిచే ప్రగతిని సాధించాయంటే దానికి కారణం వారు జీవన స్రవంతిలో అన్నిరంగాల్లో స్త్రీకి ఇచ్చిన సమున్నత స్థానమే అనటంలో ఎటువంటి సందేహం లేదు. ఏ దేశంలోనైనా జనాభాలో సగభాగమైన స్త్రీలు వారిలోని ఉత్పాదక శక్తిని వినియోగించే అవకాశం ఉంటేనే కదా సమాజం అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధిని సాధించి ముందుకువెళ్తుంది. అలాంటి వాతావరణం కలగచేయవలసిన బాధ్యత సమాజం మీద ప్రభుత్వాల మీద ఉంటుంది. ఆ బాధ్యతను ఏడాదికి ఒకసారైనా గుర్తుచేసుకోవటం సముచితం. ఈ విషయంలో మనం ఆలస్యంగా మేలుకున్నాం. సమాజంలో స్త్రీ వివక్షకు గురైందన్న విషయంలో ఎవరికీ సందేహం ఉండనవసరం లేదు. నేడు స్త్రీఅన్నిరంగాల్లో పురుషులకన్నా మిన్నగా రాణిస్తున్నప్పటికీ స్త్రీపట్ల చులకనభావం నుంచి సమాజంబయట పడలేదని చెప్పాలి. మార్పురావాలంటే వాస్తవాన్ని ఒప్పుకోవాలి. స్త్రీని జెండర్ కోణంలో కాకుండా ఒక మనిషిగా చూడటం సమ్మాజం నేర్చుకోవాలి. స్త్రీ రూపాన్ని కాకుండా స్వరూపాన్ని చూసే దిశగా సమాజం పయనించాలి. ●

# ప్రజావాక్కు



### నియోజకవర్గాల పెంపు

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పెంపుకుసన్నద్ధం చేస్తోందని వార్తలొచ్చాయి. ముఖ్యంగా కొన్ని పార్లమెంటు నియోజకవర్గాలను తమకు అనుకూలంగాపెంచుకుంటున్నాయేననిపిస్తోంది. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లోనున్న ఎనభై సీట్లను నూటఇరవైకి, బిహార్‌లో నలభైను డబ్భైకి పెంచితే ఆంధ్రలో ఇరవై అయిదును ఇరవై ఎనిమిదికి, తెలంగాణాలో పదిహేడును ఇరవైకి, తమిళనాడులో ముప్పైతొమ్మిదిని నలభైఒకటికి, కర్ణాటకలో ఇరవైఎనిమిదిని ముప్పైఆరుకిపెంచగా కేరళలో నున్న ఇరవైని పందొమ్మిదికి కుదించారు. ఈప్రతిపాదనలో రాజకీయ కోణాలున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. భారతీయ జనతా పార్టీకి దక్షిణ భారతంలో పట్టులేదు. అందుచేత ఉత్తరాన పెంచితే మరల ప్రభుత్వ మనుగడకు ఢోకా ఉండదనే ధీమాతో నున్నదేమో.నియోజక వర్గాలు జనాభా ప్రాతిపదికన నిర్ణయించబడతాయి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### రోడ్లను బాగు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోరోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి.సంక్షేమకార్యక్రమాల పేరుతో అప్పులు చేసి తెచ్చిన పప్పు కూడుగా డబ్బులు నేరుగా ప్రజల అకౌంట్లోకి వెళ్లిపోవడంవల్ల కెసిఆర్ స్వార్థం కారణంగా కాంగ్రెస్ వారితెలివి తక్కువ ఆలోచనకారణంగా విభజించబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిన్నరాష్ట్రంగా మారింది.13 జిల్లాలు 26 జిల్లాలుగా మారి ఉద్యోగుల సంఖ్యను పెంచేసింది. రోడ్లు అధ్వాన్నంగా ఉండడంవల్ల యాక్సిడెంట్లు విపరీతంగా జరుగుతున్నాయి.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

### స్టేషన్‌లలో రైళ్లను నిలపాలి

కేంద్ర రైల్వేశాఖ పలు స్టేషన్‌ల ప్రాముఖ్యతను గుర్తించి ఆ స్టేషన్‌లలో రైళ్లనునిలపాలి.ప్రస్తుతం కొన్ని స్టేషన్‌లలో పలు రైళ్లు నిలపడం లేదు. ఈ కారణంగా ముందు స్టేషన్‌లలో దిగిచాలా వ్యయప్రయాసలతో తమ గమ్యస్థానాలకు చేరుకోవలసి వస్తుంది. ప్రతి సామాన్యుడు రైలు ప్రయాణం కోరుకుంటాడు. కానీ ఇలా కొన్ని స్టేషన్‌లలో నిలపకపోవడం వల్ల చాలామంది సామాన్య ప్రయాణికులకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### అందని వైద్యం

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటికీ మెరుగైన వైద్యసదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలందరూ కూడా వారికి వచ్చిన వ్యాధులను నయం చేసుకోవడానికి వారి దగ్గర ఉన్న డబ్బులు సరిపోక ఇళ్లు, పొలాలు అన్ని అమ్మేసి వాటితో వచ్చిన డబ్బులతో ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్తున్నారు. ప్రస్తుత కాలంలో చిన్నపిల్లలకి కూడా బ్లడ్ కేన్సర్, కాలేయ సంబంధిత వ్యాధులు, మెదడులో కణితులు ఇలా ఎన్నోరకాల సమస్యలు రావడం,వాటిని తగ్గించుకోవడం కోసం కొన్ని లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అందువల్ల ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలపై మోయలేని భారం పడుతోంది. దాతలు అందించే ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న వారు కొన్ని వేలమంది ఉన్నారు.ఇటువంటి ఘటనలు నిత్యం కళ్లకు కట్టినట్టు ప్రభుత్వాలకు కనిపిస్తున్నా ఈ సమస్యల పరిష్కారానికి మాత్రం మార్గం చూపడం లేదు.

-కె.కిరణ్, కొండాపూర్, జనగామ

### యువతలో మానసిక సమస్యలు

నేటి ఉరుకుల పరుగుల జీవితం, ఆధునిక జీవనశైలి, యువత జీవితాల్లో మానసిక ఒత్తిడిని వేగంగా పెంచుతోంది. టీనేజర్లు, యువకులు ఒత్తిడిని ఎక్కువగా అనుభవిస్తున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా చిన్నారుల్లో మానసిక ఒత్తిడి కనిపించడం ఆందోళనకరంగా మారింది.దీనికి ప్రధాన కారణం పాఠశాల, కళాశాలల ఒత్తిడి, సోషల్ మీడియా డిమాండ్, సమాజంలో తమసొంత గుర్తింపును సృష్టించడానికి మానసికంగా సంఘర్షణకు గురవుతూ, పోరాడుతున్నారని వైద్యనిపుణులు చెబుతున్నారు.వీడియో గేమ్‌లు,షేర్‌చాట్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటివాటితో గడుపుతున్న టీనేజర్లు ఎక్కువగా హిక్కోమోరిసింద్రోమ్ బారినపడుతున్నారు.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కాంట్రాక్ట్ టీచర్స్ బదిలీలు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గురుకులాలలో 2024 లో నూతన నియామకాలు చేపట్టడం జరిగింది. కొత్తవారితో పాటుగా పాతవారికి బదిలీలు చేపట్టారు. కేవలం పాత కాంట్రాక్టు టీచర్స్ కొన్ని సంవత్సరాలుగా ఒకే విద్యాసంస్థలలో పనిచేస్తూ ఉన్నారు. వారిని కూడా తప్పనిసరిగా ఈ విద్యా సంవత్సరం చివరిలో లేదా వేసవి సెలవులలో తప్పనిసరిగా బదిలీలు చేపట్టాలి. ఒకేచోట సంవత్సరాల పాటు పనిచేస్తున్నారు.

-రాపాక, రవీందర్,జనగాం

# దోమకాటుతో పెరుగుతున్న మరణాల సంఖ్య

మన్నారం నాగరాజు

దేశంలో దోమకాటుతో ప్రతి ఏటా మరణాలూ పెరుగుతున్నాయి అనేది నగ్నసత్యం. ఇక 2016-23 మధ్య ఏటా లక్షమందికి పైగా దోమకాటు కారక వ్యాధుల బారినపడ్డారు. వారిలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులతో ఆసుపత్రుల పాలైనవారే ఎక్కువ. జూన్, సెప్టెంబరు మధ్యకాలంలో ఆస్పత్రులు ఎక్కువగా జ్వరపీడితులతో కిక్కిరిసిపోతున్నారు. వారిలో చాలామంది పేదలు, మధ్యతరగతి ప్రజలేకావడంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలకు అప్పులు చేయాల్సి వస్తోంది.దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్లో డెంగీ అత్యంత ప్రమాదకరమైనది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా పదికోట్ల మందికి పైగా డెంగీబాధితులు నమోదవుతున్నారని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ కేసులుఅత్యంత వేగంగా విస్తరిస్తున్న దేశాల్లో భారత్ ముందుండటం ఆందోళన కలిగిస్తోంది. పారిశుద్ధ్య చర్యల్లో అలవిమాలిన నిర్లక్ష్యానికి తోడు భూతాపం పెరగడమూ ఇందుకు కారణమవుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ లోగడ హెచ్చరించింది. బాధితులకు సకాలంలో సరైన వైద్యం అందితే డెంగీ మరణాలు బాగా తగ్గుముఖం పడతాయి. వ్యాధి నిర్ధారణ, చికిత్స ఆలస్యమయ్యే కొద్దీ డెంగీ ప్రమాద తీవ్రత పెరుగుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. జాతీయ ఆరోగ్య పథకం గణాంకాల ప్రకారం, 2019లో దేశంలో 1.6లక్షల మంది డెంగీ బారినపడ్డారు. వారిలో 160మంది మృతిచెందారు.2021లో1.93లక్షల బాధితుల్లో 346 మంది, 2022లో 2.33 లక్షల కేసుల్లో 303, 2023లో 2.9 లక్షల కేసుల్లో 484 మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారిక లెక్కల్లోకి ఎక్కని బాధితులసంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చు. గత ఏడాదిలో ఫిబ్రవరి నాటికే సుమారు 20వేల మంది డెంగీ బారినపడ్డారు. వారిలో 16 మంది మృతిచెందారు. ఏటా డెంగీ బారిన పడుతున్నవారిలో తెలంగాణలో 2024 అక్టోబర్ చివరి నాటికి 9,761 మంది మహమ్మారి బారినపడినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం, డెంగీ తరవాత అత్యధికంగా ప్రజలను పట్టిపీడిస్తున్న దోమకారక



వ్యాధి మలేరియా, అందులోనూ ఇటువంటి వ్యాధులుఎక్కువగా మహారాష్ట్రలోనే ప్రబలుతున్నాయి. నిరుడు అక్కడ సుమారు 37,000 మంది దోమకారక జ్వరాలతో సతమతమయ్యారు. భారతదేశంలో దోమలబెడదకు ప్రధాన కారణం పారిశుద్ధలేమి. ఇప్పటికీమురుగునీటి పారుదల వ్యవస్థలు లేనిపల్లెలు, పట్టణాలు మన దేశంలో కోకొల్లలు! మురుగు కాలువలు నిర్మించినా,వాటిని సరిగ్గా నిర్వహించడంలేదు. చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమల సంతతి పెరుగుతోంది.ఖాళీస్థలాల్లో నీరు నిల్వఉండే చోట్ల వాటిసమస్య తీవ్రంగా ఉంటోంది. మురుగునీటి పారుదల వ్యవస్థలను పటిష్టం చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యం. అప్పుడే దోమల సంతతిని నియంత్రించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇక హైదరాబాద్ నగరం, అతి పెద్ద మహానగరాలలో ఒకటి. ఐటీ హబ్,మల్టీనేషనల్ కంపెనీలు, పాతబస్తీ సాంప్రదాయాలు, చారిత్రక కట్టడాలు కలగలసిన ఈ నగరం అభివృద్ధిలో ముందంజలోఉంది. కానీ, నగర వృద్ధితోపాటు కాలుష్యం, పారిశుధ్యం సమస్యలు, దోమల బెడద కూడా పెరుగుతున్నాయి. హైదరాబాద్‌లో మురుగు కాలువలు, నిల్వనీరు, చెత్తా చెదారం సమస్యలు అధికంగా ఉండటంతో దోమల పెరుగుదల నియంత్రణలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దోమలు ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ప్రత్యేకంగా, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వేగంగా వ్యాపిస్తున్నాయి. ప్రభుత్వ ఆరోగ్య శాఖలు, మునిసిపల్ కార్పొరేషన్ వ్యక్తిగత స్థాయిలో తీసుకుంటున్న చర్యలు చాలావరకు తగిన ఫలితాలను ఇవ్వడంలో విఫలమవుతున్నాయి. ఇక హైదరాబాద్ మహానగరం అభివృద్ధిలో ముందంజలో ఉన్నప్పటికీ, ప్రాథమిక సౌకర్యాలపరంగా కొన్ని సమస్యలు ఇక్కడ నివాసముంటున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వీటిలో ముఖ్యమైన సమస్య 'దోమల బెడద'. ప్రజలు ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నా, అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ విధానాల వైఫల్యం, ప్రజల అవగాహన లోపం,మురుగు నీటి సమస్యలు ఇవన్నీ కలిసివచ్చి దోమల సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ప్రభుత్వం,ప్రజలు సమిష్టిగా పని చేస్తే మాత్రమే దీని పరిష్కారం సాధ్యమవుతుంది. ఆచరణాత్మకంగా చర్యలు తీసుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరు అనేది రాజకీయ నాయకులు పాలకులు గుర్తు ఎరగాలి. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భూమి మీదికి ఎప్పుడు వస్తామో చెప్పలేం



## అంతరిక్షంనుంచి సునీత, విల్మోర్‌లు వెల్లడి

**న్యూయార్క్, మార్చి 5:** రోదసిలోకి మూడోసారి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సుమారు తొమ్మిదినెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. ఆమెతోపాటు వెళ్లిన బచ్‌విల్మోర్‌కూడా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. అలాగే వారిని భూమిపైకి తెచ్చేందుకు బైడెన్‌ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నంచేయలేదని, దాంతో వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందని గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా వ్యాఖ్యలుచేసారు. మేం భూమిమీదకు తిరిగి వచ్చే విషయంలో నెలకొన్న అనిశ్చితి చాలా కష్టమైన అంశం అని అంతరిక్ష కేంద్రంనుంచి సునీత మీడియాతో మాట్లాడారు. సుదీర్ఘంగా తాము అంతరిక్షంలో ఉండిపోవడం వల్ల వ్యక్తం అవుతున్న ఆందోళనలను తోసి పుచ్చినప్పటికీ భూమిపై ఉన్న ప్రజలపై ఈ ప్రభావం ఉంటుందని విలియమ్స్, విల్మోర్‌లు అంగీకరించారు. 2030లో అంతరిక్షకేంద్రం జీవితకాలం పూర్తయిన తర్వాత నాసా అంతర్జాతీయ భాగస్వామ్యదేశాలు దాన్ని కక్ష్యనుంచి వేరుచేస్తాయి. అప్పటికంటే ముందే ఐఎస్ఎస్‌ను రిటైర్‌చేయాలని మస్క్‌ప్రతిపాదించారు. ఇపుడు అత్యున్నత దశలోఉన్నాం విషమించడానికి సరైన సమయంకాదని భావిస్తున్నట్లు సునీత అన్నారు. ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయినవారిని బైడెన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న వ్యాఖ్యలపై విల్మోర్ మాట్లాడుతూ రాజకీయ సంబంధమైన వ్యాఖ్యలని అవి జీవితంలో ఒక భాగమని ఈ వ్యవహారంలో రాజకీయాలకు ఎంతమాత్రం జోక్యంలేదని ఆయన అన్నారు. అందరికీ ట్రంప్, మస్క్‌పట్ల గౌరవం ఉంది, మేం మాదేశానికి మా నాయకులకు మద్దతిస్తాం. వారికి మా కృతజ్ఞతలని అన్నారు. 2024జూన్ ఐదున ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లైనర్‌లో వారు ఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రణాళికప్రకారం ఐఎస్ఎస్‌లో ఉన్న వ్యోమగాములు సునీతా విలియమ్స్ బచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. కానీ ఇప్పటికీ అంతరిక్షంలోనే కొనసాగుతుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వీరిద్దరినీ తీసుకురావాలంటే ముందుకొందరిని ఐఎస్ఎస్‌కు పంపించాలి.

ఈప్రయోగం చేపట్టేందుకు స్పేస్ ఎక్స్ సమయం కావాలనడంతో ఆలస్యం జరిగిం దని అధికారులు తెలిపారు. ఇక సునీత విలియమ్స్, విల్మోర్‌లు కొన్నిరోజులక్రితం స్పేస్ ఎక్స్‌నుంచి మీడియాతో మాట్లాడారు. తమకోసం మార్చి 12న స్పేస్ఎక్స్‌కు చెందిన క్రూ10 అంతరిక్ష నౌకవస్తుందని, నౌకలో కొత్తగా ఐఎస్ఎస్‌లోకి వచ్చే వ్యోమగాములు తమ బాధ్యతలు తీసుకుంటారని మార్చి 19న అదే నౌకలో తిరిగిభూమికి వస్తామని తెలిపారు,



## యుఎస్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా
# 13 యేళ్ల బాలుడు!

**వాషింగ్టన్, మార్చి 5:** అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ సంయుక్త సమావేశంలోప్రసంగించిన డొనాల్డ్‌ట్రంప్ అందరినీ ఆశ్చర్యపరిచారు. యుఎస్ సీక్రెట్‌సర్వీస్ ఏజెంట్‌గా 13 ఏళ్ల బాలుడిని నియమించి ట్రంప్ విస్మయానికి గురిచేసాడు. కొన్నేళ్లపాటు క్యాన్సర్‌తో పోరాడి మహమ్మారిని జయించిన ఆ టెక్సాస్ కుర్రాడి కథను అధ్యక్షుడు పంచుకున్నారు. 13 ఏళ్ల డీజే డేనియల్ ఇపుడు మన గ్యాలరీలో కూర్చున్నాడు. 2018లో ఈ బాలుడు అరుదైన కేన్సర్ వ్యాధిబారిన పడ్డాడు. కేవలం ఐదునెలలు మాత్రమే బతుకుతాడని అప్పట్లో వైద్యులు తేల్చారు. కానీ డేనియల్ కుంగిపోలేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా వ్యాధితో ధైర్యంగా పోరాడాడు. పోలీస్ అధికారి కావాలన్న ఆతడి కలను ఎన్నడూ వదులుకోలేదు. అందుకే ఇప్పుడు మేం ఆతడికి గొప్ప గౌరవం ఇవ్వబోతున్నాం. యుఎస్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా ఆబాలుడిని తీసుకోవాలని ఆసంస్థ డైరెక్టర్ సీన్ కారన్‌ను కోరుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. రిపబ్లికన్ సభ్యులంతా లేచి నిలబడి చప్పట్లతో బాలుడిని అభినందించారు. చాలామంది డెమొక్రాట్ సభ్యులు కూడా ఈ నిర్ణయానికి మద్దతివ్వడం విశేషం. ట్రంప్ మాటలు వినగానే డేనియల్ తండ్రిని ఆతడిని ఎత్తుకుని సభలో చూపించారు. సీక్రెట్‌సర్వీస్ డైరెక్టర్ కారన్ బాలుడి దగ్గరకు వెళ్లి అధికారిక ఐడి కార్డును అందచేసారు. ఆ ఐడిని చూసుకుని డేనియల్ మురిసిపోయాడు. అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.



## రాహుల్ గాంధీకి రూ.200 జరిమానా

**లక్నో, మార్చి 5:** కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి ఉత్తరప్రదేశ్‌లోని న్యాయస్థానం రూ.200 జరిమానా విధించింది. పదేపదే విచారణకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో ఈనిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 14న తదుపరి విచారణకు హాజరుకాకుంటే మాత్రం తీవ్రచర్యలుంటాయని రాహుల్‌గాంధీని హెచ్చరించింది. మహారాష్ట్రలో 2022లోమీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్‌గాంధీ వీర్‌సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారినుంచి పింఛన్‌కూడా తీసుకున్నారన్నారు. ఈ వ్యాఖ్యలు స్వాతంత్ర్య సమర యోదుడైన వీర్‌సావర్కర్‌ను కించపరిచేవిధంగా ఉన్నాయని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే వ్యక్తి యూపీ కోర్టులో పిటిషన్ దాఖలుచేసారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా రాహుల్ వ్యాఖ్యలున్నాయయని అందులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌కు సంబందించి తాజాగా మరోసారి విచారణ జరిగింది. రాహుల్‌గాంధీ తరపున న్యాయవాది ప్రన్షు అగర్వాల్ హాజరయి ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్షనేతగా ఉన్న రాహుల్‌గాంధీ బిజీగా ఉన్నారని, వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. పదేపదే విచారణకు గైర్హాజరవుతున్న క్రమంలో ఆయనకు రూ.200 జరిమానా విధించిన అప్పర్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం తదుపరి విచారణకు రాహుల్ విధిగా హాజరుకావాలని ఆదేశించింది. లేకుంటే నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ చేస్తామని హెచ్చరించింది.

## ‘కుంభ్’లో పడవ నడిపి
# రూ. 30 కోట్లు సంపాదన
## విపక్షాల విమర్శలపై స్పందించిన సిఎం ఆదిత్యనాథ్

**లక్నో, మార్చి 5:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా ఘనంగా ముగిసింది. అయితే దీని నిర్వహణపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గట్టిగా బదులిచ్చారు. కుంభమేళా వల్ల ఎంతోమంది ఆర్థికంగా లాభపడ్డారని తెలిపారు. ఓ కుటుంబం 130 పడవలు నడిపిస్తూ ఏకంగా దాదాపు రూ.30 కోట్లు ఆర్జించిందని తెలిపారు. రాష్ట్రబడ్జెట్ సమావేశాలసందర్భంగా యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ప్రయాగ్‌రాజ్‌లో పడవలు నడిపేవారు దోపిడీకి గురయ్యారని సమాజ్‌వాది పార్టీ చేసిన ఆరోపణలపై సిఎం సభలో స్పందించారు. ‘పడవ నడిపే ఓ వ్యక్తి విజయగాథను నేను పంచుకోవాలని అనుకుంటున్నా. అతడి కుటుంబానికి 130 పడవలు ఉన్నాయి. కుంభమేళా సమయంలో ఒక్కో పడవతో రోజుకు రూ.50 వేల నుంచి రూ.52 వేల వరకు సంపాదించారు. అంటే 45 రోజులకు ఒక్కో పడవతో దాదాపు రూ.23 లక్షల చొప్పున ఆదాయం సమకూరింది. అలా మొత్తంగా 130 పడవలతో రూ.30 కోట్లు ఆర్జించారు అని యోగి వివరించారు. ఈ మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్ చేరుకుని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారని సిఎం తెలిపారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా కుంభమేళా నిర్వహించాలని పేర్కొన్నారు. 45 రోజుల్లో ఒక్క నేరం కూడాచోటు చేసుకోలేదని వ్యాఖ్యానించారు. కుంభమేళా నిర్వహణ కోసం



రూ.7500 కోట్ల పెట్టుబడులు పెట్టగా దాదాపు రూ.3లక్షల కోట్ల వ్యాపారం జరిగిందని వెల్లడించారు. హోటల్ పరిశ్రమకు రూ.40 వేల కోట్లు, ఆహారం, ఇతర నిత్యావసరాల రంగానికి రూ.33 వేల కోట్లు, రవాణాకు రూ.1.5 లక్షల కోట్ల మేర ఆదాయం లభించిందన్నారు. ఆర్థికంగా చూస్తే కుంభమేళా నిర్వహణ ఈ ఏడాది దేశ జిడిపి 6.5 శాతం వృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళా జరిగిన సంగతి తెలిసిందే.

## భద్రత పేరుతో సమాచారహక్కు చట్టాన్ని
# బలహీనపరుస్తోన్న కేంద్రం



## కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, మార్చి 5:** ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. భద్రత పేరుతో సమాచారహక్కు చట్టాన్ని కేంద్రం బలహీనపరుస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే మండిపడ్డారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ప్రజా హక్కులను కాపాడటం కోసం నియంతృత్వ పాలనపై తమపార్టీ పోరాడుతుందని అవసరమైతే గల్లీ నుంచి పార్లమెంట్ వరకు కాంగ్రెస్ తన గొంతును వినిపిస్తుంది అని స్పష్టంచేశారు. ప్రజా సంక్షేమ పథకాల అంశంలో గోప్యత కంటే సమాచారం అందించడానికే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని రాసుకొచ్చారు. దేశంలో బంగారం రుణాలు పెరిగిపోతున్నాయని, ప్రధాని మోడీ సృష్టించిన సంక్షోభంలో దేశ ఆర్థిక వ్యవస్థ కూరుకుపోయి ఉందని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఎక్స్‌లో ధ్వజమెత్తారు. 2024 నాటికి ఏర్పడిన ఆర్థిక స్తబ్దత ఫలితంగా కేవలం అయిదు సంవత్సరాల్లో బంగారు రుణాలు 300శాతం పెరిగి తొలిసారిగా రూ.లక్ష కోట్లకు చేరుకున్నాయని గత నెలలో ఆర్బీఐ విడుదల చేసిన ప్రకటనను ఉటంకించారు.

2025 ఫిబ్రవరి నాటికి దేశంలో బంగారు రుణాలు 71.3 శాతానికి పెరిగిపోయా యని అన్నారు. కేంద్ర మంత్రి కుమార్తెను మహారాష్ట్రలో కొందరు యువకులు వేధింపులకు గురిచేసిన ఘటనపై కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అల్కాలాంబా స్పందించారు. మహిళలకు, కుమార్తెలకు భద్రత అంశంలో మహారాష్ట్ర శాపంగా మారిందని తన ఎక్స్ ఖాతాలో విమర్శలు గుప్పించారు.

## రెండుసార్లు ఫెయిల్ అయిన రాజీవ్ ప్రధాని ఎలా అయ్యారో?
### మరోసారి కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టిన మణిశంకర్ అయ్యర్



**న్యూఢిల్లీ,మార్చి 5:** కాంగ్రెస్ నాయకుడు మణిశంకర్ అయ్యర్ మరోసారి ఆపార్టీని ఇరకాటంలో పెట్టారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అకడమిక్ రికార్డును ఉద్దేశించి కీలకవ్యాఖ్యలుచేసారు. రెండుసార్లు పరీక్షల్లో ఫెయిలయిన ఆయన దేశప్రధాని ఎలా అయ్యారోనని ప్రముఖ మీడియాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. రాజీవ్ తానూ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో కలిసి చదువుకున్నామని, అప్పటి పరీక్షల్లో ఆయన ఫెయిల్ అయ్యారని మణిశంకర్ చెప్పారు. సహజంగా విశ్వవిద్యాలయం తమ రెప్యుటేషన్‌ను దృష్టిలో ఉంచుకుని అందరినీ ఉత్తీర్ణులను చేయాలనిచూస్తుందని అయితే రాజీవ్ ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఆ తర్వాత లండన్‌లోని ఇంపీరియల్ కళాశాలలో కూడా రాజీవ్‌గాంధీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారన్నారు. రెండుసార్లు పరీక్షల్లో ఫెయిల్ అయి, పైలట్‌గా పనిచేసిన వ్యక్తి దేశ ప్రధాని అవుతారని నేను ఊహించలేదని ఇదెలా సాధ్యం అయిందో అని మణిశంకర్ ఇంటర్వ్యూలో విస్మయం వ్యక్తంచేసారు. కాంగ్రెస్‌లో చిన్ననేతలకు అంత గుర్తింపు ఉండదని రాహుల్‌ప్రియాంక గాంధీలతో తాను ఒకటి రెండుసార్లు మాట్లాడానని ప్రియాంక అప్పుడప్పుడు ఫోన్‌చేసితన క్షేమసమాచారం తెలుసుకుంటారని అన్నారు.అయితే మణిశంకర్ చేసిన వ్యాఖ్యలను బిజెపి నేత అమిత్ మాలవీయ సోషల్‌మీడియా ఎక్స్‌లో షేర్ చేసారు. ఆయనను ముసుగు తొలగించనివ్వండి అంటూ వ్యాఖ్యలుచేసారు.

## తమిళనాడులోని కేంద్ర కార్యాలయాల నుంచి
# హిందీని తొలగించండి
## సిఎం స్టాలిన్ డిమాండ్



**చెన్నై, మార్చి 5:** కేంద్రం, తమిళనాడు రాష్ట్రాల మధ్య జాతీయ విద్యావిధానం అమలు విషయంలో నెలకొన్న వివాదం కొనసాగుతూనే ఉంది. త్రిభాషా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి కేంద్రంపై విరుచుకుపడ్డారు. తమిళనాడులోని అన్ని కేంద్ర కార్యాలయాల నుంచి హిందీని తొలగించాలన్నారు. తమిళంపై ప్రేమ ఉంటే చేతల్లో చూపించాలన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీకి తమిళం అంటే అపారమైన ప్రేమ అని బిజెపి చెబుతోంది. అదే నిజమైతే దాన్ని ఆయన చేతల్లో చూపించడం లేదు. పార్లమెంటులో సెంగోల్‌ను ఏర్పాటు చేయడం కంటే రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాల నుంచి హిందీని తొలగిస్తే బాగుంటుంది. హిందీకి బదులుగా తమిళాన్ని అధికార భాషగా చేసి మరిన్ని నిధులు కేటాయించండి. కేంద్ర బడ్జెట్‌లో తిరుక్కురల్‌ను ఉటంకిస్తే సరిపోదు. రాష్ట్రానికి ప్రత్యేక పథకాలు, సత్వర విపత్తు సహాయ నిధి, కొత్త రైల్వే ప్రాజెక్టులను అందించాలి. రైళ్లకు అంత్యోదయ, తేజస్, వందేభారత్ వంటి పేర్లు పెట్టడం ఆపండి. దానికి బదులు తమిళ పేర్లను పెట్టండి. తమిళభాషపై ప్రేమను మాటల్లో కాకుండా చేతల్లో చూపించండి అని స్టాలిన్ పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు.

1971 జనాభాల లెక్కల ఆధారంగానే విభజన ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోడీని స్టాలిన్ అభ్యర్థించారు. ప్రస్తుత జనాభా ప్రకారం పార్లమెంట్‌లో తాము 12 సీట్లు కోల్పోయి 10 సీట్లు మాత్రమే వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది తమిళ రాజకీయాలపై ప్రత్యక్షంగా దాడి చేయడమేనన్నారు. ఈ చర్య రాష్ట్ర గొంతును నొక్కేస్తుందన్నారు. తాము విభజనకు వ్యతిరేకం కాదని కానీ గత 50 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన తమకు ఇది శిక్ష కాకూదన్నారు. ఈ సందర్భంగా 2026 జనాభా లెక్కల ఆధారంగా విభజన ప్రక్రియ చేపట్టరాదని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది.

## జమ్ము సోన్‌మార్గ్‌లో హిమపాతం

**జమ్ము, మార్చి 5:** జమ్ముకాశ్మీర్‌లోని సోన్‌మార్గ్‌లో బుధవారం భారీ హిమపాతం సంభవించింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యాయి. అయితే ఈఘటనలో ఎలాంటి ప్రాణనష్టంజరగలేదని అధికారులు వెల్లడించారు. భారీ ఎత్తున మంచు దూసుకువస్తున్న దృశ్యాలను చూసినవెంటనే స్థానికులు అప్రమత్తం అయి సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని ఛమోలి జిల్లాలోని మనా గ్రామం వద్ద భారీ హిమపాతం కురవడంతో అక్కడ పనులుచేస్తున్న కార్మికుల్లో 55 మంది వాటికింద చిక్కుకుపోయారు. వారిలో 47మందిని రక్షించగా ఎనిమిది మంది మంచుచరియలకింద చిక్కుకుని మరణించారని అధికారులు కూడా చెప్పారు. ఏటా శీతాకాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడుతుంటాయి. ఈ చరియలు



ఐదు సెకన్ల కాలంలోనే గంటకు 80 మైళ్ల వేగంతో కిందకు జారుకుంటాయి. ఇలాంటి ఘటనల్లో 2.3 లక్షల ఘనపు మీటర్లవరకూ మంచు విడుదలవుతూ ఉంటుంది. అంటే 20 ఫుట్‌బాల్‌మైదానాలను 3 మీటర్ల మందం వరకూ కప్పిన హిమంతో సమానం. దీనిలే మంచుచరియలు అని పిలుస్తాం.

# అమెరికాకు విద్యుత్ కట్‌చేస్తాం..




## ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్

**టొరంటో, మార్చి 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటినుంచి మిత్రులు, శత్రువులు అని చూడకుండా అన్నిదేశాలపైనా సుంకాలమోత మోగిస్తున్నారు. పొరుగుదేశం కెనడాపైనా 25శాతం ట్యారిఫ్‌లు విధించారు. దీనితో ఆదేశంనుంచి మంచి స్పందన వచ్చింది. యుఎస్‌పై ఒంటారియో ప్రీమియర్ డగ్‌ఫోర్డ్ తీవ్ర హెచ్చరికలుచేసారు. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్‌తో ఉన్న 100 మిలియన్ డాలర్ల డీల్‌ను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. కెనడాపై ట్రంప్ విధించిన 25 శాతం సుంకాలు మంగళవారంనుంచి అమలులోకి వచ్చాయి. కెనడా ఇంధన ఎగుమతులపై 10శాతం సుంకంఉంది. కెనడానేతలు ఈ సుంకాలపై ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు. వారు ఒంటారియోను ధ్వంసంచేస్తుంటే చూస్తూ ఊరుకోను. చిరునవ్వుతోనే చేయాల్సిందంతా చేస్తాను. కరెంట్‌కోతలు విధిస్తాను. ఒంటారియోతో స్టార్ లింక్‌కుఉన్న 100 మిలియన్‌డాలర్ల ఒప్పందాన్ని రద్దుచేస్తున్నాను. అది పూర్తయింది. ఆయన కెనడా ప్రజలను తక్కువ అంచనావేస్తున్నారు. మా స్టోర్లనుంచి యుఎస్ ఆల్కహాల్‌ను తొలగించాలని చూస్తున్నామని అన్నారు. అమెరికాకు అత్యధిక ఇంధన ఎగుమతులు కెనడానుంచే ఉన్నాయి. కెనడాకుచెందిన ముడిచమురు, పెట్రోలియం ఉత్పత్తులు, హైడ్రోపవర్, సహజ వాయువు, విద్యుత్‌పై యుఎస్ ఆధారపడింది. వారు మాఇంధనంపై ఆధారపడ్డారు.వాళ్లు కూడా ఈనొప్పిని భరించాలని ఫోర్డ్ వ్యాఖ్యలు చేసారు. చిరకాల మిత్రదేశంపై ట్రంప్ అసలు సుంకాలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. సన్నిహిత మిత్రులు పొరుగువారిపై ఎందుకు దాడి చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదన్నారు.

## ట్రంప్ ప్రసంగానికి అడ్డుతగిలిన డెమొక్రాట్ సభ్యుడు!

**వాషింగ్టన్, మార్చి 5:** అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో డొనాల్డ్‌ట్రంప్ తొలిసారి ప్రసంగించారు. ఈనేపథ్యంలో అక్కడ ఒక కీలక పరిణామం కనిపించింది ట్రంప్ ప్రసంగిస్తుండగా డెమొక్రటిక్ సభ్యుడు అంతరాయం కలిగించారు. దీనితో కొంతసేపు సభలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. టెక్సాస్‌క చెందిన కాంగ్రెస్‌సభ్యుడు ఆల్‌గ్రీన్‌ట్రంప్‌నకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

మీకు ఆదేశించే హక్కులేదు. వైద్య సాయాన్ని తగ్గించమని ఆదేశాలివ్వలేరు అంటూ ఆయన చేతిలోని స్టిక్‌చూపిస్తూ పెద్ద పెట్టున నిరసన తెలిపారు. ఆ వెంటనే కాంగ్రెస్ రిపబ్లికన్ సభ్యులు అమెరికా, అమెరికా అంటూ నినాదాలు చేసారు. దీనితో సభలో ఉద్రిక్తవాతావరణం చోటుచేసుకుంది. ఈక్రమంలో హౌస్ స్పీకర్ మైక్‌జాన్సన్ స్పందించారు. గ్రీన్‌ను ఛాంబర్ నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు. ట్రంప్ ప్రసంగిస్తుండగా డెమొక్రాట్‌సభ్యులు ఆయనకు వ్యతిరేకంగా ప్లకార్డులుప్రదర్శించారు.

## అసెంబ్లీలో గుట్కా పాన్ నమలడంపై నిషేధం
### ఉల్లంఘిస్తే రూ.1000 జరిమానా
### యుపి స్పీకర్ ఆదేశాలు



**లక్నో, మార్చి 5:** యూపి అసెంబ్లీ సమావేశాల్లోనే ఒక ఎమ్మెల్యే గుట్కా తిని కార్పెట్‌పై ఉమ్మివేయడంపై స్పీకర్ సతీష్ మహానా ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఇకపై అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా తినడంపై నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మంగళవారం బడ్జెట్ సమావేశం జరగడానికి ముందు అసెంబ్లీలోకి వస్తున్న సమయంలో కార్పెట్‌పై గుట్కా గుర్తులను స్పీకర్ గమనించారు. ఈ నిర్వాకంచేసిన ఎమ్మెల్యే ఎవరో కూడా తనకు తెలుసునని విడియోలో అంతా చూసానని కానీ ఎవరినీ కించపరచాలని అనుకోవడంలేదని అంటూ ఇకపై ఎవరైనా ఇలాంటిపని చేస్తున్నట్లయితే మిగిలిన సభ్యులు అడ్డుకోవాలని ఆయన కోరారు. ఆతర్వాత దగ్గరుండి కార్పెట్‌ను శుభ్రంచేయించారు. ఒక వ్యక్తిచేసిన పనికి మిగిలిన వారి గౌరవం ఎందుకు దెబ్బతినాలంటూస్పీకర్ ప్రశ్నించారు. అసెంబ్లీ ప్రజలకు చెందినదని, ఇదేమీ వ్యక్తిగత ఆస్తికాదంటూ మండిపడ్డారు అయితే మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా పాన్‌మసాలా వినియోగించడంపై ఆయన నిషేధం విదించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.1000 జరిమానా విధిస్తామని కూడా హెచ్చరించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితంతో జగన్‌కు భయం పట్టుకుంది: మంత్రి లోకేష్

**విజయవాడ మార్చి 05 ప్రభాతవార్త ప్రతినిధి:** అహంకారానికి ప్యాంటు షర్టు వేస్తే జగన్ లాగే ఉంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అధికారంలో ఉన్నా, కోల్పోయినా జగన్ ప్రజలకు దూరంగానే ఉన్నారని మండిపడ్డారు. పరదాల ప్రభుత్వం పోయాక రాష్ట్రంలో పరదాల అమ్మకాలు తగ్గాయని వ్యాఖ్యానించారు. వైకాంగ్రెస్‌పార్టీ ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదని నిర్ణయించారు. ఆ విషయం జగన్‌కు ఎందుకు అర్థం కావట్లేదు? ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదాగురించి సీఎంను కింపచరిచేలా మాట్లాడుతారా? ప్రతిపక్ష హోదా రావాలంటే 10శాతం సభ్యులుండాలి. 11 సీట్లు ఎందుకు వచ్చాయో ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిది. తల్లి, చెల్లి కూడా నమ్మట్లేదని ఇంకా గ్రహించట్లేదు. పవన్ కల్యాణ్‌కు వచ్చిన మెజారిటీ ఎంత? జగన్‌కు వచ్చింది ఎంత? సీఎం డిప్యూటీ సీఎంపై జగన్‌వి దిగజారుడు మాటలు, గతంలో లేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ



జరుగుతుందని ఎన్నికల ముందు చెప్పారు. ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకున్నాం. గత ప్రభుత్వం విధ్వంసం వల్ల ఆదాయం పడిపోయింది. గాడి తప్పిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో పెడుతున్నాం అని లోకేశ్ వివరించారు. జగన్‌కు చట్టాలు ఉల్లంఘించడం అలవాటు కాబట్టి మేము కూడా చట్టాన్ని ఉల్లంఘించి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అంటున్నారు. ఎమ్మెల్యేగా గెలవకుండా సభకు వస్తా అన్నట్టుగా వితండ వాదం ఉంది. ఎమ్మెల్యే ఎన్నికల్లో కూటమి మెజారిటీకి భయపడి హడావుడి బెంగళూరు నుంచి వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి మళ్లీ బెంగళూరురు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. జగన్ 40 లక్షల ఉద్యోగాలు ఎవరికి కల్పించారు. ఎక్కడ ఇచ్చారో సమాధానం చెప్పాలి 40 లక్షల ఉద్యోగాల కల్పన జరిగి ఉంటే ఇక నిరుద్యోగ సమస్య ఎక్కడుంది. జగన్ చేసిన విధ్వంసం వల్ల పడిపోయిన రాష్ట్ర ఆదాయన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. సజ్జల స్క్రిప్ట్ పంపిస్తుంటే మండలిలో అది చదవటం తప్ప బొత్స చేతుల్లో ఏముంది. మూడు రాజధానులపై జగన్ స్టాండ్ ఏంటో బొత్స ఏం చెప్పగలరు అని ఆక్షేపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితంతో జగన్ కు భయం పట్టుకుంది. హడావుడిగా బెంగళూరు నుంచి హెలికాప్టర్ లో వచ్చారు. జగన్ రెండు రోజుల్లో మళ్లీ బెంగళూరు వెళ్లిపోతారు. డిప్యూటీ సీఎం పవన్ ను కింపచరిచేలా జగన్ మాట్లాడారు. పవన్ కల్యాణ్ జోలికి వస్తే ఊరుకునేది లేదని పవన్ హెచ్చరించారు. గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి. సొంత కార్యకర్తలను కూడా జగన్ కలవడం లేదు. వైసీపీ హయాంలో ఉద్యోగ కల్పన జరగలేదు. చట్టాన్ని ఉల్లంఘించడం జగన్ కు అలవాటే.. అందుకే ఆయనపై అన్ని కేసులు ఉన్నాయి. బెంగళూరులో కూర్చుని ఇక్కడి ఎన్నికల గురించి మాట్లాడతారు" అంటూ జగన్ పై నారా లోకేశ్ ధ్వజమెత్తారు.



ఐటీబీ బెర్లిన్ 2025 సదస్సులో కందుల దుర్గేష్

# ప్రపంచపర్యాటకులు చూడాల్సిన సుందర ప్రదేశం ఎపి

## - రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:**చారిత్రక వారసత్వ సంపద, సుందరమైన తీర ప్రాంత సమ్మేళనంతో కూడిన ఏపీ పర్యాటకులకు అనుకూలమని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు యూరోపియన్,ప్రపంచ పర్యాటకులు చూడాల్సిన ప్రాంతమన్నారుజ. జర్మనీలో రెండవ రోజున దుర్గేష్ పర్యటన కొనసాగుతుంది. ఈ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యటపలువురు పెట్టుబడిదారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వారికి ఏపీ పర్యాటకాభివృద్ధి అవకాశాలు, వనరులు వివరించారు. ఏపీ పర్యాటక రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపై మంత్రి దుర్గేష్ఐటీబీ బెర్లిన్ 2025 సదస్సుకు హాజరుకావడం సంతోషంగా ఉందన్న మంత్రి దుర్గేష్వరల్డ్ మీడియా ప్రతినిధులకు వివరించారు. అంత ర్జాతీయ పర్యాటక పెట్టు బడులకు గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దేందుకు బెర్లిన్ సదస్సు ఉం కరిస్తుందని భావిస్తున్నామన్న మంత్రి దుర్గేష్దక్షిణ భారతదేశ పర్యాటకానికి ఏపీ ముఖద్వారమని పేర్కొన్న మంత్రి దుర్గేష్ఏపీలో దాదాపు 1000 కి.మీల సుదీర్ఘ విశాల సముద్రతీరం,అందమైన బీచ్ లు, ఎత్తైన హిల్ ప్రదేశాలు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్న మంత్రి దుర్గేష్సాహస పర్యాటకం, మంత్రి దుర్గేష్ఏపీలో ప్రపంచ ప్రఖ్యాత తిరుమల వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఉందని, అత్యధిక పర్యాటకులు సందర్శించిన ప్రదేశంగా నిలిచిందని తెలిపిన మంత్రి దుర్గేష్ఏపీలో అమరావతి, నాగార్జున కొండ లాంటి బుద్ధిజానికి ప్రతీకగా నిలిచిన అనేక ప్రదేశాలున్నాయని పేర్కొన్న మంత్రి దుర్గేష్ప్రపంచ పర్యాటకుల గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు కృషి చేస్తున్నారని తెలిపిన మంత్రి దుర్గేష్అంతర్జాతీయ మౌలిక వసతుల కల్పన, సుస్థిర వృద్ధిరేటు, యువతకు ఉపాధి కల్పన, స్థానిక జన సమూహాల భాగస్వామ్యంతో పర్యాటకం అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడులపై దృష్టి సారించామన్న మంత్రి దుర్గేష్ఏపీలో రుషికొండ, రామకృష్ణ, మైపాడు, సూర్యలంక తదితర అందమైన బీచ్ లున్నాయని వివరించిన మంత్రి దుర్గేష్లగ్జరీ రిసార్ట్స్, వెల్ నెస్ కేంద్రాలు, సాహస, ఎకో పర్యాటక అభివృద్ధికి ఏపీలో అద్భుతమైన వనరులున్నాయన్న మంత్రి దుర్గేష్గ్రామీణ పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించామని తెలిపారు. గిరిజనుల జీవన విధానానికి కళ్లకు కట్టినట్లు చూపించే అరకు వ్యాలీ ప్రధాన పర్యాటక కేంద్రంగా ఉందని తెలిపారు. ఐటీబీ బెర్లిన్ 2025 సదస్సుకు ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. స్థిరమైన, సాంకేతికత ఆధారిత పర్యాటక అభివృద్ధికి అపారమైన సామర్థంతో అభివృద్ధి చెందుతున్న పర్యాటక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను హైలైట్ చేశారు. అంతర్జాతీయ పర్యాటకులకు కీలకమైన ఆకర్షణలుగా ఉన్న1000 కి.మీల సుదీర్ఘ విశాల సముద్రతీరం, అందమైన బీచ్ లు, ఎత్తైన హిల్ ప్రదేశాలు, విభిన్న ప్రకృతి రమణీయ ప్రాంతాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయి.

# జగన్ కోడి కత్తికి ఎక్కువ, గొడ్డలికి తక్కువ

## - మంత్రి నాదెండ్ల మనోహార్




గన్‌పై విమర్శలు గుప్పిస్తున్నజనసేన నేత,మంత్రి నాదెండ్ల మనోహార్,ఆ పార్టీ ఎంఎల్ఎలు

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మతిస్థిమితం కోల్పోయి ప్రజాస్వామ్య విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ స్పష్టం చేశారు. వై నాట్ 175 కాస్త 11కి పడిపోయి ఆ అక్కసుతో మతిస్థిమితం కోల్పోయారన్నారు. "ఓటమిని జీర్ణించుకోలేని స్థితిలో నోరుంది కదా అని ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. మేమూ అనగలమన్నారు. జగన్ కోడి కత్తికి ఎక్కువ, గొడ్డలికి తక్కువ అని. ప్రజా జీవితంలో ఉండి ఒక్క రూపాయి కూడా సాటివారికి ఖర్చు చేయని జగన్ కు పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత లేదు. అధికారంలో ఉండగా వర్క్ ఫ్రం హోం ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్న జగన్ ఇప్పుడు వర్క్ ఫ్రం బెంగళూరు శాసన సభ్యుడయ్యారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల కోసమైనా శాసన సభకు వచ్చి మాట్లాడాలి కదా? అని నిలదీశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు నూటికి నూరు శాతం అమలు చేస్తుందని.. మీలా బటన్లు నొక్కామని మోసం చేయదని అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద జనసేన పార్టీ శాసన సభ్యులతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహార్ మాట్లాడుతూ... "జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హోదా కావాలి అని డిమాండ్ చేయడం ఎంత హాస్యాస్పదమో గౌరవ సభాపతి గారు ప్రజలందరికీ అర్థం అయ్యే విధంగా తెలియపర్చారు. అయితే జగన్ నోరుంది కదా అని కనీసం ఇంగితం లేకుండా మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్ పై జగన్ చేసిన వ్యాఖ్యలు అందర్నీ బాధించాయి. పవన్ కళ్యాణ్ ప్రజలు ఏం తీర్పు ఇచ్చారో అదే విషయాన్ని చెప్పారు. మీకు ప్రతిపక్ష హోదా రాదు. అది డిమాండ్ చేసే స్థాయిలో లేరు. మన స్థానం ఏంటో అంతిమంగా నిర్ణయించేది ప్రజలే. ప్రతిపక్ష హోదాను మీరు డిమాండ్ చేయలేరు. ఐదేళ్ల దాని గురించి మర్చిపోండి. శాసన సభకు వచ్చి చర్చల్లో పాల్గొని మీకు ఓట్లు వేసిన ప్రజల సమస్యల మీద మాట్లాడమని పవన్ కళ్యాణ్ సూచించారు. వైసీపీకి వచ్చిన 39 శాతం ఓట్ షేర్ వచ్చిందన్న ప్రస్తావన వచ్చినప్పుడు ఆ సంస్కృతి దేశంలో లేదు. జర్మనీ లాంటి దేశంలో అవకాశం ఉంటుంది కాబట్టి అది కోరుకుంటే జర్మనీకి వెళ్లి పోటీ చేయమని తెలియచెప్పారు. వైసీపీ ఒక తాడూ బొంగరం లేని పార్టీ. ఒక సభ ఏర్పాటు చేసి తనకు తానుగా ఆ పార్టీకి జీవిత కాల అధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. కేంద్ర ఎన్నికల సంఘం దాన్ని ఖండించింది. చురకలు కూడా వేసింది. జగన్ కనీసం ఇంగిత జ్ఞానం లేని వ్యక్తి. రూల్స్ పాటించని వ్యక్తి. తన పార్టీకి అధ్యక్షుడు ఎవరో తేల్చుకోలేని పరిస్థితుల్లో జగన్ పవన్ కళ్యాణ్ పై చేస్తున్న వ్యాఖ్యలు విచిత్రంగా అనిపిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా ప్రభుత్వంలో ఒకలా ప్రవర్తించే వ్యక్తి కాదు. జగన్ రెడ్డి పాలనలో కౌలు రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతుంటే వారి కుటుంబాలను ఆదుకునేందుకు స్వయంగా రూ. 5 కోట్ల విరాళం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతు భరోసా సభలు నిర్వహించి ఒక్కో కుటుంబానికి రూ. లక్ష చొప్పున సాయం అందించారు. చివరికి నీ సొంత నియోజకవర్గం పులివెందుల ప్రాంతానికి చెందిన 24మంది రైతులకు కూడా పవన్ కళ్యాణ్ ే అండగా నిలిచారు.

# విఆర్ఒకు సచివాలయ బాధ్యతలు మాత్రమే కేటాయించాలి

**విజయవాడ, మార్చి 5, ప్రభాతవార్త :** ఒక విఆర్ఒకు ఒక సచివాలయ బాధ్యతలు మాత్రమే అప్పగించాలని, ప్రస్తుతం వున్న ఒక పంచాయితీ సెక్రటరీ, ఒక డిజిటల్ అసిస్టెంట్, ఒక వెల్ఫేర్ అసిస్టెంట్, ఒక మహిళా పోలీస్‌ను అలాగే వుంచాలని ఏపి విఆర్ఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు కూటమి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. గత ప్రభుత్వం సచివాలయాలలోనే విఆర్ఓలు వుండాలని నిర్ణయం తీసుకుని అమలు చేశారని, ఇప్పటి కూటమి ప్రభుత్వం గ్రామవార్డు సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో రెండు/మూడు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా విభజించడం వల్ల తమపై పనిభారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెవెన్యూ, ఇతర శాఖల విధులు నిర్వహిస్తు ఇబ్బంది పడుతుంటే రెండు/మూడు సచివాలయాలు విఆర్‌వోలకు అప్పగిస్తే రెవెన్యూ వ్యవస్థ మూలన పడే పరిస్థితి వస్తుందన్నారు. టైంతో సంబంధం లేకుండా పనిచేసే తమపై పనిఒత్తిడి పెంచవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రిని, రెవెన్యూమంత్రిని, గ్రామవార్డు సచివాలయ మంత్రిని కోరారు. రేషనలైజ్ చేసే ముందు మిగిలిపోయిన 7500 మంది విఆర్ఓలకు రెవెన్యూ శాఖకు సంబంధిత శాఖల్లో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లతో భర్తి చేయాలని వినతించారు.

# గోదావరి, కృష్ణ,పెన్నా డెల్టాల ఆధునీకరణతోనే ముంపునకు పరిష్కారం:మంత్రి నిమ్మల రామానాయుడు



**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏనాడో బ్రిటిష్ కాలంలో ఏర్పాటైన రాష్ట్రంలోని డెల్టాల ఆధునీకరణ ద్వారానే రాష్ట్రంలోని జల వనరులను సద్వినియోగం చేసుకోగలమని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.ఇలా చేయడం వలన ముంపు సమస్యలను పరిష్కరించుకోగలమని చెప్పారు. కాలువల్లో కలుపు, ఆక్రమణలు, శివారు భూములకు నీరు అందకపోవడం, పైనున్న భూములు ముంపుకు గురవటం వంటి సమస్యలను బుధవారం నాటి అసెంబ్లీ సమావేశంలో పలువురు సభ్యులు ప్రస్తావించిన ప్రశ్నలకు మంత్రి రామానాయుడు సుస్పష్టమైన సమాధానం ఇచ్చారు. కృష్ణ, గోదావరి బేసిన్లలోని మురుగు కాలువలు, పంట కాలువలు ఇంచుమించు అన్ని కూడా కొల్లేరు లోకే వస్తున్నాయి. ఈ నీరంతా కూడా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి కలవాల్సి ఉంది. అయితే కాలువలు ఆక్రమణలతో కుంచించుకుపోవడం, కలుపు మొక్కలతో నిండిపోవడం వంటి కారణాలు మూలంగా ప్రవాహం ముందుకు సాగటం లేదు. అందువల్ల కృష్ణ గోదావరి, కొల్లేరు బేసిన్ల లోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని డెల్టాల పరిధిలో కాలువలు, డ్రైన్లు డ్రెడ్జింగ్ చేయాల్సిన అవసరం ఉంది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సలహా ఇచ్చినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయమని కూడా ఆయన తమకు సూచించారు. కాలువల్లో కలుపు తొలగింపు, లాకులు, షట్టర్లు డోర్లు మరమ్మత్తు పనులు, గ్రీజు పెట్టడం వంటి పనుల నిర్వహణకు సంబంధించి ప్రతి ఏటా మార్చిలో ప్రతిపాదనలు తయారు చేయడం,ఏప్రిల్ లో టెండర్లు పిలవడం, మే నెలలో పనులు చేయటం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. దీనిని గత జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఓ అండ్ ఎం పనులు అంటే ఏంటో వాళ్ళకి అర్థం కాని దుస్థితి లోకి వెళ్ళిపోయారు. అలాగే నీటిపారుదల వ్యవస్థ నిర్వహణలో లష్కర్ల పాత్ర చాలా కీలకం. ఒకప్పుడు ఎనిమిది వేల మంది ఉండే లష్కర్లు నేడు 600 మంది కి చేరిపోయారంటే జగన్ అరాచక పాలనకు అద్దం పడుతుంది. నేడు లాకులు షట్టర్లు ఎత్తాలన్నా దింపాలన్నా, లాకుల్లో గ్రీజ్ పెట్టాలన్నా ఆ పనులు ఏఇలు చేయాల్సి వస్తుంది. ప్రతి కిలోమీటర్ కాలువకు ఒక లస్కర్ ఉండాలనే పాత సాంప్రదాయ పద్ధతిని కొనసాగిస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. సాగునీటి సంఘాలతో సత్ఫలితాలు వస్తూనట్లు మంత్రి నిమ్మల రామానాయుడు సభకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సంఘాలకు సంబంధించి 60 వేల మంది ఆయకట్టు రైతులకు ప్రాతినిధ్యం కల్పించామన్నారు. వీరంతా ఎక్కడికక్కడ చాలా చురుగ్గా పనిచేస్తూ కాల్వల సమర్థ నిర్వహణకు సాయపడుతున్నారని మంత్రి చెప్పారు. కొన్ని నియోజకవర్గాలలో నీటి సంఘాల చైర్మన్లు, సభ్యులు వాళ్ళ సొంత నిధులతో అత్యవసర పనులు చేసుకోవడం ఎంతో ముదావహ మన్నారు. సాగునీటి సంఘాల గొప్ప వ్యవస్థను జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో నీరు కార్చింది అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు యుద్ధ ప్రాతిపదికన సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి నీటిపారుదల రంగంలో రైతులకు భాగస్వామ్యం కల్పించామని మంత్రి స్పష్టం చేశారు. ఓ అండ్ ఎం పనులు కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల అనేక అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



# స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమావేశం

## - 18 నుంచి 20 వరకు ఎమ్మెల్యేలకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి** శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడుతో ఆయన చాంబర్‌లో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎండి గిరీషాలు గార్లు గౌరవ స్పీకర్ సమావేశమయ్యారు. ఈ 18 నుంచి 20 వరకు ఎమ్మెల్యేలకు ప్రత్యేక క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ స్పీకరు అయ్యన్న పాత్రుడు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎండి గిరీషాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్పీకరు మాట్లాడుతూ శాసనసభ్యుల కోసం క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో పాత సంప్రదాయాన్ని పునరుద్ధరించనున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ పోటీలు రాజకీయ ఒత్తిడిని తగ్గించడంతో పాటు సభ్యుల్లో స్నేహభావాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడతాయన్నారు. పురుష ఎమ్మెల్యేల కోసం క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు, మహిళా ఎమ్మెల్యేల కోసం బ్యాడ్మింటన్, త్రో బాల్, టెన్నీ కాయిట్, టగ్ ఆఫ్ వార్, వంద మీటర్ల పరుగు పందెం వంటి క్రీడలను ప్రవేశపెట్టనున్నారు. అలాగే, పాటలు, నాటకాలు, స్కిట్లు, నృత్యం, సోలో అభినయం వంటి సాంస్కృతిక కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. మార్చి 20న సీఎం చంద్రబాబు గారి చేతుల మీదుగా బహుమతుల ప్రదానంఈ పోటీలు ఉత్సాహభరితంగా సాగాలని, ప్రతి ఒక్క ఎమ్మెల్యే ప్రోత్సాహంగా పాల్గొనాలని గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గారు కోరారు. ఈ కార్యక్రమాల ముగింపు సందర్భంగా మార్చి 20న రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు గారి ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో, విప్ గణబాబు గారు, శాసనసభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజు గారు, ఆదిరెడ్డి శ్రీనివాస్ గారు పాల్గొన్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు గాజువాక నుంచి ట్రాఫిక్ రద్దీ తగ్గింపు: మంత్రి నారాయణ



**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో భారీ నగరాలు ఉన్న విజయవాడ,విశాఖలో ట్రాపిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం కీలక కార్యచరణ చేపట్టిందని ఏపీ పురపాలక,పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.ఈ ప్రాజెక్టుల నిర్మాణ ప్రతిపాదన,స్థలసేకరణ,అంచనా,ఇతరంశాలుపై ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకున్నారు.కొత్త రోడ్ల నిర్మాణంపై అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు,జీరో అవర్‌లో శాసనసభ్యుల సమాధానం ఇచ్చిన మంత్రి నారాయణ.నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ విశాఖలో భోగాపురం ఎయిర్ పోర్ట్ కు వెళ్లేందుకు ట్రాఫిక్ రద్దీ తగ్గింపునకు మెట్రో తో పాటు కొత్త రోడ్ల ప్రతిపాదనలున్నాయి.ట్రాఫిక్ నివారణకు విశాఖ మెట్రో ప్రతిపాదన ఉంది.గాజువాక నుంచి భోగాపురం వరకూ మద్దిలపాలెం,మధురవాడ మీదుగా 34.6 కిలోమీటర్ల మెట్రో నిర్మాణం.మెట్రో ప్రతిపాదనలు కేంద్రానికి పంపించాం...కేంద్రం నుంచి ఖచ్చితంగా ఆమోదం పొందేలా చూస్తాం.ఆమోదం రాగానే పనులు ప్రారంభిస్తాం.విశాఖలో మెట్రో రైలు వస్తే ట్రాఫిక్ కొంతమేర తగ్గుతుంది.కానీ మెట్రో ప్రాజెక్ట్ పూర్తికి నాలుగేళ్ల పడుతుంది.ఏహెచ్ 45 రోడ్డుపై ట్రాఫిక్ తగ్గించడానికి 15 అంతర్గత రోడ్లు ఏడాదిన్నరలోగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాను.పాత హైవే ఏహెచ్ 47 నుంచి ఎన్ హెచ్ 16 కు ఆరు రోడ్ల ప్రతిపాదన ఉంది.విశాఖలోని ఎమ్మెల్యేలు,అధికారులతో మీటింగ్ పెట్టాలని మంత్రిని స్పీకర్ కోరారు. ఆయన సూచించినట వారమే మీటింగ్ పెడతానని మంత్రి నారాయణ సభలో చెప్పారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కంటే ఎక్కువ భద్రత జగన్‌కు కల్పిస్తున్నాం:మంత్రి లోకేష్

**విజయవాడ,మార్చి5,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్ ప్రతిపక్ష బాధ్యతను నిర్వహించకుండా ఆ హోదా కోరుకోవడం శోచనీయమని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కంటే ఎక్కువ భద్రత జగన్‌కు కల్పిస్తున్నాం. తగిన సభ్యులు లేకుండా ప్రతిపక్ష హోదా కోరుకుంటూ దుష్ప్రచారం చేసే సంప్రదాయం కొనసాగకూడదు. వ్యక్తిగత విభేదాలు లేకుండా నిబంధనల ప్రకారమే అన్నీ చేస్తున్నాం. హోదా రాదని చట్టం చెబుతుంటే ఉల్లంఘించమంటారా?. అంటూ ప్రశ్నించారు. శాసన సభలో గవర్నర్‌ను అవమానించడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో శాసనసభలన్నీ పార్లమెంట్ సంప్రదాయాలనే అనుసరిస్తాయని చెప్పారు. సెక్షన్ 121 సీ ప్రకారం ఏదైనా సభలో సభ్యుల సంఖ్యలో పదో వంతు ప్రతిపక్షానికి ఉండాలని లోక్‌సభలో రూలింగ్ ఉందని లోకేశ్ గుర్తుచేశారు. టీడీపీకి ఉన్న 23 మంది శాసనసభ్యుల్లో ఐదుగురిని లాగేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదంటూ గతంలో ముఖ్యమంత్రిగా జగన్ చేసిన వ్యాఖ్యలను లోకేశ్ ప్రస్తావించారు. ఇవన్నీ తెలిసిన ఆయన ఇప్పుడెందుకు వివాదం చేస్తున్నారని ప్రశ్నించారు. మరోవైపు ఇప్పుడు స్పీకర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ సభ గౌరవాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాతీర్పును గౌరవించి వారి కోసం పోరాడాల్సిన బాధ్యత పార్టీలదేనని పేర్కొన్నారు. అసెంబ్లీలో జగన్ మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదాపై స్పీకర్ ప్రకటన అనంతరం చర్చ జరిగింది. జగన్ ను సభ్యులు స్వాగతించారు. ఈ అంశాన్ని సభా సంఘానికి నివేదించాలని మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహార్, సీనియర్ సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కోరారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచి తమను ఎన్నుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహార్ తెలిపారు. ప్రజలందరికీ మేలు చేయాలన్న అంకితభావంతో అసెంబ్లీకి వచ్చామని చెప్పారు. సభ ద్వారా ఎంతో హుందాగా వ్యవహరించాలన్నారు. లేని అధికారం కోరుకుంటున్న జగన్‌ను ఏమనాలని ప్రశ్నించారు. ప్రతిపక్ష హోదాపై వైఎస్సార్సీపీ నాయకులు కావాలనే బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని మనోహార్ విమర్శించారు. జగన్ తనకు లేని అధికారాన్ని కోరుకుంటున్నారు. ప్రజలు గౌరవం ఇవ్వకుండా ఛీ కొట్టినప్పుడు హోదా ఇవ్వాలని ఎలా కోరుకుంటారు?. ఈ వ్యవహారంపై ప్రచార మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంపై సభా హక్కుల సంఘానికి నివేదించాలని జనసేన తరఫున కోరుతున్నాం. దుష్ప్రచారంపై స్పీకర్ చక్కని రూలింగ్ ఇచ్చారని వివరించారు. ఆయన అనాలోచిత వ్యాఖ్యలు, మూర్ఖమైన నిర్ణయాలను ఇతరులకు ఆపాదించటం సరికాదుఖీ అని నాదెండ్ల వ్యాఖ్యానించారు. సీనియర్ సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ శాసన వ్యవస్థ గురించి అవగాహనలేకుండా జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. ఈ వ్యవహారంపై సభాపతి రూలింగ్‌ను ఇవ్వడాన్ని వారు ప్రశంసించారు.

# ప్రేమించిన నేరానికి ప్రాణం తీశాడు! కన్న కూతురని చూడకుండ కడతేర్చాడు

**గుంతకల్లు, మార్చి 5 ప్రభాతవార్త** ూతురి ప్రేమను సహించలేని ఓ తండ్రి కసాయిగా మారాడు. ప్రేమించిన నేరానికి ప్రాణం తీశాడు. పేగు బంధాన్ని సైతం మరిచి కన్న కూతురని చూడకుండ కడచేర్చాడు. మృతదేహాన్ని పట్టణ శివారు ప్రాంతానికి తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ అమానవీయ ఘటన బుధవారం గుంతకల్లులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు.. పట్టణంలోని తిలక్ నగర్ కు చెందిన రామాంజనేయులు, పుణ్యవతి దంపతులకు నలుగురు కూతుళ్లు. ముగ్గురికి పెళ్లిళ్లు కాగా, ఆఖరి అమ్మాయి భారతి కర్నూలు లో డిగ్రీ రెండో ఏడాది చదువుతోంది. పట్టణానికి చెందిన ఓ యువకుడిని గత కొన్నేళ్లు గా ప్రేమిస్తోంది. ఈ విషయం ఇరువురి కుటుంబాలకు ఇష్టం లేక ఎవరి పిల్లలను వారి హద్దుల్లో ఉంచుకోవాలని నిబంధనలు పెట్టుకున్నారు. అయితే ప్రేమికులు మాత్రం ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోయారు. దీన్ని సహించలేని తండ్రి మార్చి 1న కూతురిని చంపేశాడు. ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని పట్టణ శివారులోని తిక్కస్వామి దర్గా ప్రాంతానికి తీసికెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించాడు.

# రాష్ట్రంలో అంతర్యుద్ధం రాబోతోంది:

## మాజీ ఎంపి గోరంట్ల మాధవ్

**అనంతపురం, మార్చి 5, (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్రంలో వైసిపి వారిని కూటమి ప్రభుత్వం వేధిస్తోందని కూర్చుంటే కేసు లేస్తే కేసు పెడుతోందని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అరాచకాలను కొనసాగిస్తే అంతర్యుద్ధం రావడం ఖాయం అన్నారు. బుధవారం అనంతపురంలో విలేఖలతో ఆయన మాట్లాడారు.. పోక్సో కేసులో హాజరయ్యేందుకు విజయవాడకు తన అనుచరులతో బయలుదేరి పోతూ విలేకరులతో మాట్లాడారు. చట్టాన్ని గౌరవిస్తానని, చట్టం పరిధిలో కేసు విచారణకు తప్పక హాజరవుతారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వెల్లడించారు.. విజయవాడకు బయలుదేరి ముందుగా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటి వద్ద హంగామా చోటు చేసుకుంది. మాజీ ఎంపీ రంగయ్య, తాడపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తదితరులు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటి వద్దకు వెళ్లి వచ్చి కలిసి వెళ్ళారు..పలు వాహనాల్లో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విజయవాడకు బయలుదేరినప్పటికీ కర్నూలు జిల్లా రుద్రవరం , కర్నూల్ లో బుధవారం ఉండిపోయినట్లు తెలియ వచ్చింది.. గురువారం ఉదయం అక్కడి నుంచి విజయవాడకు బయల్దేరే అవకాశం కనిపిస్తోంది.. ఒక ఫోక్సో కేసులో అమ్మాయి పేరు బహిర్గతం చేరాదనే నిబంధన ఉన్నప్పటికీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ నిబంధన ఉల్లంఘించారని మహిళా నేత వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే.. ఆ కేసు విషయంలో ఇటీవల పోలీసులు గోరంట్ల మాధవి ఇంటి వద్దకు వచ్చి నోటీసులు అందజేశారు.

# ఎమ్మెల్యేకు సైబర్ నేరగాళ్ల బెదరింపులు

**నకిరేకల్, ప్రభాతవార్త మార్చి 5:** సైబర్ నేరగాళ్ల దాడులు రోజు రోజుకి దాడులు శృతిమించి పోతున్నాయి. సైబర్ నేరగాళ్లపై ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు అలెర్ట్ చేస్తూ ప్రమాదాలు అనేక మార్గాలలో ప్రచారం చేస్తున్నప్పటికీ ఏదో మార్గంలో సైబర్ నేరగాళ్లు తమ దాడులు మరింత ముమ్మరం చేస్తున్నారు కు సంబంధించిన వీడియో ఒకటి సాక్షాత్తు నల్గొండజిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వీరే శంకి న్యూడ్‌కాల్స్‌తో సైబర్ నేరగాళ్లు అటాక్ చేసిన సంఘటన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోషల్ మీడి యా అకౌంట్లో నుండి ఫోటోలను సేకరిస్తారు.

# గాయని కల్పనకు సాగుతున్న చికిత్స

## ఆత్మహత్య కాదన్న కుమార్తె

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), మార్చి5, ప్రభాతవార్త:** అపస్మారక స్థితిలో మంగళవారం రాత్రి కేపీహెచ్బీలోని హోలిస్టిక్ ఆసుపత్రిలో చేరిన గాయని కల్పనకు చికిత్స కొనసాగుతోంది. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఆమె ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. గాయని కల్పన నిద్ర మాత్రలు మింగారు. ఆమె ఊపిరి తిత్తుల్లో నీరు చేరడంతో వెంటిలేటర్పై చికిత్స అంది స్తున్నాం. కల్పనకు ఇన్ఫెక్షన్ ఉండటం వల్ల ఆక్సిజన్ అందిస్తున్నాం. ప్రస్తుతం గాయని ఆరోగ్యం నిలకడగా ఉంది అని వైద్యులు తెలిపారు.

**పరామర్శించిన గాయని,గాయకులు:** హాస్పిటల్ చికిత్స పొందున్న కల్పనను బుధవారం సునీత, గీతా మాధురి, శ్రీకృష్ణ, కారుణ్య పలువురు గాయని గాయకులు హాస్పి టల్‌కు వచ్చి పరామర్శించారు. కల్పన వైద్యం గురించి వారు డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

# కాళేశ్వరం కుంభాభిషేకం నిర్వహణ భేష్

## మంత్రి కొండా సురేఖను ప్రశంసించిన సోనియా గాంధీ



**హైదరాబాద్,మార్చి5,ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయంలో 42 యేళ్ల తర్వాత ప్రత్యేక చొరవ తీసుకుని మహా కుంభాభిషేకం నిర్వహించడంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ప్రశంసించారు. కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ మేరకు కొండా సురేఖకు సోనియా లేఖ రాశారు. త్రివేణి సంగమం జలాలకు ఎంతో ప్రత్యేకత ఉందని, తనకు ప్రసాదాన్ని, త్రివేణి సంగమం పవిత్ర జలాలను పంపించినందుకు కొండా సురేఖకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి స్థల విశిష్టతను,ప్రసన్న తెలియజేసినందుకు సురేఖను లేఖ ద్వారా సోనియా అభినందించారు. కాగా, 1982లో మొదటిసారి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ జరిగిన సమయంలో ఇక్కడ మహా కుంభాభిషేకం నిర్వహించారు.ఆ తర్వాత మళ్లీ 42 యేళ్ల తర్వాత గత నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మహాకుంభాభిషేక వేడుకలను నిర్వహించిన సంగతి తెలిసిందే.

# రేవంత్‌రెడ్డి బిజెపిలోకి వస్తానంటే ఆహ్వానిస్తాం

## కేంద్రం ఇస్తుంటే కిషన్‌రెడ్డి ఎక్కడ అడ్డుపడ్డారో స్పష్టం చేయాలి: ఎంపి ధర్మపురి అరవింద్



బుధవారం బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్, మార్చి 5 ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి బిజెపిలోకి వస్తామంటే ఆహ్వానిస్తామని బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ అన్నారు. బుధవారం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి బిజెపిలోకి వస్తే తీసుకుంటాం? లేదా అన్నది మాత్రం తన చేతిలో లేదని స్పష్టం చేశారు. అయితే కేంద్రం ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి అంటున్నారని, ఎక్కడ కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారో చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ గవర్నమెంట్‌లో అడ్మినిస్ట్రేటివ్ వాక్యూమ్ ఎక్కువగా ఉందన్నారు. దానికి ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలే కారణం అన్నారు. పసుపు బోర్డుపై విమర్శలు చేస్తున్న ఎమ్మెల్సీ కవితపై స్పందించమని తమ జిల్లా నేతలకు చెబుతానని అయితే అలాంటి చౌట్ దెబ్బ్ లీడర్ల గురించి మాట్లాడకపోవడం ఎందుకని అన్నారు. తెలంగాణకు ప్రధాని మోదీ ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు ఇచ్చారన్నారు. మీకు నేను స్కూల్ తెస్తుంటే ఇలా బురద జల్లుతారా అంటూ ప్రశ్నించారు. ట్రంప్ లాంటి వ్యక్తి పిఎంతో మంచిగున్నాడని, కుర్చీలో దగ్గర కూర్చోబెడుతున్నారని అన్నారు. రేవంత్ ఒక్క లెక్కనా, ఫ్యూచర్ సిటీకి లోపన్ అని పేరు పెడతామేమో అందుకే మోదీని మంచోడని పొగుడుతున్నట్లు కనిపిస్తున్నారు. అలా పెట్టుకుంటామంటే ఖచ్చితంగా అనుకోవమన్నారు. రాహుల్ గ్రహాంతరవాసి, సిఎం పదవి తొలగిస్తే రేవంత్ చూస్తూ ఊరుకుంటారా అంటూ ప్రశ్నించారు.

# జనాభా లెక్కన ఎంపి సీట్ల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం

## తమిళనాడు సిఎం స్టాలిన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి5:** జనాభా ప్రాతిపదికన లోక్ సభ స్థానాలను డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని, కేవలం ఉత్తరాది రాష్ట్రాలు లాభ పడతాయని కరీంనగర్ మాజీ ఎంపీ, బిఆర్ఎస్ సీనియర్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.ప్రస్తుతం అమలులో ఉన్న ఎంపీ స్థానాల విధానాన్నే కొనసాగించాలని వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను డీ లిమిటేషన్ చేస్తే జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే లాభం జరుగుతుందని వినోద్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా సంఖ్య తక్కువగా ఉందని వినోద్ కుమార్ తెలిపారు.1971 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుని లోక్‌సభ స్థానాలను నిర్ణయించారని, ఇక ముందు కూడా ఇదే పద్ధతిని కొనసాగించాలని, అవసరం అయితే అందుకు రాజ్యాంగాన్ని సవరించాలని వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఈరోజు అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తప్పు బట్టారని, ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తోందని వినోద్ కుమార్ అన్నారు.ఉదాహరణకు తీసుకుంటే 1971 జనాభా లెక్కల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జనాభా 8.8 కోట్లు కాగా, తాజా జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుంటే 24 కోట్లకు చేరుతుందని, దీంతో యూపిలో ఎంపీ స్థానాలు అమాంతం భారీగా పెరుగుతాయని వినోద్ కుమార్ వివరించారు.రానున్న రోజుల్లో తమ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో కార్యాచరణను రూపొందిస్తామని వినోద్ కుమార్ ప్రకటించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపడిన బిసి వాదం

## 2028నాటికి బిసికి సిఎం పదవే లక్ష్యంగా పనిచేస్తాం:నేతలు



**హైదరాబాద్ (స్టోథాబా), మార్చి 5 ప్రభాతవార్త:** గడిచిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి వాదం బల పడిందని తెలంగాణ మేధావుల ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు స్పష్టం చేశారు.ఇదే స్ఫూర్తితో 2028 నాటికి బిసి అభ్యర్థి సిఎం కావాలనే లక్ష్యంతో బిసిలంతా ఉన్నామని వారు తెలిపారు. బుధవారం సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలపై బిసి సంఘాల, మేధావుల మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. చిరంజీవులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి వాదం పనిచేసిందని ఓట్లు వేసినవారందరికి ధన్యవాదాలు తెలిపారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసి వాదం సజీవంగా ఉందని, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి వణుకు పుట్టించిందని, బిఆర్ఎస్ పార్టీ పోటీలోనే పాల్గొనక లేకపోయిందని విమర్శించారు. కృష్ణమోహనరావు మాట్లాడుతూ ఈ ఎమ్మెల్సీ ఎన్నికలతో బిసిల శకం ఆరంభమైందన్నారు. జనాభా ప్రాతిపదికన బిసిలకు ప్రభుత్వాలు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనేక బిసి సంఘాల నేతలు ప్రసంగించారు.

# చెరువులో పడి మహారాష్ట్ర వాసుల మృతి

## నిన్న ఒకరు, నేడు మరొకరి శవాలు లభ్యం

**న్యాల్‌కల్, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గంగ్వార్ గ్రామశివారులోని చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదావశాస్తూ ఇద్దరు చెరువులో మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ చల్లారాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం మహారాష్ట్రలోని లాతూర్ పట్టణానికి చెందిన రెహమతుల్లా కుటుంబ సభ్యులు గంగ్వార్ గ్రామ శివారులోని జహీరాబాద్-బీదర్ రోడ్డు పక్కన ఉన్న ముల్తానీ బాబాదర్గా వద్ద కొనసాగుతున్న జాతర ఉత్సవాలకు హాజరై అటుగా ఉన్న చెరువులో సరదాగా స్నానం చేసేందుకు దిగిన షేఖ్ ఫైజాన్ (17), సంజయ్ కామ్లే (50)లు ప్రమాదావశాస్తు చెరువులో మునిగిపోయారు. చెరువులో ఇద్దరు మునిగినట్లు గుర్తించిన కుటుంబ సభ్యుల అల్లర్లకు అటుగా ఉన్న వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారన్నారు. చెరువులో మునిగిపోయిన సంజయ్ కామ్లే మృతదేహం మంగళవారం గుర్తించగా బుధవారం మధ్యాహ్నం మరో మృతదేహాన్ని పోలీసులు గుర్తించి చెరువులో నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

# వివాహిత హత్య కేసులో వీడిన మిస్టరీ..

## శిరీష ఆడబిడ్డ సరితే హంతకురాలు

### పోలీసుల అదుపులో నిందితులు



పోలీసుల అదుపులో నిందితులు, వివరాలను వెల్లడిస్తున్న ఏసిపి శ్యాంసుందర్ చిత్రంలో ఇన్ స్పెక్టర్ రాజు,డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ భూపాల్ తదితరులు

**హైదరాబాద్ (మలక్‌పేట)తతతత, మార్చి 5, ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వివాహిత కేసులో చిక్కుముడి వీడింది. శిరీష ఆడబిడ్డ సరితనే హంతకురాలనే నిజాలు పోలీస్ విచారణలో బహిర్గతమయ్యాయి. శిరీషను హత్య చేసిన సరితను కాపాడేందుకు ఆమె సోదరుడైన శిరీషభర్త వినయ్ కుమార్, అక్క కొడుకు నిహాల్‌లు గుండెపోటు డ్రామా ఆడారు. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ లో మలక్ పేట ఏసిపి శ్యాంసుందర్, ఇన్ స్పెక్టర్ రాజు, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ భూపాల్ లు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మలక్ పేట ఏసిపి శ్యాంసుందర్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈనెల 1వ తేదీన న్యూ మలక్‌పేట జమున టవర్స్ ప్లాట్ 106 లో వివహిత శిరీష మృతి పై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ శిరీష మేనమామ మధుకర్ చాదర్ ఘాట్ పోలీసు లకు ఫిర్యాదు చేశారు. భర్త వినయ్ కుమార్ శిరీష మృతదేహాన్ని తన సొంత ఊరు శ్రీశైలం రోడ్డులోని దోమల పెంటకు తీసుకెళ్తుండగా చాదర్ ఘాట్ పోలీ సులు అంబులెన్స్ డ్రైవర్‌కు ఫోన్ చేసి మృతదే హాన్ని వెనుకకు తీసుకురావాలని ఆదేశించారు. వెంటనే మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకు రాగా మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు మెడ, ముఖం భాగంపై గాయాలు గుర్తించి ఉస్మానియా మార్చురికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోస్టుమార్టం చేసిన డాక్టర్లు ప్రాథమికంగానే శిరీషది సహజ మరణం కాదని గొంతు నులిమి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారని నిర్ధారించారు. దీంతో చాదర్ ఘాట్ పోలీసులు శిరీష భర్త వినయ్ కుమార్, శిరీష ఆడబిడ్డ సరితను, వారితో ఉన్న సరిత అక్క కొడుకు నిహాల్ నికూడా అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో శిరీష ఆడబిడ్డ సరిత తానే హత్య చేశానంటూ పోలీసుల వద్ద నేరం అంగీకరించింది. అయితే హత్యానంతరం శిరీష భర్త అయినా తమ్ముడు వినయ్ కుమార్, అక్క కొడుకు నిహాల్ కు రాత్రి హత్య చేసిన విషయాన్ని ఉదయం తెలియజేసింది. భర్త వినయ్ కుమార్, అక్క సరిత అక్క కొడుకు నిహాల్ తో కలిసి శిరీష కు గుండెపోటు వచ్చిందంటూ డ్రామా సృష్టించి శిరీష మేనమామ మధుకర్ కు శిరీష అక్క స్వాతి లకు ఫోన్లో సమాచారం అందించారు. వారు చేరుకునే లోగా హాస్పిటల్ కు తరలించినట్టు చేసి తన స్వగృహానికి తీసుకెళ్లి మృతదేహాన్ని పూడ్చేయాలని పన్నాగం వేశాడు భర్త వినయ్ కుమార్. ఇంతలో చాదర్ ఘాట్ పోలీసులు అంబులెన్స్ ను వెనుకకు పిలిపించి మృతదేహాన్ని మార్చురీకి తరలించడంతో వినయ్ కుమార్ కుట్ర భగ్నమయింది.

శిరీష మృతిపై శిరీష మేనమామ మధుకర్ ఫిర్యాదు చేయడంతో పోలీసు విచా రణలో హత్య ఉదాంతం బహిర్గతం అయింది. హత్యకు పాల్పడిన సరితను ఎ1గా చేర్చి, హత్యను కప్పిపుచ్చేందుకు సహకరించిన వినయ్ కుమార్, నిహాల్ కుమార్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి పాటిల్ కాంతిలాల్ సుభాష్ పర్య వేక్షణలో మలక్పేట్ ఏసీబీ శ్యాంసుందర్ ఆధ్వ ర్యంలో చాదర్ ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు, డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ భూపాల్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 205 కిలోల గంజాయి పట్టివేత

## ఎఒబి నుంచి మహారాష్ట్రకు అక్రమ రవాణా

**పటాన్‌చెరు,మార్చి 5,ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ వాహనంలో గంజాయిని తరలిస్తుండగా సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా పారిపోతున్న ఫైనాన్సర్ ను కామారెడ్డి జిల్లా పిట్లం సమీపంలో ఎస్ఓటీ అధికారులు పట్టుకున్నారు. మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆంధ్ర, ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న భీం సింగ్, దీపక్ నాగ నాథ్ అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించామని చెప్పారు. గంజాయి విలువ సుమారు కోటి రెండు లక్షలు ఉంటుందన్నారు. చాకచక్యంతో పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్న సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ టీంను అభినందించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్





వివరాలు వెల్లడిస్తున్న మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జె.హరికిషన్


ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జె.హరికిషన్ వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ 2 వద్ద జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానంతో సెప్టిక్ ట్యాంకర్ క్లీనర్ లో చెకింగ్ చేయగా 205 కిలోల గంజాయి పొట్లాలు బయటపడ్డాయి. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణెమ్మ, పటాన్ చెరు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్, సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ దుబ్బాక శంకర్, ఎస్ఐ హన్మంత్, సిబ్బంది అరుణ్ జ్యోతి, రాజేష్, అంజిరెడ్డి, శివ, తదితరులు ఉన్నారు.

# డ్రామాలాడుతున్న రేవంత్,మల్లన్న: మధుయాష్కీగౌడ్

**హైదరాబాద్,మార్చి 5,ప్రభాతవార్త:** తీన్మార్ మల్లన్న హద్దులు దాటి ప్రవర్తించారని ఆయన వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని మల్లన్న,రేవంత్‌లు ఇద్దరు డ్రామాలు చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాష్కీ వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు మల్లన్న ఇప్పుడు అందరిలాగే మల్లన్నపైచర్యలు తీసుకొంటారా అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడే క్రమశిక్షణ తప్పాడని ఆయన ఆరోపణచేశారు సొంతపార్టీ ఎమ్మెల్యే మేగారెడ్డిపై బహిరంగ ఆరోపణలుచేశారని గుర్తుచేశారు. కులగణపై బిసినాయకులతో రేవంత్‌రెడ్డి మీటింగ్ పెడితే దానికి జానారెడ్డిని కేశవరావును పిలిచారని బిసి నాయకుడినైన నన్ను పిలవలేదని గతంను నెమరేసుకొన్నారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రకులాలు ఏలాంటి క్రమశిక్షణ ఉల్లంఘించిన చర్యలు తీసుకోరని ఆయన స్వగతంలో చెప్పుకొన్నారు.

# రికార్డులు ట్యాంపరింగ్ చేసిన ఇద్దరు గిర్దావర్లను సస్పెండ్ చేసిన సూర్యాపేట కలెక్టర్

**హైదరాబాద్, మార్చి 4 ,ప్రభాతవార్త:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భూ భారతి పలు కారణాలతో మరింత జాప్యం కావడంతో కొంత మంది అధికారులు దీన్ని ఆసర చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు.తహసీల్దార్ కార్యాలయంలో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్ల మొదలుకుని ఇతర ఉన్నతాధికారులు వరకు ఎవరికి తోచిన విధంగా అక్రమాలకు పాల్పడుతుండంటంతో అటు ప్రభుత్వానికి చెడ్డపేరు రావడం కాకుండా ఇటు అసలైన పట్టాదారులు నష్టపోతున్నారు. ఇదే అంశంపై వారు న్యాయం కోసం జిల్లా కలెక్టర్ల ఆశ్రయిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని మోతే మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను ఇద్దరు గిర్దావర్‌లు రికార్డులను ట్యాంపరింగ్ చేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో జిల్లా కలెక్టర్ తేజస్ లాల్ నంద్ లాల్ పవర్ విచారణకు ఆదేశించారు. గిర్దావర్‌లుగా పని చేస్తున్న జె. నిర్మలదేవి, అదనపు గిర్దావర్‌లు షేక్ మన్సూర్ అలీలు పాత పహణీ రికార్డుల్లో పేర్లు లేక పోయినా ఉన్నట్లు సృష్టించి ధరణిలో మిస్సింగ్ సర్వే నంబర్ల కింద 11 దరఖాస్తులు చేసి భూమి ఉన్నట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలను అందించారు.ఈ విచారణలో ఇదే అంశం బయటపడటంతో వారిని కలెక్టర్ సస్పెండ్ చేస్తూ మంగళవారంఉత్తర్వులు జారీచేశారు.అంతే కాకుండా ఎ మండల కేంద్రంలోని ఏ.యం గౌడ్ మీసేవ కేంద్రంను సంబంధిత అధికారులు సీజ్ చేశారు. మీ సేవ నిర్వాహకుడు అండెం మల్లేష్‌ను మోతె స్థానిక ఎస్ఐ యాదవేందర్ రెడ్డి విచారణలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్‌లాల్ నంద లాల్ పవర్ తెలిపారు.



బిసి హాస్టళ్ల కోసం ప్రభుత్వ భూముల వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

# స్థలాలు వేలం వేయకుండా హాస్టళ్లు నిర్మించాలి

## రెవెన్యూశాఖ మంత్రితో ఆర్.కృష్ణయ్య చర్చలు

**హైదరాబాద్, మార్చి 5 ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాల్లో బిసి కాలేజీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన కలుసుకున్నారు.ఈ సందర్భంగా బిసి హాస్టళ్ల కోసం ప్రభుత్వ భూముల వివరాలను మంత్రికి అందజేశారు.గచ్చిబౌలీలో 400 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అమ్మి 30వేల కోట్లు సేకరించాలని ప్రభుత్వం నోటిపికేషన్ జారీ చేసింది.ఇతర చోట్ల కూడా ప్రభుత్వ భూములు అమ్మి నిధులు సేకరించాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ స్థలాల్లో బీసీ కాలేజీ హాస్టళ్ళు, గురుకుల పాఠశాలకు సొంత భవనాలు నిర్మించాలి' అని కృష్ణయ్య కోరారు. రాష్ట్రంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 295 హాస్టళ్ళు నిర్వహిస్తున్నాడు. హాస్టళ్ళు ప్రారంభించి 37 సంవత్సరాలు అవుతున్న వాటికి స్వంత దవనాలు లేవు.అలాగే 320 బిసి గురుకులాలకు స్వంత భవనాలు లేవు. వందల కోట్ల వ్యయంతో ప్లైఓవెర్స్,అండర్ ఎవర్స్ నిర్మస్తున్నారు. ఉన్నత చదువులు చదువుకొనే, బి.సి విద్యార్థులకు స్వంత భవనాలు నిర్మించాలనే ఆలోచన చేయడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల బీసీ సంఘం నాయకత్వాన ప్రధానమంత్రిని కలిసిన విషయాన్ని ప్రస్థావిస్తూ.. బిసి హాస్టళ్ల నిర్మాణానికి బడ్జెట్ ఇవ్వాలని ప్రధానికి విజ్ఞప్తి చేయగా, రాష్ట్ర ప్రభుత్వం బీసీ కాలేజీ హాస్టళ్ళ నిర్మాణానికి స్థలాలు సేకరించి ప్రతిపాదనలు పంపిస్తే నిధులు ఇస్తామంటూ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ స్థలాలు అమ్మకుండా బీసీ హాస్టళ్ళకు గురుకులకు స్థలాలు కెటాయించాలని కోరారు.ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ప్రభుత్వ స్థలాల వివరాలను మంత్రికి అందజేశారు.

# గిరిజన ప్రాంతాల్లో సిఎఫ్ఆర్ అమలు

## అధ్యయనం చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ

**హైదరాబాద్,మార్చి5,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గిరిజన వర్గాలకు జీవనోపాధి కల్పించేందుకు గిరిజన సంక్షేమశాఖ కమ్యూనిటీ ఫారెస్ట్ రిసోర్స్(సిఎఫ్ఆర్) హక్కులను అమలు చేయాలని గిరిజన సంక్షేమశాఖప్రణాళికలు రూపొందిస్తోంది. గిరిజన ఆవాసాలకు కమ్యూనిటీ ఫారెస్ట్‌రిసోర్స్ హక్కులను అందించడంతో స్థానిక జనాభా స్థానిక చెరువులు,నీటి గుంటలలో చేపల పెంపకం,మైదానాలలో గడ్డిని పెంచడం దాన్ని పశువులకు మేతగా ఉపయో గించుకుంటారు. అంతే కాకుండాఖాళీ భూములలో ఉద్యానవనాలను ఏర్పాటు చేస్తారు.మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో సిఎఫ్ఆర్ అమలును గిరిజన సంక్షేమ శాఖ అధ్యయనం చేస్తోంది.ఈ హక్కుల అమలు ద్వారా ఈ రాష్ట్రాలు మంచి ఫలితాలను సాధిస్తున్నాయి.తెలంగాణలో సిఎఫ్ ఆర్‌ను అమలు చేసేందుకు దాని గురించి మరింత సమచారం తెలుసుకునేందుకు మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న బెంగళూరుకు చెందిన అశోకట్రస్ట్ ఫర్ రీసెర్చ్‌ఇన్ ఎకాలజీ అండ్ ది ఎన్విరాన్‌మెంట్ (ఏటిఆర్ఈఈ)ని సంప్రదించాలని ఆ శాఖ అధికారులు యోచిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారుల ప్రకారం, తెలంగాణలో సిఎఫ్ఆర్ అమలు తక్కువగా ఉంది.దీన్ని అమలు చేసేందుకు,గతంలో 3,000 దరఖాస్తులు వచ్చాయి, కానీ 700 సిఎఫ్ఆర్‌లు మాత్రమే జారీ చేశారు. రాష్ట్రంలో 2,700 వరకు ఆవాసాలు సిఎఫ్ఆర్‌ను అమలు చేయడం లేదని గిరిజన శాఖ గుర్తించింది.రాష్ట్రంలోని గిరిజన ప్రాంతంలో ప్రతి ఆవాసానికి కనీసం 2 నుండి 7 సిఎఫ్ఆర్‌లను ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిసింది. రెవెన్యూ రికార్డులు, మ్యాప్‌లు, ఉపగ్రహచిత్రాల ఆధారంగా గిరిజన శాఖ కమ్యూనిటీ వనరులు, వాటి ప్రాంతాలను పరి శీలిస్తోంది. అటవీ,రెవెన్యూ శాఖల సహకారంతో సిఎఫ్ ఆర్‌ను అమలు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రతిపాదించింది.

అటవీ చట్టం 2006లోని సెక్షన్లు 3(1)(బి), 3(1)(సి) కింద కమ్యూనిటీ హక్కులతో కలప, అటవీ ఉత్పత్తులపై హక్కులను కలిగి ఉంటాయి, ఇవి కమ్యూనిటికి స్థిరమైన జీవనోపాధిని కలిగిస్తాయి. అటవీ నివాస షెడ్యూల్డ్ తెగ (ఎఫ్‌డిఎస్‌టి),ఇతర సాంప్రదాయ అటవీ నివాసుల (ఒటిఎఫ్‌డిఎస్)జీవనోపాధి, ఆహార భద్రతను నిర్ధారిస్తూఅడవుల పరిరక్షణ పాలనను బలోపేతం చేస్తుంది.ఒక కమ్యూనిటీ దీన్ని గుర్తించిన తర్వాత, అడవి యాజమాన్యం అటవీ శాఖకు బదులుగా గ్రామసభ చేతుల్లోకి వెళుతుంది.ఈ హక్కులు గ్రామసభకు కమ్యూనిటీ అటవీ వనరుల సరిహద్దులో అటవీ సంరక్షణ, నిర్వహణ యొక్క స్థానిక సాంప్రదాయ పద్ధతులను అవలంబించే అధికారాన్ని ఇస్తాయని అధికారులు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గిరిజన ఆవాసాలలో (సిఎఫ్ఆర్)నుఅమలు చేయాలని యోచిస్తోంది.

# బిజెపి,బిఆర్ఎస్ గొంతుకతో విమర్శించడమా?

### తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై సీతక్క, జానారెడ్డి తదితర నేతల నుంచి ఎదురుదాడి

### నవీన్‌తో తనకు సంబంధంలేదు: విహెచ్ వివరణ

### ఉనికి కోసం మల్లన్న విమర్శలు : వంశీచంద్‌రెడ్డి

**హైదరాబాద్,మార్చి 5,ప్రభాతవార్త:** 'రేవంత్‌కు నచ్చకపోయినా, 2028లో బిసి నేత ముఖ్యమంత్రి కావడం ఖాయం. ఈడబ్ల్యూఎస్ కోటాకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతోనే కులగణనను తప్పుగా చూపారు.పక్కనున్న వాళ్లు బానిసలుగా బతకాలనేది రేవంత్ వ్యక్తిత్వం. రేవంత్ చేసిన కుల గణన చిత్తు కాగితంతో సమానం' కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విలేఖరుల సమావేశంలో మాటల దాడి చేయడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా అదేస్థాయిలో ప్రతిదాడి మొదలైంది.మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ప్రతిస్పందిస్తూ మల్లన్న వెనుక బిసిలు ఎవరు లేరని కొందరు బిజెపి,బిఆర్ఎస్ గొంతుకలే ఆయనతో మాట్లాడిస్తున్నాయని విమర్శించారు. గతంలో బిఆర్ఎస్ చేయలేనిది తాము చేశామని,అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తారా అని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో మొట్టమొదటిసారిగా ఏ ప్రభుత్వం చేయని కులగణన చేపట్టామని ఆమె స్వోత్కర్షలు చెప్పుకొన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పొల్చుకునే స్థాయి మల్లన్నది కాదని చెప్పారు. కాంగ్రెస్ తెలంగాణలో కార్యకర్తల శ్రమ కృషితోనే అధికారంలోకి వచ్చిందని ఆమె అన్నారు. కులగణనపై అభ్యంతరాలు ఉంటే శాసనసమండలిలో మాట్లాడాలని అన్నారు. కులగణనకు 50రోజుల సమయం ఇచ్చామని, అది సరిపోదా అని మంత్రి సీతక్క నిలదీశారు. తీన్మార్ మల్లన్న అంశం తనకు సంబంధం లేదని మాజీ ఎంపి.వి. హనుమంతురావు గాంధీభవన్‌లో విలేఖరుల వద్ద వివరణ ఇచ్చుకున్నారు. తీన్మార్ మల్లన్న అంశం అధిష్ఠానం చూసుకొంటుందని ఆయన అన్నారు. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పా నని అన్నారు. మీనాక్షి నటరాజన్ తనను ఏమి అడ గలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని మీనాక్షి నటరాజన్‌కు చెప్పానని హనుమంతురావు అన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి మాట్లాడుతూ నోటికి ఎంత వస్తే అంత గాలి మాటలు మాట్లాడితే కుదరదంటూ మల్లన్న తనపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తప్పు చేసిన వాడిని కూడా క్షమించే గుణం తనదని చెప్పుకొచ్చారు. తనను తిట్టినా పట్టించుకోనని అన్నారు. ప్రత్యక్ష రాజకీయాలకు తాను దూరంగా ఉన్నానని పాలన చేసే వారు అడిగితేనే తాను సలహాలు ఇస్తానని చెప్పారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని వివరణ ఇచ్చుకున్నారు. నన్ను విమర్శిస్తే తమ పార్టీ నేతలు కూడా స్పందించడంలేదని ఆయన ఆవేదన చెందారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై ఏఐసీసీ కార్యదర్శి వంశీ చంద్ రెడ్డి స్పందిస్తూ ఉనికి కోసం మల్లన్న అవాస్తవాల ప్రకటనలు చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నా గెలుపుకోసం సిఎం రేవంత్‌రెడ్డి ఎంతో శ్రమిం చారని మల్లన్న వ్యాఖ్యలను ఖండించారు. తన ఓటమికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కేవలం తన ఉనికి కోసమే అని చెప్పారు.

తాను మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేయాలన్నది అధిష్ఠానం నిర్ణయమని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగానే మహబూబ్ నగర్‌లో బీజేపీ గెలిచిందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత జైల్లో ఉండటంతో ఆమెను బయటకు తీసుకు రావడం కోసం బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి అమ్ముడు పోయిందని ఆరోపించారు. గతంలో కేసీఆర్ లాంటి నేతలు ఎంపీగా పని చేసిన మహబూబ్‌నగర్ సిట్టింగ్ సీట్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయి బీజేపీకి మద్దతు ఇచ్చిందని ఆరోపించారు.

# 7న 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' రీ రిలీజ్



సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాని మార్చి7 శుక్రవారం రీరిలీజ్ చేస్తున్నాం. అప్పుడే పది థియేటర్లు ఫుల్ అయి పోయాయి. మహేష్ అభిమానులు, వెంకటేష్‌అభిమానులు, ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్ కి వచ్చి మళ్ళీ బ్రదర్స్ మధ్య వుండే మూమెంట్స్ ని ఎంజాయ్ చేద్దామని ఇన్ని థియేటర్స్ ఫుల్ చేశారంటే చాలా హ్యాపీగా వుంది. మంచి కంటెంట్ మళ్ళీ చూద్దామని వస్తున్నారు. మంచి సినిమాలు తీస్తే థియేటర్స్‌కి జనాలు వస్తారని రీరిలీజ్‌లు ప్రూవ్ చేస్తున్నాయి అన్నారు నిర్మాత దిల్ రాజు. విక్టరీ వెంకటేష్, సూపర్ స్టార్ మహేష్ బాబు క్లాసిక్ బ్లాక్ బస్టర్ సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత దిల్ రాజు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం 2013లో విడుదలై ఘన విజయాన్ని సాధించింది. ఈ సినిమాని మార్చి 7న గ్రాండ్‌గా రీరిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ప్రెస్ మీట్ లో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సంక్రాంతి వస్తున్నాం తర్వాత ప్రేక్షకులని కలవడం ఆనందంగా వుంది. మార్చి7 శుక్రవారం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు రీరిలీజ్ చేస్తున్నాం. తొలిప్రేమ డిస్ట్రిబ్యూషన్ చేసినప్పుడు ఐదేళ్ళు సినిమా రైట్స్ మా వద్ద ఉండేవి. మాకు ఎప్పుడు డబ్బులు తక్కువ వున్నా సినిమాని రీరిలీజ్ పెడితే ఆ సినిమా ద్వారా మనీ వచ్చేవి. అవన్నీ మిరాకిల్స్ డేస్. అలాగే ఇప్పుడు కూడా రీరిలీజ్ పెడితే ఆడియన్స్ చాలా ఇంట్రస్ట్ చూపిస్తున్నారు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు మూవీ రీరిలీజ్‌కి సంబంధించి అప్పుడే పది థియేటర్లు ఫుల్ అయిపోయాయి. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఆల్రెడీ ఓటీటీలో వుంది. జనం చుసేశారు. నేనూ వెళ్లి మార్చి 7న సుదర్శన్ 35ఎంఎంలో మార్నింగ్ ఎనిమిది గంట షో చూస్తాను. మళ్ళీ 12 ఏళ్ల తర్వాత ఈ సినిమాని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయాలని అనిపిస్తోంది. 12 ఏళ్ల తర్వాత మళ్ళీ ఇద్దరు బ్రదర్స్ వస్తున్నారు కాబట్టి అందరూ థియేటర్స్‌లో ఎంజాయ్ చేయండి. థాంక్ యూ అన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు నిర్మాత దిల్ రాజు సమాధానాలు ఇచ్చారు.

**దిల్ రాజు 12 ఏళ్ల క్రితం ఈ కాంబినేషన్ సెట్ చేయడానికి ఎంత కష్టపడ్డారు?**

రామారావు దగ్గర నుంచి చిరంజీవి వరకూ అందరు హీరోలు మల్టీ స్టార్ సినిమాలు చేస్తూ వచ్చారు. తర్వాత ఎందుకు మారుతూ వచ్చింది. ఒకరోజు డైరెక్టర్ శ్రీకాంత్ ఈ ఐడియా చెప్పారు. మొదట వెంకటేష్‌ని తర్వాత మహేష్‌ని అప్రోచ్ అయ్యాం. ఇద్దరూ కథ విని ఒకే అన్నారు. మేము అనుకున్న కథని స్క్రీన్‌పై తీసుకురావడానికి చాలా కష్టపడ్డాం. దాదాపు వన్ ఇయర్ షూట్ చేశాం. మహేష్, వెంకటేష్ ఈ సినిమా కోసం చాలా టైం స్పెండ్ చేశారు. చాలా హోమ్ వర్క్ చేసుకున్నారు. అందుకే సినిమా నేచురల్ గా కనిపిస్తుంది. అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. సినిమా అంత అద్భుతంగా వచ్చింది కాబట్టే రీరిలీజ్‌కి కూడా ఇంత వాల్యూ.

**సీక్వెల్ ప్లాన్ చేసే ఆలోచన లేదా?**

ఈ సినిమా సీక్వెల్ ఎలా చేయొచ్చు?అనే మంచి ఐడియా ఎవరు చెప్పినా నేను రెడీ. రీరిలీజ్ రోజు మళ్ళీ చూడండి. మంచి ఐడియాతో రండి (నవ్వుతూ).

# 'ఆర్టిస్ట్' ట్రైలర్ లాంచ్

సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా నటిస్తున్న సినిమా ఆర్టిస్ట్. ఈ సినిమాను ఎస్ జేకే ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్‌పై జేమ్స్ వాట్ కొమ్ము నిర్మిస్తున్నారు. రతన్ రిషి దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్టిస్ట్ మూవీ ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లిరిసిస్ట్ రాంబాబు గోసాల మాట్లాడుతూ, సురేష్ బొబ్బిలి మ్యూజిక్ డైరెక్షన్‌లో ఆర్టిస్ట్ సినిమాలో అన్ని పాటలు రాసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఇప్పటికే రెండు సాంగ్స్ చూస్తూ, చూస్తూ, ఓ ప్రేమా రిలీజ్ అయ్యాయి. ఈ రెండూ నా ఫేవరేట్ సాంగ్స్. డైరెక్టర్ రతన్ రిషి మూవీని బాగా రూపొందించాడు. సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పర్ ఫార్మెన్స్ ఆకట్టుకుంటుంది. జేమ్స్ వాట్ కొమ్ము ప్యాషనేట్‌గా ఈ మూవీ రూపొందించారు. అన్నారు. నటి స్నేహ మాధురిశర్మ మాట్లాడుతూ, ఆర్టిస్ట్ మూవీ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాం. ఈ సినిమాలో ఒక కీ రోల్‌లో నటించాను. నా ఫిల్మోగ్రఫీలో ఈ సినిమా గుర్తుండిపోతుంది. ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రతన్ రిషికి థ్యాంక్స్ అన్నారు. నటుడు వెంకీ మాట్లాడుతూ ఆర్టిస్ట్ సినిమాలో హీరో ఫ్రెండ్ రోల్‌లో నటించాను. సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది. హీరో హీరోయిన్స్ సంతోష్, క్రిషేక తమ పర్ ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంటారు. ఈ మూవీలో తాగుబోతు రమేష్‌తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సురేష్ బసంత్ మాట్లాడుతూ, ఆర్టిస్ట్ ట్రైలర్ లాంచ్ చేసుకున్న సందర్భంగా మూవీ టీమ్ అందరికీ కంగ్రాట్స్ చెబుతున్నా. ట్రైలర్ చాలా బాగుంది. యూత్ ఫుల్ లవ్ ఎంటర్ టైనర్ లా మూవీ ఉండబోతోంది. ప్రొడ్యూసర్ జేమ్స్ వాట్ పట్టుదల గల వ్యక్తి. మంచి మూవీ చేశాడు. సాంగ్స్ హిట్ అయ్యాయి. సినిమా కూడా ప్రేక్ష కుల ఆదరణ పొందాలని కోరుకుంటున్నా అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ, నేను ఈ బ్యానర్‌లో చేస్తున్న రెండో మూవీ ఆర్టిస్ట్. అలాగే డైరెక్టర్ రతన్ రిషితో కూడా నాకు రెండో మూవీ ఇది.



రతన్ రిషి చాలా కష్టపడి ఈ మూవీ చేశాడు. అన్నీ తానై ప్రాజెక్ట్ చూసుకున్నాడు. ప్రొడ్యూసర్ జేమ్స్ వాట్‌కి ఇతర బిజినెస్‌లు ఉన్నా, మూవీ మీద ప్యాషన్‌తో ఇండస్ట్రీకి వచ్చారు. లీడ్ పెయిర్ సంతోష్, కిషేక బాగా నటించారు. సినిమాకు టీమ్ అంతా కష్టపడ్డాం. ఈ నెల 21న రిలీజ్‌కు వస్తున్న మా మూవీ తప్పకుండా సక్సెస్ అవుతుందని నమ్ముతున్నాం అన్నారు. నటుడు తాగుబోతు రమేష్ మాట్లాడుతూ, ఆర్టిస్ట్ మూవీలో మంచి క్యారెక్టర్ చేశాను. ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రతన్ రిషికి థ్యాంక్స్. అలాగే హీరోసంతోష్ బయట మామూలుగా కనిపిస్తాడు గానీ కెమెరా ముందుకు వచ్చాక ఆయన పర్ ఫార్మెన్స్ చూసి సర్‌ప్రైజ్ అయ్యాను. టైటిల్ కూడా ఆర్టిస్ట్ అని పెట్టారు. సురేష్ బొబ్బిలి బీజీఎం వన్ ఆఫ్ ది హైలైట్ అవుతుంది. సినిమా మేము చూశాం సూపర్బ్‌గా వచ్చింది. మంచి డేట్‌కు ఈ నెల 21న రిలీజ్‌కు వస్తోంది. మీరంతా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా అన్నారు. హీరోయిన్ క్రిషేక పటేల్ మాట్లాడుతూ, ఆర్టిస్ట్ మూవీ ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నా. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్ జేమ్స్ వాట్‌కి, డైరెక్టర్ రిషికి థ్యాంక్స్.

# 'సంబరాల ఏటిగట్టు' సాంగ్ షూటింగ్

మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ 'విరూపాక్ష', 'బ్రో' బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత, తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ఎస్‌వైజి (సంబరాల ఏటిగట్టు)లో కంప్లీట్ న్యూ, యాక్షన్‌ప్యాక్డ్ ఇంటెన్స్ రోల్‌లో కనిపించనున్నారు. హనుమాన్ సెన్సేషనల్ పాన్ ఇండియా విజయం తర్వాత నిర్మాతలు కె నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన "కార్నేజ్" టీజర్‌కి ట్రెమండస్



రెస్పాన్స్ వచ్చింది. డెబ్యూ డైరెక్టర్ రోహిత్ కెపి గ్రిప్పింగ్ విజన్‌తో ఎస్‌డిటి పాత్రను లార్జర్ దెన్ లైఫ్ మేనర్‌లో ప్రజెంట్ చేశారు. కార్నేజ్ వీడియో సాయి దుర్గ తేజ్ ఇంటెన్స్ క్యారెక్టర్‌ని తెలియ జేస్తుంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మూవీ టీం ఇటీవలే రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ కొరియోగ్రఫీ చేసిన ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌ని భారీ సెట్‌లో పూర్తి చేశారు. చాలా రిస్క్‌తో కూడుకున్న ఈ ఫైట్ సీక్వెన్స్‌ని హీరో సాయి దుర్గ తేజ్ చాలా అద్భుతంగా పెర్ఫామ్ చేశారు. ఇది ప్రేక్షకులకు గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతోంది.

# 'సంక్రాంతికి వస్తున్నాం'కి 50 రోజులు పూర్తి



విక్టరీ వెంకటేష్ లేటెస్ట్ ఇండస్ట్రీ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం ఎంటర్టైన్మెంట్ వరల్డ్‌లో తుఫానుగా మారింది. బాక్సాఫీస్ వద్ద ఆధిపత్యం చెలాయించడమే కాకుండా డిజిటల్ రంగంలో కూడా చెరగని ముద్ర వేసింది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సక్సెస్‌ని రీడిఫైన్ చేసింది. పండుగ సీజన్‌లో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం, 92 సెంటర్లలోని థియేటర్లలో 50 రోజుల ప్రదర్శనను పూర్తి చేయడం ద్వారా అరుదైన ఘనతను సాధించింది. ఒటిటి ప్లాట్‌ఫారమ్‌లు ఆధిపత్యం వహించిన ఈ కాలంలో, సినిమాలు థియేటర్ లో లాంగ్ రన్ కొనసాగించడానికి ఇబ్బంది పడుతున్నప్పుడు ఈ సమయంలో ఈ విజయం అసాధారణమైనదిగా నిలిచింది. సంక్రాంతికి వస్తున్నాం ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద 300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించడమే కాకుండా, అత్యధిక వసూళ్లు సాధించిన తెలుగు రీజనల్ ఫిల్మ్‌గా నిలిచింది, డిజిటల్ కూడా రికార్డులను బద్దలు కొట్టింది. జీ5లో ప్రసారం అవుతున్న ఈ చిత్రం ప్లాట్‌ఫామ్‌లోని ఇతర బ్లాక్‌బస్టర్ల ఓపెనింగ్ వ్యూవర్‌షిప్‌ని అధిగమించింది. ఒటిటిలోకి వెళ్లినప్పటికీ సంక్రాంతికి వస్తున్నం థియేటర్లలో ఆదరగొడుతోంది. ఈ విజయం ప్రేక్షకులతో కనెక్ట్‌య్యే ఫ్యామిలీఫ్రెండ్లీ ఎంటర్‌టైనర్స్ పవర్‌ని చాటిచెప్పింది.

# మన చిన్న సాయం చిన్నారులకు పెద్ద సంతోషాన్ని ఇస్తుంది..

నా బర్త్ డే. ఈ చిన్నారులతో కలవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. మా వంతుగా డొనేషన్ ఇచ్చాం. ఇది చిన్నదే. అయితే ఈ చిన్న సాయం కూడా వారికి పెద్ద సంతోషాన్ని ఇస్తుంది. అందరూ కలిసి ఈ చిన్నారులకు హెల్ప్ చేయండి అన్నారు హీరోయిన్ వరలక్ష్మీ శరత్‌కుమార్. వరలక్ష్మీ శరత్ కుమార్ బర్త్ డే. ఈ సందర్భంగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని లెప్రా సొసైటీ ఆర్ఫానేజ్‌కి వెళ్లి చిన్నారు లతో సమ యాన్ని గడిపి, వారికి గిఫ్ట్స్ అందించారు. అనంతరం భర్త నికోలయ్ సచ్‌దేవ్‌తో కలిసి ఆర్ఫనేజ్‌కి డొనేషన్ అందజేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ వరలక్ష్మీ శరత్ కుమార్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నా ప్రతి బర్త్ డేకి నావంతు



సాయంగా సోషల్ సర్వీస్ చేస్తాను. చెన్నై నుంచి మొత్తంగా హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాను కాబట్టి ఈసారి హైదరాబాద్‌లో ఏదైనా మంచి కార్యక్రమం చేయాలని అనుకు న్నాను. ఈ ఆర్ఫనేజ్‌లో చాలామంది ఆడ బిడ్డలు వున్నారు. ఈ బ్రాంచ్‌లో 62 మంది చిన్నారులు వున్నారు. వాళ్ళ కోసం మన తరపున చిన్న సాయం చేయొచ్చు. చాలా మందికి ఈ ఆర్ఫనేజ్ గురించి తెలీదు. సెలబ్రిటీ వస్తే ఆర్ఫనేజ్‌కి ఒక గుర్తింపు వస్తుందని ఆశ, దీని గురించి జనాలుకి తెలుస్తుందనే మంచి ఉద్దేశంతో వచ్చిన మీడియా వారికి ధన్యవాదాలు. మీడియా సపోర్ట్ వలన ఈ ఆర్ఫనేజ్ గురించి జనాలకు తెలుస్తుంది. దయచేసి అందరూ హెల్పింగ్ హ్యాండ్స్ అందించండి. గౌతంకి థాంక్ యూ. ఆయన ప్రతిసారి చాలా సపోర్ట్ ఇస్తారు. మాకు సేవ్ శక్తి అనే ఎన్జీవో వుంది. దానికి సపోర్ట్ చేశారు. థాంక్ యూ అన్నారు. వరలక్ష్మీ శరత్ కుమార్ భర్త నికోలయ్ సచ్‌దేవ్ మాట్లాడుతూ, జీవితం అందరికీ ఒకేలా వుండదు. మేము చాలా కష్టపడి ఈస్థాయికి వచ్చాం. ఇప్పుడు మేమున్న పరిస్థితిలో ఈ సాయం చేయడం పెద్ద డీల్ కాకపోవచ్చు. సాయంచేయడం మా బాధ్యత. ఇక్కడ చిన్నారులని కలసిన తర్వాత చాలా ఎమోషనల్‌గా అనిపించింది. మన దగ్గర వున్నదాంట్లో కొంత ఇస్తే అది మళ్ళీ ఫుల్ సర్కిల్‌లా వెనక్కి వస్తుంది.



మెహ్రీన్ పిర్జాదా నయా లుక్

# 'కింగ్‌స్టన్' ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్

సంగీత

దర్శకుడు జీవి ప్రకాష్‌కుమార్ హీరోగా నటించిన తాజా సినిమా కింగ్‌స్టన్. జి స్టూడియోస్ సంస్థతో కలిసి ప్యారలల్ యూనివర్స్ పిక్చర్స్ పతాకం మీద ఆయన ప్రొడ్యూస్ చేశారు. నిర్మాతగా జీవి ప్రకాష్ కుమార్ తొలి చిత్రమిది. గంగా ఎంటర్టైన్మెంట్స్ అధినేత మహేశ్వర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ శుక్రవారం మార్చి 7వ తేదీన విడుదల కానుంది. ఈ సందర్భంగా జీవి ప్రకాష్ కుమార్ హైదరాబాద్ వచ్చారు. తెలుగు మీడియాతో ఆయన ముచ్చటించారు. ఆయన ఇంటర్వ్యూ విశేషాలు...

**హాయ్ జీవి ప్రకాష్. వెల్కమ్ టు హైదరాబాద్!** థాంక్యూ అండి. కింగ్‌స్టన్ ప్రమోషన్స్ కోసం హైదరాబాద్ రావడం నాకు సంతోషంగా ఉంది. **విడుదలకు ఇంకొన్ని రోజులే ఉంది.. నెర్వస్ ఫీల్ అవుతున్నారా?** సాధారణంగా ప్రతి సినిమా విడుదలకు ముందు ఉంటుంది. ఓహ్... ఇంకా విడుదలకు నాలుగు రోజులే ఉంది. విడుదలకు మూడు రోజులే ఉంది అనిపిస్తూ ఉంటుంది.

**కింగ్‌స్టన్‌లో మీరు హీరోగా నటించడంతో పాటు ప్రొడ్యూస్ చేశారు. ముందు నుంచి ప్రొడ్యూస్ చేయాలనుకున్నారా? కథ నచ్చి ప్రొడ్యూస్ చేశారా?** ప్రొడక్షన్ చేయాలని కొన్ని రోజులుగా అనుకుంటున్నాను. కింగ్‌స్టన్ కథ విన్న తర్వాత నచ్చింది. జి స్టూడియోస్ సంస్థతో కలిసి చేశా. ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద ఇప్పటి వరకు ఇటువంటి సినిమా రాలేదు. కింగ్‌స్టన్‌ను ఫ్రాంచైజీలా చేయాలని అనుకుంటున్నాం. మా దగ్గర నాలుగు పార్టుల వరకు కథ రెడీగా ఉంది.

**కింగ్‌స్టన్ కథ ఏమిటి? ఇది ఏ జోనర్ సినిమా అని చెప్తారు?** సముద్ర తీరం పక్కన ఒక ఊరు ఉంటుంది. ఆ ఊరిలో జాలరి పాత్ర చేశాను. సాధారణంగా జాలర్లు అందరూ సముద్రంలో వేటాడడానికి వెళతారు. అయితే ఆ ఊరి ప్రజలు ఎవరూ సముద్రంలోకి వెళ్లరు. ఆ ఊరికి ఒక శాపం ఉంటుంది. అది ఏమిటి? అనేది సినిమాలో చూడాలి. శాపాన్ని ఎదిరించాలని హీరో సముద్రంలోకి వెళ్తాడు. అక్కడ ఏం జరిగిందనేది సినిమా. ఇండియాలో ఫస్ట్ సీ అడ్వెంచర్స్ థ్రిల్లర్ సినిమా ఇది. సముద్రంలోకి వెళ్ళిన తర్వాత హీరోలకు జాంబీలో ఎదురవుతారు. అలాగే ఆత్మలు కూడా ఉంటాయి. ప్రేక్షకులకు ఇది ఒక డిఫరెంట్ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది.

**హీరోగా ఇప్పటివరకు మీరు చేసిన సినిమాలలో శారీరకంగా మిమ్మల్ని ఎక్కువ కష్టపెట్టిన సినిమా ఇదే అనుకోవాలా?** అవును. షిప్ మీద యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ చేసేటప్పుడు తడి తడిగా ఉంటుంది కనుక జారిపోయేది. ఒక్కోసారి ఒక్క షాట్ చేసిన తర్వాత వేలు,కాళ్ళ మీద గాయాలు అయ్యేవి. బ్యాండేజ్ కట్టుకుని మళ్లీ షూటింగ్ చేసేవాడిని. అయితే యాక్షన్ సీక్వెన్స్ అన్ని బాగా వచ్చాయి.



**టెక్నికల్ పరంగా సినిమా చేసేటప్పుడు ఏదురైన సవాళ్లు ఏంటి?** ఇండియాలో ఇప్పటివరకు ఇటువంటి సినిమా రాలేదు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ నీరవ్ షా మూడు రోజుల పాటు టెస్ట్ షూటింగ్ చేశారు. ఆ తర్వాత గోకుల్ బినోయ్ సినిమా మొత్తం చేశారు. ఒక బోటు మీద ఆర్టిస్టులు ఉంటే మరొక బోటు మీద కెమెరా ఉండేది. అలాగే కొన్ని మీనియేచర్ సెట్స్ కూడా వేశాం. సినిమా విడుదలైన తర్వాత హాలీవుడ్ సైతం ఆశ్చర్యపోతుంది. వీళ్ళు ఈ సినిమా ఎలా చేశారని తప్పకుండా అడుగుతారు.

**బ్యాచిలర్ సినిమాలో మీరు దివ్య భారతితో కలిసి నటించారు. మళ్లీ ఈ సినిమా చేశారు. ఆవిడ గురించి!?** జీ స్టూడియోస్ సంస్థతో కలిసి ఈ సినిమా చేయాలని ఫిక్స్ అయ్యాం. ఆ తర్వాత హీరోయిన్ ఎవరైతే బాగుంటుందని డిస్కషన్ వచ్చింది. మంచి కాంబినేషన్ అయితే బాగుంటుందని జీ స్టూడియోస్ సంస్థ కూడా దివ్యభారతి పేరు సజస్ట్ చేశారు. సినిమాలో ఆ అమ్మాయి యాక్షన్ సీక్వెన్స్ చేసింది. కింగ్‌స్టన్ తర్వాత ఆమెకు మంచి పేరు వస్తుంది.

**మీ సినిమాలకు మీరే మ్యూజిక్ చేస్తుంటారు. మీ సినిమాల కోసం స్పెషల్ వర్క్ ఏమైనా చేస్తారా?** నేను హీరోగా నటించే సినిమాలు కంటే బయట సినిమాలకు మంచి మ్యూజిక్ ఇస్తానని అందరూ చెబుతారు. కథను బట్టి సంగీతం ఇస్తున్నా. నా సినిమాల కోసం అంటూ స్పెషల్ వర్క్ ఏమీ చేయను. ఈ సినిమా కోసం కొత్త తరహా సౌండ్ కొన్ని వినిపించే ప్రయత్నం చేశా.

# 'ఛావా' ట్రైలర్ లాంచ్ ఈవెంట్

ఛత్రపతి శంభాజీ మహారాజ్ అజేయమైన స్ఫూర్తిని, ధైర్యాన్ని సెలబ్రేట్ చేసుకునే చారిత్రక ఇతిహాసం ఛావా తెలుగురాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. దినేష్ విజన్ మాడ్డాక్ ఫిల్మ్స్ నిర్మించి, లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన చావాలో విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించారు. హిందీ వెర్షన్ భారీ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన తర్వాత ఈ పవర్ ఫుల్ కథను తెలుగులోకి డబ్ చేసి మార్చి 7న థియే టర్లలో విడుదల చేయడానికి సిద్ధంగా ఉంది. ఛావా తెలుగు వెర్షన్‌ను గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ విభాగం గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. సినిమా తెలుగు ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ మరణం తరువాత, మరాఠా సామ్రాజ్యం మొఘల్ ఆధిపత్య ముప్పును ఎదుర్కొంటుంది, కానీ అతని వారసత్వం అతని కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ ద్వారా కొనసాగుతుంది. శంభాజీపాత్రలో విక్కీ కౌశల్ అద్భుతంగా నటించారు. "సింహంపోవచ్చు, కానీ దాని పిల్ల ఇప్పటికీ అడవిలో వేటాడుతూనే ఉంది" అనే పవర్ ఫుల్ లైన్‌తో కౌశల్ శంభాజీ ధైర్యాన్ని ప్రతిబింబిస్తాడు, గెరిల్లా యుద్ధానికి నాయకత్వం వహిస్తాడు. శత్రువులను తరిమికొడతాడు. అక్షయ్ ఖన్నాను మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు గా పరిచయం చేయగా, రష్మిక మందన్న శంభాజీ భార్య యేసుబాయిగా కనిపిస్తుంది. విక్కీ కౌశల్ ఛత్రపతి శంభాజీ మహారాజ్ పాత్రకు జీవంపోశాడు. తన పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. అక్షయ్ ఖన్నా, రష్మిక మందన్న వారి వారి పాత్రలలో ఆకట్టుకున్నారు. ఈ సినిమాలోని ప్రతి ఎమోషన్, యాక్షన్ మూమెంట్‌ని ఎఆర్ రెహమాన్ నేపథ్య సంగీతం మరింత ఉత్సాహాన్ని నింపుతుంది. యుద్ధ సన్నివేశాలు మరాఠా యోధుడి పోరాట స్ఫూర్తిని ప్రజెంట్ చేశాయి. కాస్ట్యూమ్స్, మేకప్, ప్రొడక్షన్ డిజైన్ నాటి యుగానికి తీసుకెళ్ళాయి. సౌరభ్ గోస్వామి (ఐఎస్‌సి) సినిమాటోగ్రఫీ అద్భుతంగా వుంది.

తెలుగులో ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. ట్రైలర్ అంచనాలని మరింత పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ, ఛావా సినిమాని మార్చి 7న తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా హిందీలో ఎంత పెద్ద ప్రభంజనం సృష్టించిందో మనందరికీ తెలుసు. అంత మంచి సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నందుకు చాలా గర్వపడుతుతున్నాం. భాష ఏదైనా మంచి సినిమా అయితే దాన్ని తెలుగులో తీసుకురావడానికి గీతా ఆర్ట్స్ ఎప్పుడూ ముందుంటుంది. గజిని, 2018, కాంతార.. ఇలా ఎన్నో అద్భుతమైన చిత్రాలు తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడు కూడా అద్భుతంగా ఆదరిస్తారు. దానికి చాలా నిదర్శనాలు ఉన్నాయి.



# సాంకేతికతతో ముందుకు.. బిజినెస్‌లో రాణింపు !

మనిషి చేసే పనిని మెషీన్లు చేయడమే కృత్రిమ మేధ. ఇప్పటికే చాలా రంగాల్లో అడుగుపెట్టిన ఈ సాంకేతికత ఎన్నో పనుల్ని ఆటోమేషన్ చేసేస్తోంది. ఇక ఇదే సాంకేతికతను వినియోగించుకుంటూ కొత్త వ్యాపారాలకు తెరతీస్తున్నారు కొందరు మహిళలు. కృత్రిమ మేధను నలుగురికీ పంచుతూ.. ఈ సాంకేతికతో కలిసి పనిచేసేలా నేటి యువతను సంసిద్ధం చేస్తున్నారు మరికొందరు అతివలు. మరి, నేటి సాంకేతిక రంగంలో ఎఐతో సరికొత్త ఒరవడి సృష్టిస్తోన్న అలాంటి కొందరు మహిళా టెకీల గురించి తెలుసుకుందాం.

**టెక్స్ట్‌ని వీడియోగా మార్చే 'క్రూప్'!** సినిమాలు, సీరియల్స్ ఇతర వినోద కార్యక్రమాల్ని ఒక భాష నుంచి మరో భాషలోకి డబ్బింగ్ చేయడం తెలిసిందే! అయితే ఈ క్రమంలో కొన్ని డైలాగ్స్, పాటలు లిప్ సింక్ కాకపోవడం మనం గమనిస్తుంటాం. మరి, మనమైతే కనీసం మన మాతృభాషలో డైలాగ్స్ విన్నైనా అర్థం చేసుకోగలుగుతాం. అదే బధిరుల విషయానికొస్తే.. కచ్చితత్వంతో కూడిన లిప్ సింక్ వీడియో అయితేనే వాళ్లు అర్థం చేసుకోగలుగుతారు. లిప్ సింక్‌కు సంబంధించిన ఈ లోపాన్ని కృత్రిమ మేధతో పూడ్చా లనుకుంది డాక్టర్ జ్యోతి జోషి. ఈ ఆలోచనతోనే ఓ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసిందామె. ఈ వేదికగా తెరపై కదిలే బొమ్మల పెదాల కదలికల్ని బట్టి కచ్చి తత్వంతో కూడిన లిప్ సింక్ వీడియోలు రూపొందించడంతో పాటు మరికొన్ని సేవల్నిసైతం అందిస్తోందామె. ఇందులో భాగంగా..వినియోగదారులు తమ అవసరాల్ని



బట్టి వ్యక్తిగత వీడియోలు రూపొందించుకోవచ్చు. ఇక సంస్థలు తమ ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేసుకోవడానికి తగిన ట్యుటోరియల్ వీడియోలు సైతం రూపొందించుకోవచ్చు. ఇక చిన్నారులకు ఆయా పాఠాల్ని బోధించే వీడియోల్ని క్రియేట్ చేసుకోవడంతోపాటు.. డిజిటల్ న్యూస్ యాంకర్ సేవల్ని సైతం అందిస్తోందామె. కేవలం టెక్స్ట్, ఆడియోను ఇన్‌పుట్‌గా అందిస్తే చాలు. తమ వద్ద ఉన్న 50కి పైగా విభిన్న అవతార్‌ల సమాయంతో, దాదాపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 25 భాషలకుపైగా నాణ్యమైన వీడియోలు రూపొందించుకోవచ్చని చెబుతోందామె. అంతేకాదు. డిప్‌ఫేక్ వీడియోల్ని పసిగట్టేందుకు తన ప్లాట్‌ఫామ్ ద్వారా ఓ ఆన్‌లైన్ డిప్‌ఫేక్ డిటెక్టర్‌ని కూడా అందుబాటులో ఉంచింది జ్యోతి. ఆస్ట్రేలియాలోని క్యాన్‌బెర్రా యూనివర్సిటీలో కంప్యూటర్ విజన్–స్పీచ్ అనాలిసిస్ విభాగంలో పిహెచ్‌డి పూర్తిచేసిన ఆమె..గతంలో పలు యూనివర్సిటీల్లో మానసిక ఆరోగ్య విశ్లేషకురాలిగానూ పనిచేసింది.



**క్రీడా నైపుణ్యాల్ని విశ్లేషించేలా.. !**

ఏ రంగంలోనైనా మన పనితీరును, నైపుణ్యాల్ని విశ్లేషించుకుంటూ.. వెనకబడిన అంశాలపై దృష్టి సారించినప్పుడే సక్సెసవుతాం. క్రీడా రంగానికి ఇది వర్తిస్తుంది. ఈ క్రమంలోనే క్రీడాకారులు ఎప్పటికప్పుడు తమ క్రీడా నైపుణ్యాల్ని విశ్లేషించుకుంటూ, మెరుగుపరుచుకోవాల్సిన అంశాల్ని గుర్తించి.. తగిన శిక్షణ తీసుకునేలా ప్రోత్సహించేందుకు 'స్టూపా స్పోర్ట్స్ అనలిటిక్స్' పేరుతో ఓ సంస్థను ప్రారంభించింది ఢిల్లీకి చెందిన మేఘా గంభీర్. ప్రస్తుతం ఈ వేదికగా టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాల్ని అభివృద్ధి చేసుకునేందుకు కృత్రిమ మేధ సహాయంతో వారి కోసం కొన్ని ఉత్పత్తుల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో ఒకటి యాప్. క్రీడాకారులు తమ మ్యాచుల్ని ఈ యాప్‌లో అప్‌లోడ్ చేసుకొని.. తమ ఆట తీరుని విశ్లేషించుకోవచ్చు. ఈ క్రమంలోనే తాము ఇంకా మెరుగు పరుచుకోవాల్సిన అంశాలేంటో కూడా ఫీడ్‌బ్యాక్ పొందచ్చు. తద్వారా ఆయ అంశాలపై దృష్టి సారించచ్చు. మరోవైపు 'స్టూపా ఈవెంట్స్' పేరుతో పలు జాతీయ, అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్స్‌తో మమేకమైన మేఘ. వాళ్లు నిర్వహించే రోజువారీ ఈవెంట్స్‌ని మేనేజ్‌చేసే బాధ్యత తీసుకుంది. అలాగే తమ ఎఐ ప్లాట్‌ఫామ్ వేదికగా ఆటలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలు నిర్వహించే బాధ్యతనూ నిర్వర్తిస్తోందామె. ప్రస్తుతం టిఇ క్రీడకే పరిమితమైన తన టెక్నాలజీని భవిష్యత్తులో బ్యాడ్మింటన్, స్క్వాష్, లాన్ టెన్నిస్.. వంటి క్రీడకే పరిమితమైన తన టెక్నాలజీని భవిష్యత్తులో బ్యాడ్మింటన్, స్క్వాష్, లాన్ క్రీడలకూ విస్తరించనున్నట్లు చెబుతోందామె. పంజాబ్ టెక్నికల్ యూనివర్సిటీ' నుంచి ఎంసిఎ పూర్తిచేసిన ఈ స్పోర్ట్స్ లవర్.. గతంలో కొన్నేళ్ల పాటు పలు ప్రముఖ ఐటి కంపెనీల్లో పనిచేసింది.



**ఏఐ నైపుణ్యాల్ని పంచుతూ...** భవిష్యత్తంతా ఏఐతోనే ముడిపడి ఉంది. అందుకే ఎదిగే పిల్లల్ని కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతికతల్లో నిష్ణాతుల్ని చేయడం చాలా ముఖ్యం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొనే ఒక సంస్థను ప్రారంభించింది. చెన్నైకి చెందిన సూర్య ప్రభ గ్రామీణ ప్రాంతాల్లో అందించడం ఈ సంస్థ లక్ష్యం. ఈ క్రమం లోనే గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, వర్క్ షాప్స్ వంటివి నిర్వహించడంతోపాటు ఆన్‌లైన్ వేదిక గానూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఆయా నైపుణానయల్ని వారికి నేర్పిస్తోందామె. కొడైకెనాల్‌లోని మదర్ థెరిసా మహిళా విశ్వవిద్యాలయం నుంచి మైక్రో బయాలజీలో డిగ్రీ పూర్తిచేసి ప్రభ. క్రియేటివ్ నరగాఫిక్ డిజైర్‌గా కొన్నేళ్లపాటు పనిచేసింది. ఆపై కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలపై పట్టు పెంచుకొని ఈ తరం పిల్లల్ని ఈ దిశగా ప్రోత్సహిస్తోంది. వారి బంగారు భవితకు బాటలు వేస్తోంది.

## బూరెల్లాంటి బబ్రూ

బూరెలంటే మనకు మహా ఇష్టం కదూ! కొంచెం అలాంటి వంటకమే బబ్రూ, ఇది హిమాచల్ ప్రదేశ్‌లో ప్రసిద్ధమైన మిఠాయి. దీని కోసం గోధుమపిండి పావుకిలో, బెల్లం 200 గ్రాములు, పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చారెడు, కొబ్బరితురుము పావుకప్పు, సోంపుపొడి చెంచా, ఈస్ట్ ఒకటిన్నర చెంచా, యాలకుల పొడి అర చెంచా, వేయించేందుకు నూనె తీసుకోవాలి, ఎలా చేయాలి.బెల్లం పావులీటర్ నీళ్ల పోసి మరిగించి పాకం పట్టాలి. అది చల్లారేలోగా గోధుమపిండిలో ఈస్ట్ కొబ్బరితురుము, సోంపు, యాలకుల పొడి వేసి కలపాలి. అందులో బెల్లంపాకం జోడించి మరోసారి అరగంట పక్కమంచాలి. ఈ మిశ్రమంతో చిన్న అప్పల్లా వత్తుకోవాలి. కడాయిలో నూనె మరిగించి.. మొస్తే బూరెల్లా పొంగుతాయి, అంతే బబ్రూ తయారైపోతుంది.



**అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా..**

# మహిళల ప్రాబల్యం పెరిగితేనే..



మహిళల కోసం సీట్లు సినిమా టికెట్ల కోసం ఓ రైను బస్సు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం స్త్రీలకు సమానత్వం వచ్చినట్లు కాదు. విద్య, వైద్య, రాజ కీయ, ఆర్థిక, సామాజిక రంగాలన్నింటి లోనూ అసమానతలు తగ్గాలి. నిర్ణయాత్మక స్థానాల్లో మహిళల ప్రాబల్యం పెరగాలి అప్పుడే సమానత్వం సాధించినట్లు: మరి దాన్నెప్పుడు సాదిస్తాం అని అడిగితే. ఇంకా 133 ఏళ్లు పడుతుంది అంటోంది వరల్డ్ ఎకనామిక్ పోడు 'యాక్సెలరేట్ యాక్షన్' అంటూ ప్రయత్నాన్ని వేగవంతం చేయమని ఈ ఏడాది మహిళాదినోత్సవానికి పిలుపునిచ్చింది.స్త్రీ సమానత్వం సాధించడం అంటే ప్రత్యేక హక్కులు తీసుకోవడం కాదు... సమాన హక్కులు పొందడం అలా 116 దేశాల లింగ సమానత్వ సూచీలో ఐస్‌ల్యాండ్ వరుసగా 16వ సారి కూడా అగ్రస్థానాన్ని అందుకుంది. మన పొరుగున అంతర్యుద్ధంతో అల్లాడి పోతోన్న బంగ్లాదేశ్ కూడా మనకంటే మెరుగ్గా 98వ స్థానం సాధించింది. భారత్ స్థానం మాత్రం 127, గతం వంటే ఎనిమిది స్థానాలు ఎగబాకినా సరే... ఇంకా అట్టడుగునే ఉంది. ప్రపంచ ఆర్థిక వేదిక డబ్ల్యుఈఎఫ్) నివేదిక లింగ సమానత్వాన్ని 2158 నాటికి మాత్రమే చూడగల మంట. 133 సంవత్స రాలు పడుతుందన్నమాట. ఈ విషయాన్ని హెచ్చరికగా తీసుకుని.. మరో యాభై ఏళ్ల తరవాత ఈ విషయంలో మాట్లాడు కోకూడదంటే సమానత్వం కోసం 'పోరాడాలి. 'యాక్సెలరేట్ యాక్షన్'... పిలుపు ఉద్దేశం కూడా అదే

**ఆర్థిక అభివృద్ధి :** మహిళలు ఆర్థిక సాధికారత సాధించడం వారి వ్యక్తిగత అభివృద్ధికే కాదు.. ఆ దేశ జీడీపీ పెరుగు దలకూ కీలకమే, మెకిన్సీ గ్లోబల్ ఇన్ నివేదిక ప్రకారం మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పిస్తే 2030 నాటికి గ్లోబల్ జీడీపీలో 12 ట్రిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతుంది. సమాన పనికి సమాన వేతనం, స్టెమ్ రంగాల్లో అవకాశం నాయకత్వ స్థానాలను తీసుకునేలా మహిళలను ప్రోత్సహించడం, ఉద్యోగ భద్రత, ప్రసూతి సెలవులూ, పిల్లల సంరక్షణకు అనుకూల విధానాలు కల్పించడం వంటవి చేస్తే ఫలితం సాధ్యమే.

**నాయకురాలుగా అవకాశం...** కార్పొరేట్ రం గంలో ఎక్కువగా వినిపించే పదం గ్లాస్ సీలింగ్... మహిళల ఎదుగుదల కనిపిం చని ఆంక్షలెన్నో వారి ప్రగతికి అడ్డుపడతాయి. అందుకే, ప్రపంచ వ్యాప్తంగా పని చేస్తున్న కార్మికుల్లో మహిళలు 40 శాతం ఉంటే... భారత నాయకత్వంలో 25-30% మాత్రమే.

నియామకాల్లో లింగ వివక్ష లేకుండా చూడటం, మెంటారింగ్ అందించడం. కుటుంబ బాధ్యతల విషయంలో ఒత్తిళ్ల తగ్గడంతో పాటు వర్క్ హోంకి అనువైన విధానాలు కల్పిస్తే స్త్రీల ఉత్పా దకత పెరుగుతుంది. ఇదే సమానత్వానికి సూచిక.

**మగవాళ్లూ మద్దతివ్వాలి...** లింగ సమా నత్వం మహిళల సమస్య మాత్రమే కాదు. ఇది సమాజ బాధ్యత కూడా. ముఖ్యంగా స్త్రీ హక్కుల పునరుద్ధర ణకు పురుషులు చేయూత నివ్వాలి. పని ప్రదేశాల్లో వివక్షకు వ్యతిరేకంగా నిలబడాలి. ఇంటి పనులను సమానంగా పంచుకోవడం, ఆఫీసుల్లో వేధింపులను అడ్డుకోవడం ద్వారా అసమాన తల్ని తొలగించొచ్చు.

**ఆమె ఆరోగ్యం...** లింగ సమానత్వం అంటే విద్య, ఉద్యోగ అవకాశాల విషయం మాత్రమే కాదు. ఆరోగ్య పరమైన హక్కుల గురించి కూడా. ముఖ్యంగా ప్రసూతి సంరక్షణ, మానసిక ఆరోగ్యాలపై అవగాహన పెంచాలి. హింసకు అడ్డుకట్ట వేయాలి. స్త్రీ ఆరోగ్యంగా ఉంటే.. ఆమె కుటుంబం, ఉద్యోగ స్థలం, సమాజం మెరుగుపడతాయి.

**విద్యే ఆమె శక్తి...** మన దేశంలో పురుషులతో సమానంగా చదువుకునే హక్కు ఆడపిల్లలకు ఉంది. అయినా సామాజిక ఒత్తిళ్లు, పేదరికం, బాల్య వివాహాలు వంటి కారణాలతో నిర్బంధ విద్యాహక్కులు దూరమవుతున్నాయి. ఆమెను శక్తిమంతురాల్ని చేయడానికి బాలికా విద్యకు మరిన్ని నిధులు ఇవ్వాలి. బాల్య వివాహాలను అరికట్టాలి. స్టెమ్ రంగాల్లో చేరేలా ఆడపిల్లల్ని ప్రోత్సహించాలి.. అప్పుడే లింగ సమానత్వం సాధ్యమవుతుంది.

**చట్ట సభల్లో స్త్రీలు:** మహిళల సమస్యలు, సాదకబాధకాలు అర్థం చేసుకోగలిగితేనే వారికి అనువైన చట్టాలు వస్తాయి. హక్కులకు రక్షణ దొరుకుతుంది. చట్టసభల్లో మహిళల సంఖ్య పెరగాలి. కానీ, మన దేశంలో అలా జరగడం లేదు. కేంద్ర కేబినెట్‌లో మొత్తం 30. మంది మంత్రులుంటే.. అందులో కేవలం ఇద్దరే మహిళలు, పలు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ మార్పు రావాలి. పార్టీలకు అవకాశాలు కల్పించాలి. మహిళా రిజర్వేషన్లను రాజకీయ ప్రత్యామ్నాయంగా కాకుండా మహిళా సాధికారత సాధించే ఆయుధాలను మలచాలి. అప్పుడే సమానత్వం సాధ్యమవుతుంది.

## ఉచితాలు..రాయితీలు..

మనలోని శక్తిసామర్థ్యాలు, ఓపిక, త్యాగనిరతి లాంటి ఎన్నో అంశాలకు గుర్తుగా నిర్వహించేదే మహిళా దినోత్సవం. అదే చెబుతూ బోలెడు విషెస్, బహుమతులు అందుకుంటాం కూడా! మీకు మీరూ గిఫ్ట్ ఇచ్చుకోండి. అందుకు సాయపడేవే ఇవి ! శరీరం, మనసు తిరిగి శక్తిని పుంజుకవోలంటే పర్యటనలను మించింది ఏముంటుంది చెప్పండి. పైగా కొత్త విషయాలనూ తెలుసుకోవచ్చు. ఇదే ఆలోచించనట్లుంది ప్రభుత్వం. అందుకే కొన్ని పురాతన కట్టడాలను ఉచితంగా సందర్శించే అవకాశం కల్పిస్తోంది. ఢిల్లీలోని ఎర్రకోట తెలుసుగా? లాల్ కిలా.. రెడ్‌ఫోర్ట్‌గానూ సుపరిచితమైన ఈ కట్టడం యునెస్కో గుర్తింపునీ పొందింది. ఈ కోటను మహిళా దినోత్సవం నాడు దేశ, విదేశీ ఆడవాళ్ళెవ్వరైనా ఉచితంగా సందర్శించొచ్చు. ముంతాజ్‌పై ప్రేమకు గుర్తుగా షాజహాన్ నిర్మించిన తాజ్‌మహల్ కూడా ఈ జాబితాలో ఉంది. ఆగ్రాలోని ఈ ప్రేమ చిహ్నాన్ని ఓసారి సందర్శించేయండి శతాబ్దాల చరిత్రను నెమరేసుకోవాలనుకుంటే 13 వ శతాబ్దంలో నిర్మించిన కుతుబ్‌మినార్ దగ్గరికి వెళ్లొచ్చు. యునెస్కో గుర్తింపు పొందిన ఈ వారసత్వ సంపద కూడా మనకు ఉచిత ఆహ్వానమిస్తోంది. ఇంకా.. భారత్ ఇస్లామిక్ ఆర్కిటెక్చర్‌నూ ఆస్వాదించొచ్చు.



**ఆటలాడదామా? ...**

చివరిసారిగా ఎప్పుడు ఆడారు? హైస్కూలు స్థాయికి రాగానే చదువుపై దృష్టిపెట్టాలంటూ ఆటలకు దూరమవుతాం. కాలేజీలోనైనా ఆఫీసులో నైరా అడపాదడపానే. పిల్లలు పుట్టాక వాళ్లతో సరదా ఆటలాడినా తరవాత అవి మనకు సరిపడవనుకుంటాం. ఎంతసేపూ ఇల్లు, పని అంటూ కూర్చొంటే బోరుకొట్టదూ? సరదాగా బయటికి వెళ్లండి. చిన్న పిల్లలుగా మారి ఆటలాడేయండి అంటూన్నరు కొన్ని సంస్థలు. మిమెన్స్ డే రోజు వండర్‌లా ఒకటి కొంటే మరొకటి ఉచితం అంటోంటే.. రామోజీఫిల్మ్ సిటీ ఈ నెలంతా ఉత్సవాలు నిర్వహిస్తోంది. టాలెంట్ హంట్, రెడ్ కార్పెట్ వెల్‌కట్, ఫ్యాషన్ షో వంటి ప్రోగ్రాములే కాదు. రెండు టిక్కెలపై రూ 500 తగ్గింపునీ ఇస్తోంది. దే అవుట్స్, నెట్ వాక్స్ అంటూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలూ బోలెడు.కాస్త ఓపికగా చుట్టూ చూడాలంగే!

**మనల్నీ పట్టించుకుందాం...**

ఇంట్లో ఎవరికి చిన్న అనారోగ్యమొచ్చినా గిలగిల్లాడిపోతాం. మన విషయానికొచ్చేసరికి చిన్నదేలే అని వదిలేస్తాం. కుటుంబమంతా ఆధారపడేది మనమీదే! అలాంటి మన ఆరోగ్యాన్నే నిర్లక్ష్యం చేస్తే ఎలా? 30 దాటాక ఏటా ఒక్కసారైనా పూర్తి బాడీ చెకప్ చేయించుకోవాలి అంటారు నిపుణులు. ఈ ఏడాది నుంచిమొదలు పెట్టేద్దామా? మెట్రోపొలిస్ హెల్త్‌కేర్ కాంటినెంటల్ హాస్పిటల్ సహా ఎన్నో ప్రముఖ ఆసుపత్రులు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటి స్తాయి. వాటిని వినియోగించుకొంటే సరి. ఎవరి ఇంటికైనా వెళుతున్నా, ఆత్మీయుల ప్రత్యేక సందర్భమైదైనా ఏమిద్దాం అని ఆలోచిస్తాం కదా! మీకు మీరు ఎప్పుడైనా బహుమతి ఇచ్చుకున్నారా? ఇప్పుడు ఇచ్చుకోండి. దుస్తుల దగ్గర నుంచి యాక్సెసరీలు, బ్యాగులు, వాచ్‌లు, నచ్చిన పరికరాలు.. ఇలా అన్నింటిపై అమెజాన్, ఫ్లిప్‌కార్ట్,బిబా వంటి ఎన్నో సంస్థలు 50-80% వరకు ఆఫర్లు ప్రకటించాయి. ఇంతలోనే కొనుక్కోవాలన్న నిబంధన పెట్టుకుంటే బడ్జెట్ దాటుతుందన్న బెంగా ఉండదు. మనసుకీ సంతృప్తి.

## కూరగాయలు పాడవుతున్నాయా !

అప్పటికప్పుడు తాజాగా కూరగాయల్ని కోసుకొచ్చి వండే రోజులు కావివి. కనీసం మార్కెట్ నుంచి కూడా ఏ రోజుకారోజు తెచ్చుకోలేం. అందుకే, వారాని కోసారి మార్కెట్ నుంచి కొనుక్కురావ డం, ఒక రోజు ముందే కట్ చేసుకుని బాక్సుల్లో సర్దుకోవడం వంటి పనులు ఇప్పుడు అందరి జీవితాల్లోనూ ఓ భాగం అయిపోయాయి. ఇంతవరకూ బాగానే ఉన్నా భద్రపరచ డమే ఓ పెద్ద సవాల్. వీటిని ముక్కల్లా కత్తిరించి స్టోర్ చేసినా, నేరుగా కూర గాయల్ని ఫ్రిజ్‌లో పెట్టాలనుకున్నా తేమ లేకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. లేదంటే వాటిల్లో నీరూరి పాడయిపోతుంటాయి. మీకూ ఇలాంటి అనుభవముందా అయితే ఈ సారి ఇందుకోసం డ్రెయిన్ స్టోరేజ్ బాక్సుల్ని ఎంచుకోండి. రకరకాల పరిమాణాల్లో తొరుకుతున్నాయి. ఈ బాక్సుల్లో ఉండే జాలీ నుంచి నీళ్ల అడుగుకి చేరడం వల్ల కూరగాయలూ, పండ్లూ ఏ మాత్రం పాడవ్వవు.



## వ్యథ

# ఆకట్టుకునేలా చదువు చెప్పండి



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న: దండం దశగుణం భవిత్ అంటారు పెద్దవారు. పూర్వపు రోజుల్లో ఉపాధ్యాయులు రకరకాల దండనలు వేసి చదువు చెప్పేవారు. అందుకే చాల మంది ఉన్నతస్థాయి అధికారులు నాయకులు తమ చిన్నతనంలో కొట్టి చదువు చెప్పిన గురువులను ఇప్పటికీ గుర్తుపెట్టుకుని గౌరవిస్తారు. నేను ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లెక్కలు బోధించే ఉపాధ్యాయునిగా ఉన్నాను సహజంగా లెక్కలు అంటే చాల మంది భయపడుతుంటారు అందుకని క్లాస్ ఎగ్గొట్టడం, హోమ్‌వర్క్ చేయకుండా సాకులు చెప్పడం చేస్తుంటారు. అలాంటి వారిని దారిలో పెట్టడానికి నాలుగు దెబ్బలు కొడితే తప్పులేదని నా ఉద్దేశ్యం అలాగే క్రమశిక్షణ తప్పిన విద్యార్థులకు దండనే మంచిదని నా భావం. నేను ఎం.ఎస్‌సి మ్యాథమేటిక్స్, బి.ఇడి చేశాను కాబట్టి నాకు ఉన్న పరిజ్ఞానం అనుభవంతో నా అభిప్రాయాలు వెల్లడిస్తున్నాను. అయితే ఆధునిక సైకాలజిస్టు కొందరు పిల్లలను లేదా విద్యార్థులను కొట్టడం మంచిది కాదంటారు. అమెరికా లాంటి దేశంలో పిల్లలను కొట్టడం మంచిది కాదంటారు. అమెరికా లాంటి దేశంలో పిల్లలను కొడితే కేసులు పెట్టి శిక్షలు విధిస్తారని ఎక్కడో చదివాను. ఇటీవల మా స్కూలోని ఒక అమ్మాయిని నాలుగు దెబ్బలు వేశాను. ఆమెది ఒక పల్లెటూరు. దారిలో నడిచి వెళ్లేటపుడు కొంత మంది పిల్లలు ఆమెను హేళన చేశారు. దీనితో అవమా నానికి గురైన ఆమె మరుసటి రోజు స్కూలు వెళ్ళనని మారాము చేసింది. తల్లిదండ్రులు బలవంతం చేయబోతే బ్లేడుతో గొంతుకోసుకుని చనిపోతానని బెదిరించింద. ఆమె తల్లిదంనరడులు గ్రామ సర్పంచ్‌ని వెంటబెట్టుకుని మా స్కూలుకు వచ్చి ప్రధానోపాధ్యా యునితో నాపై ఫిర్యాదు చేశారు. ఆయన నన్ను తనకార్యాలయానికి పిలిచి వారి ముందే మందలింపు ధోరణితో మాట్లాడారు. వారికి క్షమాపణ చెప్ప మన్నారు. అమ్మాయి భవిష్యత్తు బాగుండాలని కొట్టాను తప్ప కక్ష సాధింపు చర్యగా కొట్టలేదని చెప్పాను. ఇలా క్షమాపణలు చెపితే పిల్లలు ఎవరూ తనను లక్ష్యపెట్టరని వివరించాను. నేనెన్ని చెప్పినా ఆ గ్రామ సర్పంచ్ సమ్మతించలేదు. ఆఖరికి తప్పయితే క్షమించండి అని చెప్పి బయటికి వచ్చేశాను. ఆ సమయంలో నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పిల్లల శ్రేయస్సు కోరి నాలుగు దెబ్బలు వేయడం తప్పా మరి మొద్దు విద్యార్థును దారికి తేవడం ఎలాగో అర్థం కావడం లేదు. దీనిక తగిన మార్గం చెప్పండి. **- సోదరి, అనంతపురం**



**జవాబు :** మీ మనసు నాకు అర్థం అయ్యింది. మీరు భావించినట్టు కొట్టడం, దండించ డంవల్ల చదువు వస్తుందన్న భావన సరికాదు. చదువు రాకపోవడానికి, చదవక పోవడానికి పలు కారణాలు ఉంటాయి. వాటిని గుర్తించి తగిన పరిష్కారాలు సూచించి ప్రేరణ కలిగించడం ఉత్తమ మార్గం. విద్యార్థుల తెలివి. తేటలు, ప్రజ్ఞ ఇష్టం, ఆసక్తి లక్ష్యం ఒకేలా ఉండదు. అలాగే శారీరక, మానసిక, కుటుంబ, ఆరోగ్య పరిస్థితులు వేరు వేరుగా ఉంటాయి. ఆకలి, నీరసం, నిద్ర లేమి, పేదరికం అణచివేత లాంటి పలు సమస్యలు మానసిక స్థితిని దెబ్బతీస్తాయి. కొన్ని అనారోగ్య సమస్యల వద్ద కొందరు సరిగా చదవలేకపోతుంటారు. కొందరు నెమ్మదిగా నేర్చుకుంటారు. కొందరికి ప్రాథమిక సూత్రాలు తెలియక తికమకపడు తుంటారు. ఇలాంటి అనేక అంశాలను గమనించి పిల్లలను ప్రేమగా దారిలోకి తెచ్చుకోవాలి. మీరు అన్నట్టు దండం దశగుణం భవీత్ అంటే కొట్టమని అర్థంకాదు. దండం అంటే కర్ర, అది పది రకాలుగా ఉపయోగపడుతుందని భావం. పక్షులు, కుక్కలు, శత్రువులు, సాములు, పశువుల నుంచి రక్షణ పొంద టానికి లేదా కొట్టడానికి కర్ర పనికి వస్తుంది. బురదలో, నీటిలో, గుడ్డితనంలో, చీకటిలో ముసలితనంలో నడవ డానికి ఆసరాగా ఉంటుం దని చెపుతారు. అయితే ఈ భావాన్ని వక్రీకరించి దండస్తే కాని చదువు రాదు. దేవనికైె నా దెబ్బే గురువు అనడంకొందరికి అలావాటు అయింది. మిమ్మల్ని క్షమాపన కోరినందుకు కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి అన్నారు. పిల్లల మనసు అలాగే గాయపడు ఉందన్న విషయం గ్రహించండి. పిల్లలను ఆకట్టుకుని, ఆహ్లాదపరచి చదువు చెపనపడం అలవాటు చేసుకోండి.

## శరణు వేడితే చాలు !

**ఆధ్యాత్మికం**

నల్ల మస్తాన్ గారు గుంటూరుకు వచ్చిన తొలి దినాలలో ఒక రోజు ఉరుములు, మెరుపులతో కుంభవృష్టిగా వాన కురవసాగింది. విశేషమేమిటంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి ఇంటిపై ఒక వర్షపుచుక్క కూడ పడకపోవటం. ఇంతలో పిడుగు పడి ఒక మేక పిల్ల. ఒక మనిషి మరణించారు. వర్షం తగ్గింది. మస్తాన్ గారు సమాధి నుండి లేవగానే మరణించిన మేకపిల్ల కనిపించింది. ఆయన దానివద్ద కూర్చొని, భగవధ్యానం చేసి, దాని చుట్టూ ముమ్మారు తిరిగి 'ఉఠో' అన్నారు. ఆ మేకపిల్ల లేచి మస్తాన్ గారి పాదాల సందునుండి దూరి వెళ్లిపోయింది. ఈ వార్త ఊరంతా వ్యాపించగా పిడుగుపాటుతో మరణించిన వ్యక్తి తల్లి వచ్చి,మస్తాన్ గారి పాదాలను పట్టుకుని వల, వల దుఃఖించింది. కరుణా సముద్రుడు ఆ తల్లి దుఃఖం చూడలేకపోయాడు. శవం వద్దకు పోయి దైవ ధ్యానం చేసి, శరీరాన్ని తాకాడు. వెంటనే విగత జీవికి ప్రాణం వచ్చింది. లేచి కూర్చున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన ఏ జీవి అయినా అదృష్టవంతులే, జంతువు కావచ్చు, మనిషి కావచ్చు. షిరిడీలోని ద్వారాకామాయిలో కొలువై ఉన్న సాయి ఇందుకు భిన్నుడు కాదు. అది 1917వ సంవత్సరం. వైశాఖ మాసం (మే నెల). ఎండలు మండిపోతాయని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ఒక పిచ్చి కుక్కచే కరవబడిన ఒక చిన్ని కుక్క వెంట బడ్డారు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అనే నానుడి జంతువులకు కూడా వర్తిస్తుంది. అది ద్వారకా మాయిలోనికి పరుగు తీసింది. గ్రామస్తులందరు అది బయటకు వస్తే చంపటానికి బయట నిలబడి 'బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరమండి, దానిని చంపెదము అనగా, సాయిబాబా పిచ్చివారలారా! దూరంగా పొండు. దిక్కులేని ఈ చిన్న జీవిని చంపదలచినారా. అన్నాడు. ఆ జీవి రక్షణ పొందింది. అంతియే కాదు దాని పిచ్చి కూడా మటుమాయమైంది. సాయినాథుని పాదధూళితో పరమ పావనమైన ద్వారకామాయిని శరణు వేడిన వారికి ఆపదలు ఆమడ దూరం పోతాయి. సాయి రక్షణ పొందిన చాలు భీతికి తావు ఉండదు.



**- యం.పి.సాయినాథ్**

ఆట

# ఒకే ఒక్క ఫాస్ట్ బౌలర్‌తో ఎంట్రీ

## ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా అరుదైన ఘనత

## 97 యేళ్ల క్రికెట్ చరిత్రలో తొలిసారి



**న్యూఢిల్లీ:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో తొలి సెమీఫైనల్, భారత్ నాకౌట్ మ్యాచ్ లో ఒకే ఒక్క ఫాస్ట్ బౌలర్‌తో మైదానంలోకి అడుగుపెట్టింది. దీంతో 97 సంవత్సరాల అంతర్జాతీయ క్రికెట్‌లో, ఐసీసీ ఈవెంట్‌లో సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో ఇటువంటి కలయికతో టీమిండియా బరిలోకి దిగడం ఇదే మొదటిసారి. ఇదే వేదికపై న్యూజిలాండ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో మొత్తం నలుగురు స్పిన్ బౌలర్లతో బరిలోకి దిగిన భారత జట్టు విజయాన్ని నమోదు చేసింది. కొత్త పిచ్‌పై జరుగుతున్న మ్యాచ్‌లో పలువురు పేసర్లు లేకపోవడం విమర్శలకు దారితీసినప్పటికీ, ఆస్ట్రేలియాను 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌట్‌చేయడం ద్వారాభారత్ తమ ఎంపికను దాదాపుగా సమర్థించుకుంది. ముఖ్యంగా ఐసీసీ వన్డే సెమీఫైనల్స్ లేదా ఫైనల్స్‌గురించి మాట్లాడుకుంటే, ఒక జట్టు ఒకటి కంటే ఎక్కువ పేసర్లను ఆడించకపోవడం ఇది నాల్గవసారి మాత్రమే. ఆసక్తికరంగా, మొదటి రెండు సంఘటనలు వరుసగా 1998, 2000లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ మొదటి రెండు ఎడిషన్లలో చోటు చేసుకున్నాయి. ఢాకా, నైరోబీలలో జరిగిన అరుదైన కాంబినేషన్ల తర్వాత దశాబ్దం పాటు, శ్రీలంక ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో ఇటువంటి కాంబినేషన్‌ను అమలు చేసిన మొదటి జట్టుగా నిలిచింది. కొలంబోలో తమ ప్లేయింగ్ శ్రీ.లో లసిత్ మలింగతో న్యూజిలాండ్‌ను ఎదుర్కొంది. ఒక జట్టు ఒక స్పెషలిస్ట్ ఫాస్ట్ బౌలర్‌తో ప్రపంచ కప్ సెమీఫైనల్ లేదా ఫైనల్ ఆడటానికి ధైర్యం చేసిన జట్టుగా శ్రీలంక నిలిచింది. అయితే, ఇటువంటి కలయికను గత రెండు ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లలో ఏడు సార్లు ప్రయత్నించారు. ముందుగా, దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలోని పరిస్థితుల కారణంగా భారతదేశం ప్లేయింగ్ 11లో మహమ్మద్ షమీతో పాటు హర్షిత్ రాణా లేదా అర్ష్‌దీప్ సింగ్‌ను చేర్చలేదు. షమీ, ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఇద్దరూ కలిసి 15.3-0-88-4 గణాంకాలను నమోదు చేశారు. దీనికి విరుద్ధంగా, నలుగురు భారత స్పిన్నర్లు 5.17 ఎకానమీ రేటుతో 34-2-176-5తో రాణించడం విశేషం.

### భారత్‌తో ఓటమి ఫలితం:

# వన్డేకు ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ రిటైర్మెంట్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ స్టీవ్ స్మిత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. వన్డే క్రికెట్‌కు స్మిత్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం జరుగుతున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 సెమీఫైనల్లో భారత్ చేతిలో ఓటమి అనంతరం స్మిత్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నాడు. ఈ నెల 4వ తేదీన భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా పరాజయం పాలైంది. ఈ మెగా టోర్నీలో ఆస్ట్రేలియా టీమ్‌కు తాత్కాలిక కెప్టెన్‌గా స్మిత్ వ్యవహరించాడు. టెస్టు క్రికెట్ ప్రాధాన్యత ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్మిత్ తెలిపాడు. "వన్డేల్లో నా ప్రయాణాన్ని ముగించాలని నిర్ణయించుకున్నాను.

నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలు ఉన్నాయి. రెండు ప్రపంచ కప్‌లు గెలిచిన జట్టులో భాగంగా ఉండడం నాకు ఎల్లప్పుడూ ప్రత్యేకమే. ఎంతో మంది సహచరలతో కలిసి నా క్రికెట్ జర్నీని కొనసాగించాను. 2027 వన్డే ప్రపంచ కప్‌కు యువ ఆటగాళ్లను సిద్ధం చేసేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నాను. అందుకే వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలికేందుకు సిద్ధమయ్యాను. ముఖ్యంగా అ అత్యున్నత స్థాయిలో క్రికెట్ ఆస్ట్రేలియాకు ప్రాతినిథ్యం వహించడం ఎల్లప్పుడూ నాకు గర్వకారణమే. ఎల్లో జర్సీ ధరిస్తే కలిగే ఆ అనుభూతిని వర్ణించలేం. నా ఈ ప్రయాయాణంలో సపోర్ట్‌గా నిలిచిన క్రికెట్ ఆస్ట్రేలియాకు, సహచరులు, అభిమానులకు ధన్యవాదాలు. ఇకపై టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలను కుంటున్నాను. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్, వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ల కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాను" అంటూ స్మిత్ ఓ ప్రకటనలో పేర్కొన్నాడు.

### ఐసిసి ర్యాంకింగ్స్‌లో దుమ్ము రేపిన

# కోహ్లీ, అక్షర్

### దిగజారిన రోహిత్, శ్రేయస్



**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాళ్లు సత్తా చాటారు. ఏకంగా నలుగురు బ్యాట్స్‌మెన్స్ టాప్ 10 స్థానాల్లో కొనసాగుతున్నారు. బ్యాట్స్‌మన్ల విభాగంలో శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మలు భారీ నష్టాన్ని చవిచూడగా, విరాట్ కోహ్లీ మాత్రం లాభపడ్డాడు. అయితే, శ్రేయాస్ అయ్యర్ కూడా భారీగా జంప్ చేశాడు. ఒకవైపు, టీం ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లోకి ప్రవేశించింది. మరోవైపు, ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్ల ప్రభావం కనిపించింది. శుభ్‌మాన్ గిల్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతుండగా, విరాట్ కోహ్లీ ఒక స్థానం ఎగబాకి నాల్గవ స్థానానికి చేరుకున్నాడు. అయితే, కెప్టెన్ రోహిత్ శర్మ రెండు స్థానాలు దిగజారి ఐదవ స్థానానికి చేరుకున్నాడు. బాబర్ అజామ్ గురించి మాట్లాడుకుంటే, అతను రెండవ స్థానంలో, హెన్రిచ్ క్లాసెన్ 3వ స్థానంలో ఉన్నాడు. ఐసీస మెన్స్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్ 5లో శుబ్మన్ గిల్ (ఇండియా) 791 రేటింగ్ పాయింట్లు, బాబర్ ఆజం (పాకిస్తాన్) 770 రేటింగ్ పాయింట్లు, హెన్రిచ్ క్లాసెన్ (సౌతాఫ్రికా) 760 రేటింగ్ పాయింట్లు, విరాట్ కోహ్లీ (ఇండియా) 747 రేటింగ్ పాయింట్లు, రోహిత్ శర్మ (ఇండియా) 745 రేటింగ్ పాయింట్లతో ఉన్నారు. ఇదిలా ఉంటే ఐసీసీ మెన్స్ ఆల్రౌండర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ అక్షర్ పటేల్ దుమ్ములేపాడు. ఏకంగా 17 స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకు సాధించాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ టాప్లో కొనసాగుతుండగా, సౌతాఫ్రికా స్పిన్ బౌలర్ కేశవ్ మహరాజ్ రెండు స్థానాలు మెరుగుపరచుకుని రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇక న్యూజిలాండ్ స్టార్ మ్యాట్ హెన్రీ మూడు స్థానాలు ఎగబాకి మూడో ర్యాంకులో నిలిచాడు.











### వరల్డ్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీలో..

# మెయిన్ డ్రాకు శ్రీకాంత్, శంకర్ అర్హత

### హైదరాబాదీ ప్లేయర్ తరుణ్ ఓటమి

### రైజింగ్ స్టార్స్ ఉన్నతి, ఇషారాణి గెలుపు

**న్యూఢిల్లీ:** ఓర్లీన్స్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మన్నేపల్లి తరుణ్ మినహా మిగిలిన పురుష, మహిళల సింగిల్స్‌లో భారత్ స్టార్లు రాణించారు. భారత్ స్టార్ కిడాంబి శ్రీకాంత్,స్టార్‌ప్లేయర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.పారిస్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో శ్రీకాంత్,ముత్తుస్వామి ఆడిన 2మ్యాచ్‌ల్లోనూ గెలుపొందారు. తొలి రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ శ్రీకాంత్ 21-8, 21-14తో డెన్మార్క్‌కు చెందిన మాడ్స్ క్రిస్టోఫర్సన్ పైగెలిచాడు. అనంతరం రెండో రౌండ్‌లో శ్రీకాంత్ 21-11, 14-21, 21-12తో ఫ్రాన్స్‌కు చెందిన అర్నాడ్ మెర్కెల్‌పై విజయం సాధించాడు. 55 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ మూడో గేమ్‌లో ఒక దశలో వరుసగా 9పాయింట్లు సాధించి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. భారత్‌కేచెందిన మరో ప్లేయర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ కూడా మెయిన్ డ్రాకు చేరుకున్నాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో శంకర్ 21-19, 19-21, 21-19తో డెన్మార్క్‌కు చెందిన మాగ్నుస్ జొహాన్సెన్‌పైన, రెండో రౌండ్‌లో 21-18, 21-12తో భారత్‌కే చెందిన రితిక్స్ సంజీవ్ సతీశ్ కుమార్‌పై గెలుపొందాడు. హైదరాబాద్‌కు చెందిన మన్నేపల్లి తరుణ్ మెయిన్ డ్రాకు చేరుకోవడంలో విఫలమయ్యాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో తరుణ్ 21-17, 9-21, 16-21తో చైనీస్ తైపీకి చెందిన జువో ఫు లియావో చేతిలో ఓడిపోయాడు. కాగా మహిళల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్స్ ఉన్నతి హుడా, ఇషారాణి బారువా కూడా మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో ఉన్నతి 21-12, 21-16తో చైనీస్ తైపీకి చెందిన సియు టాంగ్ టుంగ్‌పై, రెండో రౌండ్‌లో 21-13, 21-15తో మలేషియాకు చెందిన కిసోనాపై గెలిచింది. ఇక ఇషారాణి క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో 12-21, 21-10, 21-12తో ఫ్రాన్స్‌కు చెందిన జుయ్బ్బె కి పై, రెండో రౌండ్‌లో 25-27, 21-16, 23-21తో డెన్మార్క్‌కు చెందిన అమెలీ షుల్జ్‌పై విజయం సాధించింది.

# కెప్టెన్ రిజ్వాన్, స్టార్ బాబర్‌పై వేటు

**న్యూఢిల్లీ:** స్వదేశంలో జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఘోరంగా విఫలమై లీగ్ దశలో ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండానే నిష్క్రమించిన పాక్ జట్టులో భారీ మార్పులకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)శ్రీకారం చుట్టింది. ఈనెల 16 నుంచి న్యూజిలాండ్‌తో జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు గాను ఆ జట్టు సారథి మహ్మద్ రిజ్వాన్‌తో పాటు, స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌పై వేటు



వేసింది. గత కొంతకాలంగా పొట్టి ఫార్మాట్‌లో ఈ ఇద్దరూ మరీ నెమ్మదిగా ఆడుతూ తీవ్రస్థాయిలో విమర్శలెదుర్కొంటున్నారు. చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడిన రెండు మ్యాచ్‌లలో అదే ఆటతీరుతో విఫలమైన నేపథ్యంలో పీసీబీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. రిజ్వాన్‌ను టీ20ల నుంచి తప్పించిన పీసీబీ.. యువ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ సల్మాన్ అలీ అఘాకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. చాలాకాలం తర్వాత షాదాబ్ ఖాన్ జట్టులోకి రాగా అతడికి వైస్ కెప్టెన్సీ దక్కింది. అయితే టీ20లలో స్థానం దక్కించుకోలేకపోయినా వన్డేలలోమాత్రం రిజ్వాన్,బాబర్ తమ స్థానాలను నిలుపుకున్నారు.కానీ స్టార్‌పేసర్లు హారీస్ రౌఫ్, షహీన్ షాఅఫ్రిది వన్డే జట్టుకు ఎంపిక కాలేదు. హెడ్‌కోచ్ అకీబ్ జావేద్‌పై వేటు పడుతుందని ఊహాగానాలువినిపించినా పీసీబీ మాత్రం అతడిని కొనసాగించింది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, మార్చి 5:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిసాయి. ఆసియా మార్కెట్ల నుంచి సాను కూల సంకే తాలతో ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన సూచీలు, రోజంతా అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. రూపాయి బలపడడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం కూడా సూచీలు కలిసొ చ్చింది. దీంతో వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఓ దశలో సెన్సెక్స్ 900 పాయింట్ల మేర లాభ పడగా, నిఫ్టీ కూడా 22,400 మార్కుకు చేరువైంది. చివరికి నిఫ్టీ 22,350 పాయింట్ల చేరువ లో ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా 2శాతం మేర లాభపడ్డాయి. ఉదయం సెన్సెక్స్ 73,005.37 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై రోజంతా అదే ధోరణిని కనబరిచింది. ఇంట్రాడేలో 73,933.80 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరింది. చివరికి సెన్సెక్స్ 740.30 పాయింట్ల లాభంతో 73,730.23 పాయింట్ల వద్ద నిలి చింది. నిఫ్టీ 255.80 పాయింట్లు పెరిగి 22,338.45పాయింట్ల వద్ద నిలిచింది. బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండస్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, జొమా టో, మారుతి సుజుకి మినహా మిలిగిన అన్ని షేర్లూ లాభాల్లో ముగి సాయి. అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్‌టిపిసి వంటి షేర్లు ప్రధా నంగా లాభపడ్డా యి. అంతర్జా తీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 70.52 డాలర్ల వద్ద ట్రేడయింది. బంగా రం ఔన్సు 2929 డాలర్ల వద్ద కొనసాగింది.




# బులియన్ మార్కెట్ కళకళ

**ముంబై, మార్చి 5:** ఈ మధ్యకాలంలో బంగారం ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎదుగుతున్నాయి. బుధవారం 22 క్యారెట్ల 10 గ్రాములకు రూ.550 పెరగ్గా, 24క్యారెట్లకు రూ.600 చొప్పున పెరిగింది. 24 క్యారెట్ల బంగారం ధర రూ.87,980, 22 క్యారెట్ల ధర రూ.80,650గా ట్రేడ యింది. ఇక కిలోవెండి ధర రూ.1,07,000 వద్ద స్థిరంగా ఉంది. గడచిన 10 రోజుల్లో చూస్తే పసిడి ధర తగ్గినట్లు తగ్గి మళ్లీ ఊపందుకుంది. దీంతో కొనేందుకు ప్లాన్ చేసుకున్న సామాన్యులకు భారీ షాక్ తగిలింది. అయితే ఈ యేడాది మొదటి నుండే బంగారం, వెండి ధరలు రాకెట్ల పెరుగుతూ వస్తున్నాయి. ఒక విధంగా ఎన్నడూలేని విధంగా రేట్లు ఎగబాకాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నడుస్తుంది. దీంతో సామాన్యుడి కల కలగానే మిగిలిపోతుంది. విజయవాడలో 22క్యారెట్ల ధర రూ.80.650 గా ఉండగా, 24 క్యారెట్లు రూ.87,980గా ఉంది. విశాఖపట్నంలో 22 క్యారెట్ల ధర రూ.80,650, 24క్యారెట్లధర రూ.87,980. హైదరాబాద్‌లో 22క్యారెట్లధర రూ.80,650, 24 క్యారెట్ల ధర రూ.87,980గా ఉన్నాయి. వెండి కిలోకి రూ.1,07,000. అంతర్జాతీయ మార్కెట్ ధరలు, ప్రభుత్వ పన్నులు ఇంకా రూపాయి విలువలో హెచ్చుతగ్గులు వంటి అనేక కారణాల వల్ల భారతదేశంలో బంగారం ధర మారుతూ ఉంటుంది. బంగారం పెట్టుబడిగా మాత్రమే కాదు, మన సంప్రదాయాలు ఇంకా పండుగలలో కూడా ఒక ముఖ్యమైన భాగం. ప్రత్యేకంగా చెప్పాలంటే వివాహాలు, తెలుగు పండుగల సమయంలో దీనికి కొనుగోళ్ల డిమాండ్ పెరుగుతుంది.

# రాబడులపై పన్ను తగ్గింపు!

న్యూఢిల్లీ, మార్చి 5: ఈక్విటీ మార్కెట్ లు ఇటీవల కాలంలో భారీగా పడిపోతున్న నేపథ్యంలో దీర్ఘకలిక లాభా లపై వచ్చే రాబడులపై పన్నుల ప్రభావాన్ని తగ్గించాలనే డిమాండ్ పెరుగుతోంది. భారత ప్రభుత్వం దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టిసిజి) నిర్మాణాన్ని సమీక్షించాలని మార్కెట్ వర్గాలు కోరుతున్నాయి. రెవెన్యూ ఆందోళనల కారణంగా పూర్తి పన్నును ఉపసం హరించుకోవడం సాధ్యం కానప్పటికీ, దాని నిర్మాణాన్ని సవరించాలని తెలియచేస్తున్నాయి. దాని వల్ల భారత మార్కెట్లను మరింత ఆకర్షణీయంగా మార్చాలని ఆశావహం వ్యక్తం చేస్తున్నాయి. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు నుంచి విదేశీ ఇన్వెస్టర్ల లాభాలపై పన్ను విధించే అతికొద్ది మార్కెట్లలో భారత్ ఒకటి. భారీ నష్టాలు, తక్కువ రాబడులు, పన్ను భారాలు భారతీయ ఈక్విటీ మార్కెట్‌లపై ఆకర్షణను తగ్గిస్తున్నా యని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దాంతో ఇన్వెస్టర్లలో అసంతృప్తి పెరుగుతోందని చెబుతున్నారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ ప్రైమ్




రీసెర్చ్ హెచ్ దేవర్ష్ వకీల్ మాట్లాడుతూ, విదేశీ, భారతీయ పెట్టుబడిదారులకు ఎల్టీసీజీ పన్నులను పూర్తిగా రద్దు చేయాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వ ఆదాయ అవసరాలను గురినతంచి పన్ను మినహాయింపుల హోల్డింగ్ వ్యవధిని యేడాది నుంచి రెండు లేదా మూడేళ్లకు పొడిగించాలని ఆయన ప్రతిపాదించారు. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లపై ఎల్టీసీజీ పన్నులకు సంబంధించి హీలియోస్ కేపిటల్‌కు చెందిన సమీర్ అరోరా స్పందించారు. విదేశీ మార్కెట్లు మరింత అనుకూలమైన పన్ను విధానాలను అనుసరిస్తున్న నేపథ్యంలో భారత్ ఎల్టీసీజీ వంటి పన్ను పద్ధతులను అనుసరించడం విదేశీ పెట్టుబడులను నిరోధించగలవని చెప్పారు. 2024 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మూలధన లాభాల పన్ను రేట్లలో మార్పులు తీసుకొచ్చారు. లిస్టెడ్ ఈక్విటీ షేర్లపై ఎల్టీసీజీ పన్నును 10శాతం నుంచి 12.5శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ సర్దుబాట్లు పన్ను నిర్మాణాన్ని సరళతరం చేయడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ, అవి పెట్టుబడిదారుల సెంటిమెంటుపై ప్రభావం చూపుతున్నట్లు కొందరు నిపుణులు ఆందోళన వ్యకనతం చేస్తున్నారు. ఎల్టీసీజీ నిర్మాణాన్ని హేతుబద్ధీకరించడం వల్ల ఆదాయ పెరుగుదల, మార్కెట్ పోటీతత్వం మధ్య సమతుల్యత సాధించవచ్చని భావిస్తున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.